# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

అక్టోబర్
2023

వెల: రూ.
25/-





తేది 07-09-2023 గోకులాష్టమి రోజున తిరుమల శ్రీవేంకటేశ్వరునికి
21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు









# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 16 **సంచిక:** 10


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
**రమేష్**

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| జయ జయహే మహిషాసుర మర్ధిని... | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| దశావతార వ్రతము | 18 |
| జ్ఞాన సంబంధ నయనార్ | 21 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 25 |
| అమ్మకథలు – వాగ్ బీజాక్షరం | 31 |
| రామాయణ రత్నాకరం | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 40 |
| తిరుమలల శ్రీవారికి ఓటి కుండలో నివేదన | 44 |
| తిరుమల సర్వస్వం | 47 |
| శరన్నవరాత్రి వైభవము | 51 |
| శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము | 54 |
| ముకుందమాల | 59 |
| జమ్మిచెట్టు ప్రాధాన్యత | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# ప్రార్థన

శ్రీవేంకటేశం పాఠకులకు విజయదశమి శుభాకాంక్షలు.

కలియుగ మానవుడు తరించాలంటే తిరుమల శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ ఒక్కటే ఏకైక మార్గమని నమ్మి,స్వామివారి నామాన్ని అందరిచే స్మరింపచేయాలనే ఏకైక లక్ష్యంతో శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంస్థ సం. 2002 విజయదశమినాడు ఏర్పడింది. శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షం చేత ఈ సంస్థకు మరిన్ని శాఖలు ఏర్పడి స్వామివారికి, ఆయన భక్తులకు మా శక్తిమేర సేవ చేస్తున్నాము. తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ, నమోవేంకటేశాయ రథయాత్ర, శ్రీవేంకటేశం మాసపత్రిక, భజగోవిందం, శ్రీశ్రీనివాస కళ్యాణాలు అన్నవి ఇతర శాఖలు. మొత్తం మా కార్యక్రమాలకు కర్త, కర్మ, క్రియ శ్రీవేంకటేశ్వరుడే. మేము కేవలం నిమిత్తమాత్రులము. ఈ సంస్థ ప్రారంభించి 21 సం.లు దాటిన కారణంగా మా కార్యకలాపాలు గురించి వాటి సామర్థ్యం గురించి పునరాలోచించుట కర్తవ్యంగా భావిస్తున్నాము. ఇప్పటి వరకు 21 పర్యాయంగా 7 కోట్ల జపసమర్పణ స్వామివారికి సమర్పించాము. 16 సం.లు రథయాత్ర చేశాము. 18 సం.ల నుండి శ్రీవేంకటేశం మాసపత్రిక నడుపుచున్నాము. 13 సం.ల నుండి భజగోవిందం, మరియు సం. 2021 జులై నుండి శ్రీశ్రీనివాస కళ్యాణాలు కార్యక్రమము ప్రారంభించి ఇప్పటి వరకు 53 కళ్యాణాలను చేయగలిగాము. భగవంతుని ప్రతి లీల భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా జరుగుతుంది. మనము ఉద్ధరించబడుటకే శ్రీమన్నారాయణుడు వైకుంఠం విడిచి తిరుమల కొండకు విచ్చేశాడు. కేవలం ఆయన నామస్మరణ మాత్రము చేత ఈ కలియుగ మానవుడు తరింపబడుచున్నాడు. అట్లని ఏదో నామమాత్రంగా ఆయనను కొలుస్తే సరిపోదు. మనసా వాచా కర్మణ అనుసరించాలి. భగవంతుని మెప్పే ప్రధానంగా నడుచుకుంటూ సేవ చేయువారు మొదటి తరగతి భక్తులు. వీరు, వారి తృప్తికంటే భగవంతుని తృప్తే ప్రధానంగా భావించి సేవ చేస్తారు. ఈ రకమైన సేవకులను తయారు చేయుట ఈ పీఠం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాము. కాని దురదృష్టవశాత్తు ఇంతవరకు స్వామివారు ఆశించిన స్థితికి రాలేకపోయాము. గత 21 సం.ల నుండి మా సేవలో పాలుపంచుకున్న ఎంతోమంది భక్తులకు శ్రీవేంకటేశ్వరుని స్వప్న సాక్షాత్కారము లభించి ధన్యులైనారు. ఇక లౌకిక సమస్యలు తీరినవారు మరెందరో ఉన్నారు. కలియుగ మానవుడు ఈ మాయాజగత్తులో ఇరుక్కొని అరిషడ్వర్గాలైన కామ క్రోధ లోభ మోహ మధ మాత్స్యర్యాలనే వాటికి లోనై జీవితాలను పాడుచేసుకొంటున్నాడు. ఈనాటి మానవులు నిర్బలులు అయిన మాట వాస్తవం. కాని ఒక్కసారి మనసారా శ్రీవేంకటేశ్వరుని ధ్యానించి స్మరిస్తే అనుగ్రహిస్తానని స్వయంగా స్వామివారే చెప్పాడు. తాను వెలసిన భంగిమ కూడా దీనినే చెబుతుంది. తన పాదాలను ఆశ్రయించిన వారిని అక్కున చేర్చుకుందునని చెప్పుచున్నారు. పూర్వం అజామిళుణుడు కేవలం ఒక్కసారి స్వామిని స్మరించి ఉద్ధరించబడిన సంగతి తెలిసిందే. పైగా ఇది కలియుగము కాబట్టి ఒక్కసారి స్వామివారిని తన వాడనుకొని జీవించువారు ధన్యులుగా ఉండగలరు.

ఇక మా పీఠం విషయానికి వస్తే స్వామివారికి ఒక్కటే ప్రార్థన. ప్రభూ! శ్రీవేంకటేశ్వర! మీరు తరతరాల జీవులకు మీ కృపాకటాక్షాలు లభించాలని, వారందరిని ఉద్ధరించాలనే ఉద్దేశ్యంతో మమ్మల్ని ఎన్నుకున్నారు. మేము కలియుగ మానవులము ఎన్నో తప్పులు మావల్ల జరిగినవి. మీ కృపా విశేషం చేతనే మీరు ఆశించిన స్థితిక రావడం సాధ్యపడుతుంది, లక్ష్యం నెరవేరుతుంది. కాబట్టి యోగ్యత ప్రసాదించి హరినామ క్షేత్రం ఏర్పరచగలరని ప్రార్థన.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన
ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:________________
________________
చిరునామా:________________
________________
________________
________________
________________
పిన్‌కోడ్:________________
చందా వివరాలు:________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**శ్లో॥ పంచాన నాబ్జభవ షణ్ముఖ వాసవాద్యాః**
**త్రైవిక్రమాది చరితం విబుధా స్తువంతి**
**భాషాపతిః పఠతి వాసరశుద్ధి మారాత్**
**శేషాద్రి శేఖర విభో! తవ సుప్రభాతమ్॥**

తాత్పర్యం: శేషాద్రిశా! శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలందరు నీ వామనావతారాది (త్రివిక్రమావతారము మొదలగు) వీర చరిత్రలను కీర్తించుచున్నారు. బృహస్పతి పంచాంగమును చూచి దినశుద్ధిని చెప్పుచున్నాడు స్వామీ! నీకు శుభోదయమగుగాక!

విశే॥ శివునకు అయిదు తలలుగలవు. అవి ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాతములు. అబ్జభవుడు – శ్రీమన్నారాయణుని నాభికమలము నుండి జన్మించినవాడు – బ్రహ్మ. ఆరుగురు కృత్తికల తల్లిపాలు త్రాగుటకు వీలుగా ఆరు ముఖములు గలవాడు – కుమారస్వామి (సుబ్రహ్మణ్యుడు) వాసవుడు – అష్ట వసువులకు నాయకుడైన ఇంద్రుడు. త్రివిక్రముడు– విష్ణుదేవుడు వామనావతారమున బలిచక్రవర్తి నుండి మూడు అడుగుల భూమిని దానం తీసుకొని త్రివిక్రముడై మూడు పాదములతో లోకమును కొలిచిన అద్భుత చరిత్ర మొదలగు వీరచరిత్రలు గలవాడు – విష్ణుదేవుడు.

భాషాపతి= వాక్పతియగు బృహస్పతి, దేవతలకు పురోహితుడు. ఇతడు పంచాంగమును (తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అను అయిదు అంగములు గలది) చూచి దినశుద్ధి (అనగా దినమున మంచి సమయము, విడువదగిన కాలము, వర్జ్యము, దుర్ముహూర్తము, రాహుకాలము మున్నగు వానిని గూర్చి చెప్పుట) చెప్పుచున్నాడు. శేషాద్రిపై వెలసియున్న వేంకటేశ్వర స్వామికి నేటికీ ఉదయమున జరిగే తోమాల సేవకు, అర్చనకు మధ్య కాలమున పంచాంగ పఠన సేవ జరుగుచున్నది.

**వ్యాఖ్యానం: డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

# ముక్తిమార్గము



## గుండక్రియ

తెలియఁ జీఁకటికి – దీపమెత్తక పెద్ద<br>
వెలుఁగు లోపలికి – వెలుఁగేలా ? ||పల్లవి||

1. అరయ నాపన్నుని – కభయ మీవలెఁగాక<br>
ఇరవైన సుఖిఁగాన – నేలా ?<br>
వఱతఁ బోయెడివాని – వడిఁదీయవలెఁగాక<br>
దరివానిఁ దివియఁగఁ – దానేలా ? ||తెలి||

2. ఘనకర్మారంభుని – కట్లు విడవలెఁగాక<br>
యెనసి ముక్తునిఁగాన – నేలా?<br>
అనయము దుర్బలుని – కన్నమిడవలెఁ గాక<br>
తనిసిన వానికిఁ – దానేలా ? ||తెలి||

3. మితిలేని పాపక – ర్మికిఁ దావలెఁ గాక<br>
హిత వెలుఁగు పుణ్యుని – కేలా ?<br>
ధృతి హీనుఁ గృపఁజూచి – తిరువేంకటేశ్వరుఁడు<br>
తతిఁ గావకుండినఁ – దానేలా ? ||తెలి||





**భావము:** చీకటి నలుదెసల క్రమ్ముకొన్నప్పుడు వస్తు పరిజ్ఞానమునకై దీపము చేబూనవలెను. అంతే కాని గొప్ప ప్రకాశములోనికి దీపము జూపవలసిన పనిలేదు గదా!

ఆపదపాలై దుఃఖించువానికి అభయమిచ్చి రక్షింపవలెను. గాని ఎట్టి చీకు చింతలు లేక హాయిగా సుఖించువానిని కాపాడవలసిన పనిలేదు. వెల్లువలో కొట్టుకొనిపోవువానిని వడిగా గట్టుకు దీయవలెను గాని గట్టుననే ఉన్నవానిని తీయవలసిన పని తనకు లేదుగదా!

పెద్ద పెద్ద కర్మలలో పూనిక వహించి అందు తగులుకొన్నవాని బంధనముల ఊడదీయవలెను గాని ఏ బంధము లేక ముక్తుడైయున్నవానిని రక్షింప నవసరము లేదు. స్వయముగా అన్నము సంపాదించుకొన జాలని దుర్బలుని కెల్లవేళల అన్నము బెట్టి పోషింపవలెను గాని తృప్తిగా దిని త్రేపినవానికి తాను పెట్టవలసిన దేమియు లేదు గదా!

అంతులేని పాపము లాచరించి హీనుడైనవానిని నుద్ధరించుటకు తాను కావలెను గాని హితము దెలిసి పుణ్యకర్మము లొనర్చు సుకృతాత్మునికి తనతో (భగవంతునితో) పనిలేదు. ధైర్యము గోల్పోయిన దీనునిపై కృపబూని సమయమునకు రక్షింపకుండినచో శ్రీవేంకటేశ్వరుడుండి ప్రయోజనమేమి?

విశేషాంశములు: దీనులను, అనాథులను, ఆర్తులను రక్షించుటే భగవంతుని ముఖ్య కర్తవ్యము, అందువలననే ఆపద్బాంధవుడుగా, అనాథ రక్షకుడుగా భగవంతుడు ప్రసిద్ధి వహించినాడు. మార్జాల కిశోర న్యాయము ననుసరించి అనన్యగతికులై దీనజీవులనెల్ల దేవుడు అభయమిచ్చి రక్షించవలసియున్నాడు.

కర్మ బంధముల కతీతులైన పుణ్యాత్ములు మర్కట కిశోరన్యాయము ననుసరించి తమ సుకృతబలమున తామే తరింపగలరు. వారికి భగవద్రక్షణ తనకు తానుగనే సిద్ధించును గాన ప్రయత్నపూర్వకముగా పరమాత్ముడు వారిని రక్షింపవలసిన పనిలేదు. పాపాత్ముల పట్లనే భగవంతుడు విశేషించి తన కృపాదృష్టిని ప్రసరింపజేయవలసి యున్నదనుట ఇందలి సారాంశము.

**భావానువాదం: శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# జయ జయహే మహిషాసుర మర్ధిని రమ్యకపర్ధిని శైలసుతే

- చింతలపాటి శివశంకరశాస్త్రి

**శ్లో॥ విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కందస్థితాం భీషణాం**
**కన్యాభిః కరవాలఖేతు విలసత్‌హస్తా భిరాసేవితాం।**
**హస్తైశ్చక్రగదాసిఖేతు విశిఖాంశ్చాపం గుణం తర్జనీం**
**బిభ్రాణా మనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే॥**

మెరు పుతీగ వంటి కాంతి గలది. సింహ స్కందాన్ని అధిరోహించినది. భయంగొలిపే ఆకారం గలది, కత్తి, డాలు చేపట్టిన కన్యలతో సేవింపబడునది, చక్రం, గద, ఖడ్గం, శరము, ధనస్సు, గుణము, తర్జనీ ముద్రలను చేతులలో ధరించి త్రినేత్ర అయిన దుర్గాదేవిని ప్రార్థిస్తున్నాను.

జగన్మాత జగత్ +మాత. జగత్తు అంతటికీ తల్లి. ఈ సమస్త చరాచర సృష్టిలో ప్రతి జీవికీ మాట, మనస్సు, సంకల్పము, కారణము, కార్యము, ధృతి, మతి, గతి సర్వం సకలం అమ్మే. ప్రాణశక్తి, త్రేతాగ్నులు, పంచ వాయువులు, సప్తధాతువులు అన్నీ అమ్మే. ఆ తల్లి గాక వేరైనది ఈ జగతిలో ఏదీ లేదు. అందుకే ఆ తల్లిని జగన్మాతగా వేదాలు అనేక విధాలుగా కీర్తించాయి.

**సర్వశక్తిమయీ సర్వమంగళా సద్గతిప్రదా।**
**సర్వేశ్వరీ సర్వమయీ సర్వమంత్ర స్వరూపిణీ॥**

సర్వశక్తులు, సర్వసుఖాలు, సద్గతులను ప్రసాదించే సర్వేశ్వరి, సర్వమంత్రాత్మక, సకల యంత్ర, తంత్ర స్వరూపిణి ఆది పరాశక్తి. ఆ తల్లే అఖిల లోకాలకు ఆధారం. ఆ శక్తే అఖిల భువనాలకు ఆలంబన. విశ్వవ్యాపకమైన, విశ్వాతీతమైన ఆ పరాశక్తిని వేదాలు, ఆగమాలు, శాస్త్రాలు, పురాణాలు అనేక విధాలుగా కీర్తించాయి. పుడమిపై అసుర శక్తులు పెచ్చరిల్లినప్పుడు దుష్టులను దునిమాడి జగత్తుకు కళ్యాణం కలిగించేందుకు అనేక అవతారాలను ఎత్తి తన మహిమలను అణువణువునా ప్రదర్శించి జాతికి శ్రేయస్సును కలిగింపచేసింది.

త్రిమూర్తులను సైతం నడిపించగలిగే శక్తి ఆది పరాశక్తి. సర్వ లోకాల చైతన్య శక్తికిని, సకల ప్రాణికోటి సృష్టి వికాస దీప్తికిని జగన్మాత మూలం, ఆలంబనం. సృష్టి సర్వాధికారిణి, సర్వాధినేత్రి, మణిద్వీపవాసిని జగన్మాత. జగన్మాత అఖండమైన దివ్యశక్తుల ఉన్నతిని దేవీ సూక్తం వివరించింది. సర్వభూతాలయందలి చైతన్యం, బుద్ధి, నిద్ర, క్షుధ, శక్తి, తృష్ణ, క్షాంతి, శాంతి, శ్రద్ధ, ఆసక్తి, కాంతి, స్మృతి, వృత్తి, దయ, తుష్టి, మాతృత్వం – అన్నీ పరాశక్తి విభూతులే. మూడు మూర్తులకు, మూడు శక్తులకు మూలమైన పరాశక్తి ప్రకృతి పంచకమనే అయిదు శక్తులు.. దుర్గ, లక్ష్మి, సరస్వతి, సావిత్రి, రాధలు – ప్రధానమైన విశ్వసృష్టికి ప్రధానాధారమై వెలుగొందుతున్నాయి. ప్రజల హితాన్ని కాంక్షించేవారు సరస్వతి, లక్ష్మి, పార్వతీ మాతలు త్రిమూర్తులకు తోడై మెలిగే శక్తులు. సావిత్రి మాతే గాయత్రి. ఉదయం గాయత్రిగా, మధ్యాహ్నం సావిత్రిగా, సాయంకాలం సరస్వతీ తల్లిగా వేదవిదులకే తల్లి తోడంటూ సంస్కార సంపదను సుసంపన్నం చేస్తోంది.

ఆదిశక్తి ఒక్కటే కానీ, రూపాలు అనంతం. ఒక్కొక్క రూపం ఒక్కో శక్తి కేంద్రమై ఈ విశ్వాన్ని కాపాడుతున్నాయి. అష్టాదశ శక్తి పీఠాలతో పాటు, అష్టోత్తర శక్తి పీఠాలతో భారతావని అణువణువూ మహాశక్తి కేంద్రమై విరాజిల్లుతోంది. అష్టాదశ

శక్తి పీఠా లలో మైసూరు కూడా ఒకటి. 'చాముండే క్రౌంచ పట్టణే' అనే ప్రస్తావన అష్టాదశ శక్తి పీఠ స్తోత్రంలో కనిపిస్తుంది. పురా ణ కాలంలో 'మహిషాసుర పురం' కాలక్రమంలో మైసూరుగా ప్రఖ్యాతిగాంచింది. మహిషాసురునితోపాటు చండ, ముండులనే అసురుల్ని సైతం సంహరించిన అమ్మవారికి 'చాముండేశ్వరి' అనే పేరు వచ్చింది. ఇక్కడ వెలసిన శక్తిస్వరూపిణి చాముండేశ్వరి దర్శనానికి దేశం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు.

మహిషాసురుడు అసుర లోకానికి చెందినవాడు. దున్నపోతు తలవంటి వాడవడం చేత మహిషాసురుడయ్యాడు. అతడు ముక్కోటి దేవతలందరికంటే నేనే మిక్కిలి బలాఢ్యుడను అనే అహంకారంతో విర్రవీగుతూ దేవతలైన వారెవరి చేతిలోనైనా మరణం రాకూడదని తలచాడు. బ్రహ్మను గురించి ఘోర తపస్సు చేశాడు. నానాటికి అతని తపస్సు దినదినాభివృద్ధి పొందింది. అతని నుంచి అగ్ని జ్వాలలు చెలరేగసాగాయి. దశదిశలూ వ్యాపించాయి. లోకాలోకాలు అతని తపఃస్థాయిని తట్టుకోలేకపోయాయి. ఆ సంక్షోభాన్ని భరించలేక దేవతలు తల్లడిల్లిపోయారు. మహిషాసురుని తపస్సు నుండి విరమింపజేస్తే గానీ విశ్వశాంతి చేకూరదని సకల లోకవాసులు బ్రహ్మదేవుని శరణుకోరారు. వారి ప్రార్థన మన్నించిన విధాత మహిషాసురునికి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా దేవదానవులతోకానీ, మానవమాత్రులతో కానీ ఎవరితోనూ మరణం సంభవించరాదని వరం కోరుకున్నాడు. అలాగేనని వరమిస్తూ బ్రహ్మ 'ఎవరూ మరణానికి అతీతులు కారని, చావుపుట్టుకలు జీవికి తప్పవని" పలుకుతూ ఒక స్త్రీ చేతిలో నీకు చావు తప్పదని పలికాడు. ఒక స్త్రీ తనను చంపడమా! అని తలపోసి, తేలికగా తీసుకున్నాడు మహిషాసురుడు.

వర గర్వంతో దేవలోకానికి దండయాత్రకై బయలుదేరివెళ్ళి వారిపై విజయం పొందాడు. విజయ గర్వంతో ఋషులను వేధించసాగాడు. బ్రాహ్మణులు తమ తమ కర్తవ్యాలను నిర్వర్తించకుండా అడ్డుకున్నాడు. వృద్ధులను హింసించాడు. వాని బాధలు భరించలేని దేవతలు, మునులు, బ్రాహ్మణులు, ఋషులు విష్ణుమూర్తిని వేడుకున్నారు. అంత విష్ణువు జగన్మాత అంశతో దుర్గామాతను సృష్టించాడు.

సూర్యుడు దుర్గాదేవికి అతివేగముగల ఒక శక్త్యాయుధమును, శర సంపూర్ణమైన తూణీరమును, ఒక దివ్య ధనువును, వాయువు వజ్రి, వజ్ర సంజాతమైన గంటను, ఇంద్రుడు వజ్రాయుధమును, యముడు దండమును, దివిజ గంగా సలిల పూర్ణమైన కమండలమును, విశ్వకర్మ పరశువును దేవికి సమర్పించారు. వాటినన్నిటిని స్వీకరించి వారి ఎదుట ప్రత్యక్షమైంది. అపుడామె నీలవర్ణంలో ఉండే అంజన పర్వతంలాగా ఉన్నది. నీల పద్మముల వలె ఆమె కన్నులు విశాలముగా ఉన్నాయి. సమున్నత వక్షఃస్థలంలో, కరుణా స్వరూపిణియైన ఆ మాత చేతులలో పద్మము, బాణము, మరొక చేతిలో విల్లును కూడా ధరించింది. మహా సౌందర్యరూపిణి, లావణ్యశోభిత, కోటి సూర్యుల కాంతితో వెలిగిపోతోంది. కరుణారస సాగర అనేక నక్షత్రములతో, పాదములతో, హస్తములతో ప్రకాశిస్తోంది. ఇటువంటి రూపంతో ఉన్న ఆ దేవి తన కళ్ల నుండి తొమ్మిది దినములు కుంభవృష్టి కురిపించింది. అనంతరం ప్రచండశక్తిగా అవతరించి మహిషాసురుని ఎదుర్కొన్నది. మహిషుని అనుచరుల దుర్ధరుడు, త్రినేత్రుడు, అంధకుడు మొదలైనవారు తమ శర పరంపరలతో శ్రీదేవిని ఎదిరించి యుద్ధమొనరించి, ఆ తల్లి ప్రయోగించిన బాణాగ్ని జ్వాలలకు దగ్ధమయ్యారు.

మహిషుడు తన సైన్యం, అనుచరులు దగ్ధమైపోగా వివిధ రూపాలు ధరించి జగన్మాతతో పోరాడాడు. జగన్మాత సింహనాదము చేసి, నారి సారించి క్రోధావేశంతో నిశితమైన శరాలు ప్రయోగించి వాడిని నిలువరింపజేసి, కోటి సూర్యుల ప్రచండ తేజస్సుతో విరాజితమైన చక్రమును విడిచింది. ప్రచండ వేగముతో ఆ చక్రము వచ్చి ఆతని కంఠమును నరికింది. మహర్షుల ఉసురుపోసుకున్న వాని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. మహిషుని మరణంతో అఖిలాండములు సంతసించాయి. దేవతలంతా ఎంతో సంతసించారు. జగన్మాతను వేనోళ్ళ స్తుతించారు.

దేవతల, మునుల, ఋషుల, బ్రాహ్మణుల స్తుతి వాక్యాలను విన్న ఆ దేవి ప్రసన్న వదనంతో దేవతలారా! మహిషుని పీడ మీకు వదిలింది కదా! సంతోషంతో మీ మీ విధులను నిర్వర్తించండి. కష్టాలు వచ్చినప్పుడు తనను స్మరించమని, దుఃఖాలను తొలగించి అభయం ఇస్తానని పలికి వారిని ఆశీర్వదించింది.

ఈ విధంగా కాలం అప్రతిహతంగా సాగుతుండగా పాతాళంలో నివసించుచున్న మహిషాసురుని మరణవార్తను విని శుంభ నిశుంభులను రాక్షసులు తమకు దేవీదేవతల ద్వారా మరణము సంభవించరాదని తలపోసి బ్రహ్మను గురించి తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపస్సుకు మెచ్చి వరం కోరుకొమ్మనగా మాకు చావు లేకుండా వరం ప్రసాదించమని వేడుకున్నారు. ఆ వరం తప్ప ఇంకేమైనా కోరుకొమ్మనగా మాకు మరణం తప్పదంటే స్త్రీ చేతిలో తప్ప మరెవ్వరి చేతా జరగనట్టు వరమిమ్మన్నారు. అలాగే అవుగాక! అని బ్రహ్మ పలికి అదృశ్యమయ్యాడు. మమ్మల్ని సంహరించే స్త్రీ ఎవరు? స్త్రీలు అబలలు. వారు మమ్ము చంపే సమర్థులా! అని భావించి భ్రమించి వికటాట్టహాసం చేశారు.

ఒకనాడు నిశుంభుడు కొంత సైన్యముతో బయలుదేరి

దేవలోకానికి వెళ్ళి ఇంద్రునితో యుద్ధమునకు తలపడ్డాడు. ఇంద్రుడు వజ్రాయుధముతో నిశుంభుని పడగొట్టాడు. రాక్షసులు ఆ వార్తను శుంభునికి తెల్పారు. శుంభుడు క్రోధావేశముతో హుటాహుటిన వెళ్లి ఇంద్రుని జయించి ముజ్జగాలను ఆక్రమించాడు. దిక్పాలకులను ఓడించి అందరినీ వశపరచుకొని హింసించాడు. శుంభుని బాధలు భరించలేని దిక్పాలకులు బృహస్పతి సలహాపై అమ్మవారిని ఆశ్రయించి తమ బాధలను వెళ్ళగక్కారు. దేవతల బాధలను విన్న జగన్మాత వారిని ఓదార్చి కాళికాదేవిని తోడుగా రమ్మని పలికి సింహవాహనమెక్కి శుంభనిశుంభుల నగరానికి వెళ్ళి దగ్గరలోని తోటలో మనోహరంగా పాడటం మొదలుపెట్టింది. ఆ సమయంలో ఆ ప్రాంతములో తిరుగుచున్న చండముండాసురులనే సేవకులు అమ్మవారి సౌందర్యాన్ని చూసి ప్రభువుల వద్దకు వెళ్ళి ఆ విషయం చెప్పారు. శుంభనిశుంభులు తన సైనికులైన చండముండులను పంపి మంచి మాటలతో మన దగ్గరకు తీసుకురమ్మని ఆజ్ఞాపించిరి.

చండముండులు ప్రభువుల ఆజ్ఞతో బయలుదేరి వెళ్ళి ఆమెతో అందచందాలకు, శౌర్యానికి మారాజు పెట్టింది పేరు. అట్టి శుంభుని వరించి ముల్లోకాలకు మాననీయురాలివై మెలుగుమని పలికాడు. ఆ మాటలకు అంబిక కోపించి నేను శుంభుని వరించడమేమిటి? నేను చెలికత్తెలతో "నన్ను యుద్ధంలో ఓడించిన వానినే భర్తగా పరిగ్రహిస్తానని ప్రతిజ్ఞ చేశాను. ఇంతవరకూ ఏ వీరుడూ నన్ను కన్నెత్తి చూడలేదు. నువ్వు వీరుడివైతే నాతో యుద్ధము చేసి గెలువు. అయినా నీతో ఇన్ని మాటలెందుకు. మీ రాజు వీరుడైతే నన్ను గెలిచి, ఆపై స్వీకరించమని నా మాటగా చెప్పు" అని పలికింది. అంబిక మాటలకు కోపించిన చండముండులు నీతో యుద్ధం చేయడానికి మా రాజే రావలెనా? పిచ్చుకపై బ్రహ్మాస్త్రమేలా? నీవు నిజముగా వీరురాలవైతే నన్ను గెలిచి చూడుమని రోషముతో పలికాడు చండుడు.

అందుకు అంబిక కోపించి ఓరీ! తులువా! నేను సర్వేశ్వరిని. నువ్వు వీరుడివైతే విల్లెక్కుపెట్టి నీ శక్తి సామర్థ్యాలను చూపించమని పలికి హుంకరించింది. ఇరువురి మధ్య యుద్ధము భీకరముగా సాగింది. చండముండులు భయంకరమైన శరవృష్టి కురిపించుచుండగా అంబిక విష సర్పాల వంటి బాణాలను పుంఖానుపుంఖముగా ప్రయోగించింది. యుద్ధము అతి భీకరముగా సాగుచుండగా కాళికదేవి రాక్షసవంశ కాళరాత్రి అనేట్టు భయంకరంగా నోరు తెరిచి కొందరను, చూపుల తూపులతో కొందరను, చేతులతో కొందరను, పాదాలతో కొందరను బుగ్గిచేసి, మ్రింగి మర్దించింది. కాళిక ధాటికి తట్టుకోలేక చండుడు పిండి పిండి అయి నేల గూలాడు. ముండుడిని కూడా అంబిక తుదముట్టించింది.

చండముండల మరణవార్త విని శుంభ నిశుంభులు కోపముతో పళ్లు పటపటా కొరుకుతూ కదనరంగములోనికి వెళ్ళారు. నిశుంభుడు దేవి ఎదుట నిలిచి నారి సారించి వజ్ర సమములైన బాణాలను ఏకధాటిగా ప్రయోగించాడు. వాటిని కాళిక తన బాణాలతో తుత్తునియలు గావించి వీర ఘంటను మ్రోగించి భీకరాకారముతో విజృంభించి ఖడ్గముతో నిశుంభుని కంఠమును ఖండించింది.

తమ్ముని మరణమును చూచి కోపముతో శుంభుడు కాళిక పైకి పదునైన బాణములను ప్రయోగించాడు. శరపరంపర నుండి తప్పించుకుంటూ గదను విసిరింది. శుంభుడు ఆ దెబ్బ నుండి తప్పించుకొని చేతితో గదను ధరించి గిరగిర తిప్పి కాళిక మీదకు విసిరాడు. కాళిక ఆ గదను తుత్తునియలు చేసి తన చేతనున్న కత్తితో శుంభుని తలను ఖండించింది. దేవతలకు, ఋషులకు మోదమును కలిగింప చేసింది. శుంభ నిశుంభులను, చండముండలను సంహరించి చండికాదేవిగా భక్తజన పూజలందుకుంటోంది. తన చల్లని చూపులతో కరువు కాటకాలను పారద్రోలింది. అంతట దేవతా గణములు సంతోషించి దేవతా దుందుభులను మ్రోగించిరి. అంతట బ్రహ్మ, విష్ణు, దేవేంద్రాది దేవతలు సంతోషించి "ఓ తల్లీ! చాముండీ దేవి! నీవు పరదేవతా స్వరూపిణివి. సృష్టి, స్థితి, లయలకు ఆధారమైన దానవు. నిన్ను వేదములు అనేక రూపములలో వర్ణించుచున్నాయి. దుర్మార్గులైన చండముండలను, శుంభ నిశుంభులను సంహరించి ముల్లోకములను కాపాడితివి. నిత్య కర్మానుష్ఠానములను, యజ్ఞయాగాది కర్మలను నెరవేర్చుకొనుటకు ఋషులకు ఆధారమును కల్పించితివి. అందువలన మేము మహా సంతోషమును పొందితిమి"అని స్తోత్రము చేశారు. అందులకు ఆమె సంతోషించి దేవతలను తమ తమ నెలవులలో ఉండుమని ఆజ్ఞాపించి, శాంతరూపమును దాల్చి రుద్రగణములు సేవించుచుండగా లోకములను కాపాడినది. ఎల్లప్పుడూ ప్రకాశించుచుండు శ్రీ మాతకు చంపక, అశోక, పున్నాగ, సౌగంధికాది పుష్పాలకంటే మానవ ధీశక్తి నుంచి ఉద్భవించే చైతన్య కుసుమాలే అత్యంత ప్రీతికరము. మానవుల షట్ చక్రములలో సంచరించు శ్రీమాతను 'కేళిని' యని యతిశ్రేష్ఠులు ప్రస్తుతించారు.

ఆదిశక్తి, పరాశక్తి అయిన జగన్మాతను అందరము భక్తిశ్రద్ధలతో పూజించి, మాత ఆశీస్సులను పొంది జీవితాలను ధన్యము చేసికొని భవితను సుభవితగా మార్చుకుందాము.

**రూపందేవి యశోదేహి భగం భగవతి దేహిమే**
**పుత్రాన్ దేహి ధనం దేహి సర్వాన్ కామాంశ్చదేహిమే**
**మహిషఘ్ని మహామాయే చాముండే ముండమాలిని**
**ఆయురారోగ్యమైశ్వర్యం దేహిదేవి నమోస్తుతే**



# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ

**7వ భాగము**


## తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**


**దిశ :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 7వ భాగపు లీలల ప్రచురణ.

**(సెప్టెంబర్ 2002 నుండి ఫిబ్రవరి 2003)**



తిరుపతిలో 21.09.2002 నాడు శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప నిర్మాణము చేసి హైదరాబాద్ వచ్చిన తరువాత స్వామి సేవ హడావిడిలో నీరసించి పోయాను. ఏదోరకంగ స్వామి సేవను పొందాలని మనస్సు ఉరకలేస్తుంది. నాలో నేను ఇలా ఆత్మపరిశీలన చేసుకున్నాను.

## శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం – స్థాపన; జపశ్రీకారం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని స్మరిస్తూ ఉంటే ఎంతో ఆనందం కలిగేది. పరవశించి పోయెవాడిని. శరీరం రోమాంచితమై కళ్ళనుండి ఆనందబాష్పాలు వచ్చేవి. పైగ నా జటిలమైన సమస్యలు తీరినవి. ఇంతటి భాగ్యం నేనొక్కరినే అనుభవించాలా? అని నాలో నేను ఆలోచించుకున్నాను. దీనిని శ్రీవేంకటేశ్వరుని భక్తులందరికీ పంచాలనే ఆలోచన కలిగింది. మరో ప్రక్క గతంలో జరిగిన విషయాలు ఒక్కొక్కటి గుర్తుకువచ్చాయి. తేది 05-07-2002 రోజున ఉదయం నా మొదటి పుట్టిన రోజు పండగను అత్యంత ఉత్సాహంగ జరుపుకున్నాను. సాధారణంగ మొదటి పుట్టినరోజు పండుగకు అత్యంత ఆప్తులు బహుమానం ఇచ్చుట ఆనవాయితి అని నమ్మి, ఆరోజు స్వామివారిని ఒక మంచి బహుమానం ఇవ్వమని అత్యంత దీనంగ, ప్రేమపూర్వకంగ ప్రార్థించాను. అనుకున్నట్లే స్వామివారు ఆరోజు సాయంత్రం కీ.శే. గవర్రాజు గారితో ఇలా అన్నారు. **"సాయిరెడ్డి నావాడు నాకోసం ఏమైన చేస్తాడు"** ఈమాట విన్నంతనే పరవశించిపోయాను. రాజమహారాజులకు కూడ లభించని ఈ అనుగ్రహాన్ని నాకు ప్రసాదించినందులకు ఎంతో పొంగిపోయాను. స్వామివారి నోటితో అత్యంత అల్పున్నైన నన్ను **"సాయిరెడ్డి నావాడ"** ని పిలుచుట వలన మురిసిపోయాను. దీనికి ప్రతిగా ఏమివ్వగలనని నాలోనేను తర్కించుకొని

**“నా పూర్తి జీవితాన్ని మీకు సమర్పిస్తున్నాను. జీవించినంత కాలం మీ ఋణం తీర్చుకొనుటకు మీసేవ చేసుకుంటానని”** నా మన స్సులో దృఢ నిర్ణయం తీసుకున్నాను. ఆ తరువాత స్వామి కృపతో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపనిర్మాణము, దాని ప్రారంభోత్సవము కూడ నాచేతనే జరిగింది. నా ప్రార్థన ప్రకారం ఈ స్థూపాన్ని “నీవు జీవించినంత కాలం నీవే మేనేజ్ చేయగలవని” కూడ చెప్పారు. చివరికి ఆ స్థూపాన్ని నూటికినూరుపాళ్ళు స్వీకరించారని తెలుపుటకు తన దివ్యదర్శన భాగ్యంను కూడ కలిగించారు. ఇంతటి అనుగ్రహానికి పాత్రున్నైన నేను స్వామివారికి ఏదోఒకటి చేయాలనే దృఢమైన భావం కలిగింది. ఒక వేళ ఏమి చేయకుండ ఉండుంటే నేనొక స్వార్థపరునిగ నాకు నేను భావించుకున్నాను. ఇలా సేవ చేయాలని ఉంది కాని ఏమి చేయాలో ఎలా చేయాలో తెలియదు. దారి చూపమని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించాను. కర్తవ్య బోధ చేయమన్నారు. చివరికి చిన్నగ స్వామి జపమును వ్రాయించాలనే కోరిక కలిగింది. నాకు తెలిసిన ఇద్దరు ముగ్గురితో చర్చించి దసరా తేది 15-10-2002 నుండి ప్రారంభించాలని నిర్ణయించాను. అప్పుడు నేను నా డైరీలో ఈ క్రింది విధంగ వ్రాసుకున్నాను.

స్వామివారు నేను కట్టిన స్థూపమును స్వీకరించానని నాతో తెలిపినప్పటి నుండి నా మనస్సులో అమితమైన ఆనందము నిండింది. 15-08-2002 రోజున కొండపైన, స్వామివారి గుడి ముందు నా ఒళ్ళు జలధరరించేవిధంగ ఒక దివ్యమైన అనుభూతి పొందాను. **“ప్రతి సం॥ము స్వామివారికి ఒక మంచి మొత్తమును ఖర్చు చేయాలని, ఈ పైకము సాక్షాత్తు ఆ స్వామివారికే డైరెక్టుగ చెందాలని”** అనుభూతి చెందాను. కాని అది ఏవిధంగ చేయాలి? ఏమి చేయాలి అనే విషయము అప్పుడు తెలియలేదు.

ఈ దసరా (15-10-2002) కంటే 4-5 రోజుల ముందు నుండి స్వామివారిని దీనంగ వేడుకున్నాను. మీకు సేవ చేయాలని ఉన్నదని, కాని ఏమిచేయాలో, ఎలా చేయాలో తెలియదని దారి చూపమని వేడుకున్నాను. ఆజ్ఞాపించమన్నాను. దానిని నేను తు.చ తప్పకుండ చేస్తానని వేడుకున్నాను. నా నరనరాలలో స్వామిసేవ చేయాలని ఉవ్విళ్ళూరుతున్నాను. చివరికి నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఈ వచ్చే విజయదశమి నుండి ఏదైన ఒక మంచిపని, స్వామిని, ఆయన నామాన్ని అందరికి చేర్చే విధంగ, ఆయన కరుణాకటాక్షాలు అందరికి లభించేవిధంగ, స్వామివారి నామజపమును అందరిచే ఉచితంగ వ్రాయించాలనిపించింది. దానిని తిరుపతికి తీసుకెళ్ళి జపహోమాదులు నిర్వహించి, జపము వ్రాసినవారి కోర్కెలను తీర్చుమని నా ప్రభువుకు మ్రొక్కి, శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపములో నిక్షిప్తము చేయాలని నిర్ణయించాను. వి.ఎస్.టి. వద్దనున్న అప్పటి మా ఆఫీసునే జపము వ్రాయించే ఆఫీసుగ నిర్ణయించాను. దీనిని అప్పుడు కీ.శే. గవర్రాజు వద్ద పనిచేస్తున్న శ్రీ పాండురంగారావు గారికి, తెలిసిన వ్యక్తులైన శ్రీగోపాల్ రావు మరియు శ్రీనివాసశర్మ గార్లకు చెప్పి వారి సలహా కోరాను. **‘శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం’** అనే ఒక సంస్థను స్థాపించి దాని పేరు పైన జపం వ్రాయించాలనుకున్నాను. నేను ఒక అజ్ఞాత భక్తునిగ ఉండాలని నాకు నేను నిర్ణయించుకున్నానన్నాను. వారు నన్ను ప్రోత్సహించారు. చివరికి దీనిని ఆలస్యము చేయక వెంటనే అంటే 13-10-2002 నాడు కీ.శే. గవర్రాజు గారికి కూడ చెప్పాను. దీనిని వచ్చే విజయదశమి రోజు, శ్రవణానక్షత్రం నాడు, తిరుపతిలో బ్రహ్మోత్సవాల చివరి రోజు అయిన 15-10-2002 నాడు ఉదయం 10.30 గం॥లకు ప్రారంభించ నిర్ణయించాము. ఈ విషయమును నేను గవర్రాజు గారికి వారి ఇంటికి పోయి చెప్పాను. ఆయనతోనే ఈ కార్యక్రమమును ప్రారంభించ తలచాను. ఆయన దానికి ఒప్పుకున్నారు. గవర్రాజుగారితో జపం వ్రాయించుదునని చెప్పాను, కాని ఒక పీఠంను స్థాపించుదునని చెప్పలేదు, ఆ మాట నా మనస్సుకు రాలేదు. చివరికి 15-10-2002 దశరా నాడు శ్రీగవర్రాజుగారే పూజకు ముందుగా వచ్చారు. పూజ చాల బ్రహ్మాండంగ జరిగింది. శ్రీ గవర్రాజుగారు చేసే పూజా విధానాన్నే అనుసరించాను. ఐశ్వర్య మహామంత్రాన్ని అనుసంధానిస్తూ శ్రీ విష్ణు సహస్రనామ పారాయణము చేసాము. తరువాత శ్రీ గవర్రాజుగారు పేపరుపైన ఎర్రరంగు సిరాతో “ఓం శ్రీం వేంకటేశాయ నమః” అని 18 సార్లు వ్రాసి నాకు ఇచ్చారు. అంటే ఈ మంత్రాన్ని వ్రాయించమని సూచించారు. నేను దానిని ఆనందంగ తీసుకొని స్వామిచెంత పెట్టాను. ప్రసాద వితరణ తరువాత పూజ ముగిసింది. గవర్రాజు గారు స్వామి నామాన్ని వ్రాయుచున్నప్పుడు ఎవ్వరో తన చేయి పట్టుకొని వ్రాయించిన అనుభూతి పొందానన్నారు. నేను కూడ అమితమైన ఆనందమును అనుభవించాను. తిరుమలలో ఆనందనిలయంలోని స్వామిని చూచుచున్నట్లు అనుభూతి చెందాను. ఆయన పాదాలపైన స్వయంగ పూలు పెట్టుచున్నట్లు అనుభూతి పొందాను. శ్రీ గవర్రాజుగారు సూచించిన “ఓం శ్రీం వేంకటేశాయ నమః” అనే మహామంత్రాన్నే వ్రాయించాలనుకున్నాను.

ఆరోజు మేము శ్రీవారి జపమును భక్తులందరిచే ఉచితంగ వారి వారి సొంత పుస్తకములలో ఒక కోటి జపమును మాత్రమే వ్రాయించ నిర్ణయించాము. చివరికి పూజ అయిన కొంతసేపు తరువాత నా సేవలో కొంత వెలితి అనిపించింది. వెంటనే దీని నిమిత్తమై ఒక దివ్యమైన జప పుస్తకమును తయారు చేసి బీదవారికి, స్థోమతలేని వారికి ఉచితంగ ఇవ్వాలని నిర్ణయించాను. స్వామివారి కృపతో ఒక వారం లోపల జపపుస్తక నమూనాను తయారు చేసాము. మరింత స్వామివారి సేవను పొందాలనే కాంక్షతో ఈ

సంఖ్యను ఒక కోటి నుండి 7 కోట్లు చేయాలని నిర్ణయించాను. జపము వ్రాయుటకు విది విధానాలను, ప్రతి విషయాన్ని చక్కగ వ్రాసాము. స్వామివారిని స్మరింపచేయుటే మా ఉద్దేశ్యం కాబట్టి జపంను ఏరంగు సిరాతోనైనా వ్రాయవచ్చని చెప్పాను. ముఖ్యంగ స్వామివారిని స్మరిస్తూ వ్రాయమని సూచించాను. స్వామివారిని స్మరింపచేయుటకు జపంను ఆయుధంగ చేసుకున్నాను. చివరికి స్వామివారికి ఇది నా మొదటి పుస్తక కూర్పు అని నాకు నేను మురిసిపోయాను. కాని నా మనస్సులో మాత్రం భవిష్యత్తులో ఇలాంటి కూర్పులు ఎన్నో ఉండగలవనే హృదయాంతర భావం ఏర్పడ్డది. ఒక పుస్తకములో 1200 కు పైగ నామాలు వ్రాయునట్లు ఏర్పరచాము. ఈ పుస్తకములో ప్రతి భక్తునిచే కనీసం 1008 కంటే తక్కువ కాకుండ వ్రాయిస్తూ 7 కోట్ల జపమునకు సరిపడ మొత్తం 70,300 జపపుస్తకములను ప్రింటు చేయించాము. ప్రతి పుస్తకానికి నెంబరింగు వేయించాము. శుక్రవారం కార్తీక ఏకాదశి తేది 15-11-2002 నాడు జప పుస్తకములను విడుదల చేయ నిర్ణయించాము. ఇలా జపము వ్రాయించుదుమని నిర్ణయించిన ఒక నెల తరువాత జపపుస్తక వితరణ జరిగింది.

## జప పుస్తక వితరణ :

**15-11-2002 :** కార్తీక ఏకాదశి శుక్రవారము. ఇది నా జీవితంలో మరపురానిరోజు. ఆ స్వామి సేవలో మొదటిరోజు. నా స్థాయికి మించి అనుగ్రహించిన నా ప్రభువుకు, నేను సేవ చేయదలచాను. స్వామి ఋణం తీర్చుకొనుటకు ప్రయత్నించాను. వీలైనంత మందికి నా స్వామి నామాన్ని స్మరింపచేయుచు వారికి నా స్వామి యొక్క కరుణాకటాక్షాలను, దివ్య ఆశీస్సులను అందించాలనే తపనకు ప్రారంభం జరిగింది. ఉచితంగ స్వామివారి దివ్యనామమును వ్రాయుటకు "శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జప పుస్తకము" లను భక్తులకు పంచుట ప్రారంభించాము. ప్రతి భక్తునిచే కనీసం 1008 సార్లకు తక్కువ కాకుండ వ్రాయించి, ఇట్టి 7 కోట్ల జపమును తిరుపతికి తీసుకుపోయి జపహోమాదులు నిర్వహించి 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపములో స్వామివారికి చెందునట్లు నిక్షేపించ నిర్ణయించాము. ఆ కార్యక్రమము ఇలా జరిగింది.

అనుకున్నట్లే తేది 15-11-2002 శుక్రవారం ఉ. 5 గం॥లకు లేచి స్నానాదులు ముగించుకున్నాను. శుక్రవారం కావున స్వామివారికి అభిషేకము చేసాను. తరువాత ఈ జపపుస్తకములను స్వామి చెంత పెట్టి మనసార ప్రార్థించాను. ఈ జపము వ్రాసిన ప్రతి భక్తున్ని ఆశీర్వదించమని, వారి కోరికలను తీర్చమని ప్రార్థించాను. ఈ ఏడు కోట్ల జపం వ్రాయించడమనే పనిలో నన్ను కృతకృత్యుడను చేయమని, మీ ఆశీర్వాదము లేనిచో ఎంత డబ్బు ఖర్చు పెట్టినా అది సాధ్యము కాదని, మీ దయతోనే ఈ పనిని చేయగలనని ఆశీర్వదించమని మరిమరి వేడుకున్నాను. ఇది నేను స్వామి కొరకు, ఆయన భక్తుల కోర్కెలు తీర్చడము కొరకు చేసే మొదటి పని అని, మీ దివ్యమైన ఆశీర్వాదములు కావలెనని నా కనుల వెంట నీరు రాలుచుండగ స్వామివారిని వేడుకున్నాను. మరియు నేను అజ్ఞానినని, ఏమి తెలియనివానినని, ఎవరైన వచ్చి ఏమైన అడిగినచో ఏమి చెప్పలేనని, కేవలం మీ మీద పూర్తి విశ్వాసముతో ముందుకు వెళ్ళుచున్నాను ప్రభూ! అని పదేపదే వేడుకున్నాను. తగిన శక్తిని ప్రసాదించమని ప్రార్థించాను. రెండు పుస్తకములను స్వామి చెంత పెట్టాను. తరువాత ఉ. 6.30 లకు చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వర ఆలయంనకు వెళ్ళాను. స్వామి పాదముల వద్ద ఈ పుస్తకములను పెట్టి పూజించాను. జపము వ్రాసిన వారి కోర్కెలను తీర్చమని, ఈ పనిని నిర్విఘ్నముగ నాచే చేయించమని దీనంగ వేడుకున్నాను. శరీరము పులకరించి కనుల వెంట ఆనంద బాష్పాలు రాలుచుండగ అత్యంత దీనంగ ప్రార్థించాను. అమ్మవారిని కూడ ఇదే విధంగ ప్రార్థించాను. అక్కడి పూజారులు, భక్తులు ఈ పుస్తకములను ఆతృతతో గమనించారు.

చివరికి ఉ. 7.30 ని॥లకు కుటుంబంతో పాటు ఆఫీసుకు వచ్చాను. పూజారులు, భక్తులు వచ్చారు. ఉ. 7.40 కి ఆఫీసులో పూజ మొదలైంది. విష్ణుసహస్రనామ పారాయణము జరిగింది. ఈసారి ప్రతి చరణం మధ్యమధ్యన 'ఐశ్వర్య మహామంత్రం' కు బదులుగ "ఓం శ్రీం వేంకటేశాయ నమః" అనే మహామంత్రమును పఠించాము. ఎంతో తృప్తిగా నా కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలుచుండగ పూజ జరిగింది. ఈ పూజకు వచ్చిన ప్రతి భక్తుడు దివ్యమైన అనుభూతి పొందాడు. పూజ జరిపించు పంతులుగారు తన కళ్ళనుండి నీరు కారుచుండగ పులకరించిపోయారు. స్వామివారు చిరునవ్వుతో కనబడ్డారని మురిసిపోయారు. ఆ తరువాత జప పుస్తకములను భక్తులకు పంచాము. ఈ విధంగ జపపుస్తక వితరణ కార్యక్రమము ఎంతో ఆనందంగ స్వామి కృపతో జరిగింది మేము చాల సంతోషించాము.

తేది 17-11-2002 ఆదివారం రోజున పేపరులో ఒక ఆడ్ ఇచ్చాను. అందులో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి భక్తులందరిచే వ్రాయించిన 7 కోట్ల జపసమర్పణ చేయ నిర్ణయించామని, జపపుస్తకములను మా ఆఫీసునుండి ఉచితంగా భక్తులు పొందవచ్చునని ఇచ్చాము. ఈ అడ్వర్‌టైజ్‌మెంటును చూచిన వెంటనే ఎంతో మంది భక్తులు వచ్చి స్వామివారి ప్రసాదంగ జపపుస్తకములను తీసుకెళ్ళారు. ఇది ఒక ప్రభంజనంలాగ సాగింది. ఈ పేపరు అడ్వటైజ్‌మెంటును చూచిన కీ.శే. గవర్రాజు గారు ఎంతో నొచ్చుకున్నారు. నేను 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' అనే ఒక సంస్థను ఏర్పాటు చేయుట,



మరియు ఉచితంగ జప పుస్తకములను భక్తులకు ఇచ్చుట ఆయనకు సహించ లేదు. ఆయనకు పోటి అని భావించాడు. నాకు ఫోన్ చేసి కోప్పడ్డాడు. శ్రీవేంకటేశ్వరునికి జపము వ్రాయించే శక్తి నాకు లేదని, నేను యోగ్యున్ని కానని అన్నాడు. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం అనే పేరును తొలగించమని కచ్చితంగ చెప్పాడు. కేవలం ఉపాసకులే మహామంత్ర పీఠం అని పెట్టుకొనుటకు యోగ్యులన్నాడు. ఒక వేళ స్వామి సేవ చేయదలచుకుంటే ఇతర పేర్లు పెట్టుకొమ్మన్నాడు. గవ్రరాజు రెండు విషయాలు చెప్పాడు (1) జపం వ్రాయించకూడదు. (2) 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం' అనే పేరును తొలగించాలి. నేను కూడ ఆయన పైనున్న గౌరవముతో ఈ 7 కోట్లు జపమును వ్రాయించి మానేద్దామనుకున్నాను. కాని స్వామిసేవ చేయవలెననే ఆత్రుత నన్ను ఊరుకోనివ్వడం లేదు. మా చార్టెడ్ అకౌంటెంట్‌ని సంప్రదించి 'శ్రీవేంకటేశ్వర సేవా సమితి' అనే ఒక ట్రస్టును ఏర్పాటు చేద్దామనుకున్నాను. భవిష్యత్తులో ఈ ట్రస్టు క్రింద ఎన్నో సేవలను ఏర్పాటు చేసుకోవచ్చునని మా సి.ఏ శ్రీమాన్ జనార్దన్ రావుగారు సూచించారు. ఈ ట్రస్టు ద్వార జపసమర్పణ కాకుండ ఇతర ఇంకేమైన సేవలను చేద్దామనుకున్నాను. ఇంతలో నాకు మరియు శ్రీ గవ్రరాజు గారికి ఇద్దరికి పరిచయమున్న పాండురంగారావు, గోపాల్‌రావు, మరియు శ్రీనివాసరావు గారలు నన్ను మహామంత్ర పీఠమును మరియు జప సమర్పణను కొనసాగించమన్నారు. గవ్రరాజుగారు స్వార్థముతో మాట్లాడుచున్నారు, ఆయన మాటలను పట్టించుకోవద్దన్నారు. నేను మాత్రం సందిగ్ధంలో ఉన్నాను.

**23-11-2002:** ఈరోజు ఉదయం దాదాపు 2.30 ని॥లకు మెలుకువ వచ్చింది. ఆ శ్రీవేంకటేశ్వరుని గురించి, నేను చేపట్టిన 7 కోట్ల జపము గురించి ఆలోచించాను. ఈ ఒక్క సం॥ము జపసమర్పణ చేసి ఆ తరువాత స్వామి సేవలేకుండ ఊరికే ఉండుట ఇష్టం అనిపించలేదు, బాధేసింది. స్వామిని స్మరిస్తూ ఉన్నాను. ఇంతలో నాకు ఒక దివ్యమైన ఆలోచన వచ్చింది. స్వామివారికి మొత్తం 108 కోట్ల జప సమర్పణ కావించాలనిపించింది దీనితో స్వామివారికి ఎక్కువ కాలం సేవచేసే భాగ్యం లభిస్తుందనుకున్నాను. ఈ మొదటి జప సమర్పణ తిరుపతిలో చేసి అక్కడే ప్రతి సం॥ము 7 కోట్ల చొ॥న మొత్తం 108 కోట్లు సమర్పించుదుమని వెల్లడించాలని అనుకున్నాను. వెనువెంటనే 108 కోట్లు చేయాలా లేక 111 కోట్లు చేయాలా అనే ఆలోచన వచ్చింది. 111 నెంబరే నన్ను బాగ ఆకర్షించింది మరియు ప్రతి సం॥ము ఈ జపమును తిరుపతిలో అలిపిరి వద్దనున్న స్వామివారి పాదాల మండపముపై పెట్టి, ఆయన పాదాలకు సమర్పించి ప్రార్థించాలనిపించింది. ఆ తరువాత స్థూపం వద్ద జపహోమాదులు నిర్వహించి సమర్పించాలనిపించింది. ఇది నా జీవిత సంకల్పం అనిపించింది. ఈ విషయం ఇట్లుంటే మరోప్రక్క స్వామివారు కొన్ని దృష్టాంతరాలను కల్పించారు. అందులో ఒకటి: మా నుండి జప పుస్తకమును పొందిన ఒక భక్తుడు పుస్తకమును పూరించి ఆఫీసులో నా టేబుల్ పైన పెట్టిపోయాడు. ఆయన పుస్తకము సంఖ్య 111. దీనిని పుస్తకముపై రెడ్ ఇంక్‌తో 111 అని చక్కగా వ్రాసాడు. ఇది నన్ను మరీమరి ఆకర్షించింది. ఈ విధంగ 111 సంఖ్య వైపే మొగ్గు చూపాను. రెండవది స్వామివారికి జపం వ్రాయించవలెనని నిర్ణయించిన 2, 3 రోజులలోనే నా నుదుటిపై నామం పెట్టుకున్నట్లు తెల్లని మచ్చ ఏర్పడ్డది. శ్రీచూర్ణం పడక ఏర్పడిందనుకున్నాను, మందులు వాడాను, తగ్గలేదు. చివరికి ఇది ఏదో తెలియంది సూచించుచున్నట్లు భావమేర్పడింది. మూడవది : తిరుపతిలో స్థూప ప్రారంభోత్సవానికి తెరను ప్రక్కకు జరిపినప్పుడు, నామఫలకంపైన అలంకరించిన తిరునామం చాల ఆకర్షించింది. ఇప్పటికి నా కళ్ళలో మెరుస్తుంది. నేను తిరునామాన్ని ప్రారంభించినట్లు అనిపించింది. మరో విషయం, నేను స్వామివారికి చాల సం॥లు సేవ చేయాలనుకుంటున్నాను, కాని ఈ రోజు ఉన్న ఉత్సాహం తరువాత ఉండకపోవచ్చు, కాబట్టి ఒక మంచి సంకల్పం ఉంటే బాగుండుననిపించింది. దీనికై స్వామివారిని దారి చూపమని ప్రార్థించసాగాను.

## సంకల్పమిచ్చిన స్వామివారు:

**24-11-2002 :** ఈరోజు కూడ రాత్రి 2.30 ని॥లకు మేల్కున్నాను. స్వామి గురించి నా సేవ గురించి ఆలోచించాను. ఈ జప సమర్పణ సేవను ఎలా ముందుకు తీసుకెళ్ళాలని ఆలోచించాను. స్వామివారికి జీవితాంతం నా తనివితీర సేవ చేయాలనే కోరికను తీర్చమని వేడుకున్నాను. ఇన్ని సం॥ల నా సేవ మధ్యలో పలుచబడకుండ దారి చూపమన్నాను. వెంటనే నా మనస్సులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. నాకు ఇంతకు పూర్వము దర్శనము ఇచ్చిన తిరుమల శ్రీవేంకటేశ్వరుని రూపము, కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీ మరియు పరమశివుని రూపములు మళ్ళీ నా కళ్ళలో మెరిచినట్లైంది. నాది నేను ఈవిధంగ విశ్లేషించుకున్నాను. సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు కనిపించినప్పుడు శంఖ చక్రాదులతో,

కిరీటముతో, అప్పుడే అభిషేకము అయిన తరువాత ఉండే నీటి తడితో కనబడ్డారు. అదేవిధంగ శ్రీమహాలక్ష్మీ అమ్మవారు, మరియు లింగ రూపములోని పరమశివుడు కూడ అప్పుడే అభిషకము తరువాత ఉండే నీటి తడితో కనబడ్డారు. అంటే దీనర్ధం నన్ను బొట్టు పెట్టి అలంకరించుమంటున్నారని గ్రహించాను. తిరుమల శ్రీవేంకటేశ్వరున్ని కొందరు అమ్మవారని కొందరు పరమశివుడని మరికొందరు భగవంతుని అన్ని రూపములు మేళవించి ఉన్న మూల రూపమని భావిస్తారు. నేను మాత్రం శ్రీవేంకటేశ్వరుడు సర్వదేవతా రూపములను తనలో ఇముడ్చుకున్న మూల రూపంగ భావిస్తాను. ఒక్క శ్రీవేంకటేశ్వరున్ని సేవిస్తే సమస్త దేవతలను సేవించినట్లు భావిస్తాను. కాబట్టి ఒక్క శ్రీవేంకటేశ్వరునికి బొట్టు పెట్టాలని భావించాను. స్వామివారే బొట్టు పెట్టుటకు నన్ను ప్రేరేపించుచున్నారని భావించాను. అందుకే నాకు అభిషేకము తరువాత తడితో దర్శనమిచ్చారని భావించాను. నా స్వామి నామములో మూడు ఒకట్లు ఉన్నవని నా ఇంజనీరింగు మైండ్‌తో భావించాను. కాబట్టి నా స్వామికి మొత్తం 111 కోట్ల జపమును సమర్పించాలని భావించాను. ఆ జప పుణ్యముతో స్వామివారికి బొట్టుపెట్టాలని తలంచాను. వెంటనే ఈ నిర్ణయాన్ని స్వామివారు మెచ్చుకున్నట్లు అనుభూతి పొందాను. ఎంతో ఆనందించాను. ఇది నా ప్రియాతిప్రియమైన స్వామివారి సేవ. ఇది తేలికగ ఉండకూడదని అత్యంత కష్టంగ ఉండాలని, అప్పుడే నాకు తృప్తి అని భావించుకున్నాను. వెంటనే ఇలా నిర్ణయించుకున్నాను. సం॥ 2002 నుండి సం॥ 2018 వరకు, ప్రతి సం॥ కనీసం 70 వేల మంది భక్తులు పాల్గొన్నా, కనీసం 7 కోట్ల జపాన్ని, 16 సం॥ల వరకు సమర్పించాలనుకున్నాను. జపం వ్రాయించుట నా ఉద్దేశ్యము కాదు. సం॥ 2002 నుండి 2018 వరకు, ప్రతి సం॥ము కనీసం 70 వేల మంది భక్తులచే, కనీసం 7 కోట్ల సార్లు నా కారణంగ స్వామివారిని స్మరింపచేయాలి. ఇదే నా అసలైన సంకల్పం. దీనిని నెరవేర్చుటకు జపం వ్రాయించుటను ఆయుధంగ ఎన్నుకున్నాను. ఇది నా జీవితం యొక్క లక్ష్యంగ నిర్ణయించుకున్నాను. ఇక ముందు వ్రాయబోయే జపము "తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 111కోట్ల జపములో భాగంగ 2వ పర్యాయంగ 7 కోట్ల జపసమర్పణ" అని ఉంటుందని నిర్ణయించాను. ఈవిధంగ 3వ సారి, 4వ సారి, .. 15వ సారి వరకు పోవును. చివరిది 111వ కోట్ల జపమని, స్వామివారి నామమును ప్రచారము చేయవలెనని అనుకున్నాను.

ఇలా, నా కారణంగ స్వామివారి కృపాకటాక్షాలు అందరికి లభించాలని తపించిపోయాను. ఈ కలియుగంలో నిరంతరం స్వామిసేవ, నామస్మరణ చేసే అత్యంత అల్పునికి కూడ స్వామివారు లభించగలరని అందుకు నిదర్శనంగ నన్ను ఎన్నుకునే స్థితికి చేరాలనిపించింది. ఇంత మంచి సంకల్పాన్ని ఇచ్చినందుకు నా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి కోటి కోటి ప్రణామాలను తెలుపుకున్నాను. నా సేవను వినియోగించుకుంటున్నందులకు ధన్యవాదాలు తెలిపాను.

నేను ఈ జపంను ప్రారంభించిన తరువాత నుండి స్వామివారి లీలలను చూడలేదు. మరో ప్రక్క కీ.శే. గవర్రాజుగారు జపం వ్రాయించుటను ఆపమన్నారు. ఆయనపైన మంచి గౌరవముంది, తన మాటకు విలువ ఇవ్వాలనుకున్నాను, చివరికి ఏమి చేయాలనే సందిగ్ధావస్థలో ఉన్నాను. నిజానికి నా మనస్సులో పుట్టిన సంకల్పము స్వామి ఆజ్ఞ లేనిదే పుట్టదని నాకు తెలుసు. కాని స్వామివారు స్వయంగ ఏదైన సంకేతం ఇస్తే నాకెంతో బలం. నేనెవ్వరిని లెక్కచేయక ఆ పనిని చేసుక పోవుదుననుకున్నాను. స్వామి వారు ఈ జపసమర్పణ పనిని ఒప్పుకున్నట్లు ఇంతవరకు చూచించలేదు, కావున మొదటి 7 కోట్ల జప సమర్పణ కావించి ఊరుకుందామనుకున్నాను. చివరికి ఈరోజు ఉదయం 2.30 ని॥ లకు ఒక కల కన్నాను. అది ఈవిధంగ ఉంది.

## జపంను కొనసాగించమని సూచించిన స్వామివారు

**25-11-2002:** కల : ఇందులో దాదాపు 20 నుండి 30 మంది సాధువులు ఉన్నారు. అందరు కాషాయరంగు పంచె ధరించారు. కొందరు కాషాయరంగు సెల్లలను కప్పుకున్నారు. కొందరికి గడ్డం ఉంది, మరికొందరికి లేదు. కాని అందరు శ్రీవేంకటేశ్వరుని తిరునామం ధరించి ఉన్నారు. వీరందరు మా ఆఫీసు మెట్ల దగ్గర "శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం" అని ఉన్న బోర్డు ముందర స్ట్రైక్ చేస్తున్నారు. ప్రతి సాధువు మహామంత్రం, మహామంత్రం అని గొంతెత్తి అరుస్తున్నాడు. కొందరు ఒక చేయి ఎత్తి 'మహామంత్రం' అని అరుస్తున్నారు. ఒకాయన కుడిచేయి పైకి ఎత్తుచు, ఎగురుచు 'మహామంత్రం! మహామంత్రం!' అని అరుస్తున్నాడు. ఇదంతా కూడ శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం బోర్డు ముందర జరుగుచున్నది. కల చెదిరింది.

ఒక కంపనీ లాకౌట్ చేస్తున్నప్పుడు దానిని తెరువుమని ఉద్యోగులు స్ట్రైక్ చేస్తున్నట్లు అనిపించింది. అంటే వీరికి మహామంత్రం కావలెనని అర్ధం. దీనితో నాకు స్వామివారి పైన అలకపోయింది. గవర్రాజుగారి మాటను ప్రక్కన పెట్టాను. జపసమర్పణ కార్యక్రమమును కొనసాగించ నిర్ణయించుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం అనే పేరును కొనసాగించాలా వద్దా? అనే సందిగ్ధావస్థలో ఉన్నాను. తెలిసిన వారిని ఈ విషయమై సంప్రదిస్తున్నాను.

## స్వామివారితో పందెం కాయుట

తేది 23-11-2002 నుండి 07-12-2002 వరకు వైరల్ జ్వరంతో బయటికి వెళ్ళకుండ ఇంట్లోనే ఉన్నాను. కాబట్టి స్వామివారిని మరింత ఎక్కువ స్మరించుట, నా సంకల్పం విషయమై


పదేపదే ఆలోచించు ట జరిగింది. స్వామివారి విరహ వేదనను భరించలేక పోయాను. స్వామివారు గుర్తురాగానే కళ్ళనుండి నీరు రాలుచున్నవి, తపించిపోవుచున్నాను. మళ్ళీ ఒకరోజు రాత్రి దాదాపు అదే 2.30 ని॥ల ప్రాంతమున మేల్కొన్నాను. స్వామివారి గురించి విరహవేదన తీవ్రమైంది. పడి పొర్లాలనిపించింది. ఎలాగైన స్వామివారిని చూడాలని, ఆయనను పొందాలనే కోరిక కలిగింది. వెంటనే అడగాలా? వద్దా? అని అనుమానపడుతు ఈవిధంగ అడిగాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వర, మీరు కోరినట్లు ప్రతి సం॥ మీ కోసం 70 వేల మంది భక్తులచే కనీసం 7 కోట్ల జపమును, 16 సం॥ల వరకు అంటే సం॥2002 నుండి 2018 వరకు సమర్పిస్తాను. **దాని ఫలితముతో బొట్టు పెట్టి మిమ్ములను మా ఇంటికి ఆహ్వానిస్తాను. వస్తారా? ప్రభూ!** అని అడిగాను. మన హైందవ సాంప్రదాయములో ఒక వ్యక్తిని బొట్టుపెట్టి అత్యంత గౌరవంగ ఇంటికి ఆహ్వానించినట్లు **మీకు 111 కోట్ల జపమును సమర్పించి, దాని ఫలితముతో బొట్టుపెట్టి మా ఇంటికి ఆహ్వానిస్తాను, రమ్మన్నాను. మరియు ఒక్కరోజు విశ్రాంతి తీసుకోను. మిమ్ములను సంతృప్తిపరుస్తాను. మీరు మా ఇంటికి వచ్చి నన్ను తృప్తి పరుస్తారా? ప్రభూ!** అని అత్యంత దీనంగ నా కళ్ళనుండి నీరు జాలువారగ అడిగాను. ఒకవేళ స్వామివారు మా ఇంటికి వచ్చినట్లైతే! ఆయనను మనస్పూర్తిగ దర్శించి, పాదపూజ చేసి, రెండుమాటలు మాట్లాడి, తిరిగి తిరుమలకు పంపాలని భావించాను తప్ప మరో కోరిక లేదు. వెంటనే నాకు నేను ఇలా పునరాలోచించుకున్నాను. నిజానికి నేను ఒక అదమ స్థాయి వ్యక్తిని, ఈమాట అడుగకూడదు, కాని అడిగాను, పొరపాటు జరిగిందని నన్ను నేను సముదాయించుకున్నాను. తప్పైందని క్షమాపణ కోరాను. స్వామివారు మా ఇంటికి వస్తే ఆయనకు చిన్నతనమగునని భావించాను. కాని వెంటనే శ్రీవేంకటేశ్వరుడు దీనికి ఒప్పుకున్నారు. **"నేను సిద్ధం"** అనే భావము నా హృదయంలో స్పష్టంగ ఏర్పడ్డది. కాని **"నేను స్వామి సేవలో ఒక్కతప్పు చేయకూడదు"** అనే షరతు విధించినట్లు మరో భావం ఏర్పడ్డది. మొత్తం 16 సం॥ల సేవలో ఒకే ఒక తప్పుకు అవకాశం ఇచ్చాడు. రెండు తప్పులు చేసినట్లైతే నేను నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని పొందే భాగ్యమును కోల్పోతాననే భావం ఏర్పడ్డది. ఈవిధంగ నాకు శ్రీవేంకటేశ్వరునికి మధ్యన ఒక పందెం ఏర్పడింది. దీనిని చూసి నాకు నేను పరవశించిపోయాను. కాని ఇంతలోనే మరో భావం నన్ను ఆవహించింది. నేను ఋణం తీర్చుకొనుటకు, ఎలాంటి ఫలాపేక్ష లేకుండ సేవచేయాలనుకున్నాను. పైగ స్వామివారిని పొందే సామర్థ్యము లేని వాడిని, ఈ విషయం ఎవ్వరైనా వింటే నవ్వుకుంటారని భావించాను. పైగ గతంలో ఒక విషయంలో నా మనస్సులో జనించిన భావాలకు అనుగుణంగ ప్రవర్తించి దెబ్బతిన్నాను. కాబట్టి నా మనస్సులో జనించే భావాల ప్రకారం వెళ్ళడం సబబేనా? అనే అనుమానం కలిగింది. చివరికి ఇలా అనుకున్నాను. నేను మాత్రం స్వామి ఋణం తీర్చుకొనుటకు ఒక్క తప్పులేకుండ సేవచేస్తాను. కాని స్వామివారు నా సేవకు మెచ్చి తన దివ్యదర్శన భాగ్యంను ప్రసాదిస్తే దానిని బోనస్‌లాగ భావించుకుంటాననుకున్నాను. మరియు ఈ విషయాన్ని నా భార్యతోపాటు ఎవ్వరికి చెప్పదలచుకోలేదు. నాకు శ్రీవేంకటేశ్వరునికి మధ్యనే ఉన్నది.

నేను శ్రీవేంకటేశ్వరునికి 111 కోట్ల జపము సమర్పించి, దాని ఫలితముతో స్వామివారికి బొట్టుపెట్టు విషయము కొందరికి తెలుసు, ముఖ్యంగ డా॥ కొండారెడ్డి గారికి, హైదరాబాద్‌లో నాతోటి సహచరులు, పాండురంగారావు, శ్రీనివాసరావు, గోపాల్‌రావు మరియు నా భార్య సురేఖకు. కాని స్వామివారు తాను తృప్తి చెందితే మా ఇంటికి వస్తారన్న విషయం ఎవ్వరికి తెలియదు. నాకు శ్రీవేంకటేశ్వరుని మధ్యనే ఉన్నది. ఈవిధంగ నాకు శ్రీవేంకటేశ్వరునికి మధ్య ఒక పందెం ఏర్పడింది.

## పవిత్ర స్నానం చేయించుట

మొదట్లో స్వామివారు కల్పించు కలలు కొన్ని అర్థం కాకపోయేది. ఎందుకు కల్పించుచున్నారో తెలిసేది కాదు, కాని కాలము గడిచినకొద్ది వాటి ఆంతర్యము బహు చక్కగ తెలిసేది. ఈ క్రింద తెలిపిన కల కూడ ఆరోజు అర్థం కాలేదు. కాని ఇది నేను స్వామి నిర్ధేశించిన సంకల్పం తీసుకొనుటకు ముందు పవిత్రున్ని చేసింది. నన్ను రెండుసార్లు పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. ఆ లీలలు ఈవిధంగ ఉన్నాయి.

## ఆకాశగంగ స్నానం చేయించుట



**27-11-2002 :** కల: ఈ కలలో నా భార్య పిల్లలను ఇంట్లోపెట్టి నేనొక్కడినే స్వామివారి దర్శనార్థమై తిరుపతికి వెళ్ళాను. క్రింద తిరుపతిలో నాలుగైదు అంతస్తులున్న ఒక హోటల్‌లో బసచేసాను. తిరుమలకు స్వామివారి దర్శనార్థమై పోవుటకని వేకువనే లేచి స్నానానికి వెళ్ళాను. ఈ హోటలులో అటాచ్‌డ్ బాత్‌రూంలు లేవు. గదులు ఒక వైపు బాత్‌రూంలు మరోవైపు ఉన్నవి. హోటల్ నిండుకున్నా సరిపోయినన్ని చాల బాత్‌రూంలు ఉన్నవి. కాని ఆరోజు విపరీతమైన జనాలు ఉన్నారు. నేను వెళ్ళేసరికి ప్రతి బాత్‌రూంలో కూడ జనాలే ఉన్నారు. భక్తులందరు ఒకేసారి స్నానాదులు చేయుట వలన బాత్‌రూంలలో నీరు రావటం లేదు. స్వామి దర్శనార్థం సమయం మించి పోవుచున్నందున, సరిగా స్నానం చేయకనే కట్‌డ్రాయర్‌పైననే

స్వామివారి దర్శనార్థం పరుగులు తీస్తున్నారు. మరి కొందరు స్నానము చేయుటకు ఒకరిపై ఒకరు పడుచున్నారు. అక్కడ ఎన్ని బాత్‌రూంలు ఉన్నా కూడ వాటినిండా జనాలే ఉన్నారు. నేను కూడ వారిలాగ స్నానము చేయుటకు వెళ్ళాను. నాకు కూడ నీరు దొరకలేదు బాధపడ్డాను. స్వామివారిని ఎలా దర్శనము చేసుకోవాలని చింతించాను. ఇంతలో నా మనస్సులో నీకు నీళ్ళు దొరకలేదా? అనే భావం కలిగింది. **"నిన్ను చాల ఉత్తమమైన నీటితో స్నానం చేయించుదును"** అనే భావం వెనువెంటనే కలిగింది. ఇంతలో ఒక శక్తి నన్ను అక్కడి నుండి మాయం చేసింది. ఆ శక్తి నన్ను ఆకాశమార్గాన తీసుకెళ్ళి ఒక చెఱువు నీటి అంచున దింపింది. అక్కడ ప్రశాంతమైన వాతావరణము, చల్లనిగాలి వీచుచున్నది. ఒక రకంగ మానస సరోవరం లాంటి పరిస్థితులు ఉన్నవి. అక్కడ నేను తప్ప మరెవ్వరు లేరు. నీరు చాలా స్వచ్ఛంగా స్పష్టంగ ఉన్నవి. ఈ చెఱువు పటంలో చూపినట్లు శంకు ఆకారములో ఉంది. ఇది ఆకాశగంగ అని నాకు కలలో అనిపించింది. నేను ఆ చెఱువు నీటిలో ఒక చివర ఉన్నాను. ఇంతలో ఒక అల నానుండి 20-25 అడుగుల దూరములో ఏర్పడింది. అది పడుకోబెట్టిన ఇంగ్లీషు అక్షరం > ఆకారంలో ఉంది. అది సరిగ్గా నావైపు వచ్చింది. ఆ శక్తి నన్ను ఆ అలపై పడుకోబెట్టింది. నేను దాని కొనభాగమును (మొన భాగము) రెండు చేతులతో గట్టిగ పట్టుకున్నాను. **"నీవు మొత్తం ఈ చెఱువును చూడు"** అనే భావం నాలో కలిగింది. ఆ అల నన్ను తీసుకొని చెఱువు చుట్టు త్రిప్పుచున్నది. నాకు మధ్యలో చాల హాయిగ అనిపించింది. **"నీకు భయమైతుందా?"** అనే భావం మనస్సులో కలిగింది. నాకెందుకు భయమైతది నాకు మహామంత్రం వచ్చును అని నాకు నేనే అనుకున్నాను. ఇంతలో ఆ అల నన్ను మొత్తం చెఱువును తిప్పి నేను ఎక్కడైతే అలపైకి ఎక్కానో అక్కడికి తెచ్చిన తరువాత మాయమైంది. నేను అలపై వచ్చినప్పుడు, ఆ అల మాయమైనప్పుడు నాలో ఉలుకు, పలుకు, వణుకు లాంటివి ఏమి లేవు చాల ఆశ్చర్యంగ అనిపించింది. ఇది నిజంగ జీవితంలో ఒక మరపురాని ఘటన. ఇంతే కల. ఎంతో ఆనందించాను. ఈవిధంగ నన్ను పవిత్ర జలాలలో స్నానం చేయించాడు.

## కొండపైన పవిత్రున్ని చేయుట

కొన్ని కలలను నేను వ్రాయుట మరచాను. అందులో ఇప్పుడు చెప్పబోవునది ఒకటి. దీనిని నేను తేది వేయకుండ నా డైరిలో వ్రాసుకున్నాను. మరియు అత్యంత మధురమైన ఘటన. నన్ను పవిత్రున్ని చేసింది.

**కల :** ఒక సారి స్వామివారు నన్ను తన యోగమాయచేత తిరుమల కొండపైన, స్వామి ఆలయానికి వాయువ్య దిశలో ఉన్న మాడ వీధిలో దించారు. స్వామి మాయచే ప్రక్కనే ఒక పెద్ద కొండ ఉంది. ఆ కొండ పైనుండి ఒక 50 HP నుండి 75 HP మోటారు నీరు ఎంత దొడ్డుగ వస్తుందో అంత నీరు కొండ పైనుండి క్రింద నాపైన పడే విధంగ పడింది. నేను పూర్తిగ ఈ నీటితో స్నానం చేసాను. ఒక రకంగ పవిత్రున్ని అయినాను. ఇది కల.

ఈవిధంగ స్వామివారు రెండుసార్లు పవిత్రజలాలతో పునీతున్ని చేసాడు. ఈ రెండు కూడ నేను సంకల్పం తీసుకొనుటకు ముందు జరిగినవి.

## సందేహాల నివృత్తి, శ్రీశ్రీ మాడాంబకం స్వామి సలహా

**21-12-2002:** కీ.శే. వాడ్రేవు గవర్రాజు గారు శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం అనే పేరును తొలగించమన్నారు. మరియు జపం వ్రాయించే యోగ్యత నాకు లేదన్నారు. కాని స్వామివారు తేది 25-11-2002 నాటి లీలలో నన్ను జపం వ్రాయించుటను కొనసాగించమన్నారు. కాబట్టి జపం వ్రాయించుటను కొనసాగించ నిర్ణయించుకున్నాను. కాని పీఠం పేరును మాత్రం 'శ్రీవేంకటేశ్వర సేవా సమితి' అని మార్చుదామని నిర్ణయించుకున్నాను. చివరికి హైదరాబాద్‌లో ఈ పీఠం పెట్టినప్పుడు నాకు సహాయకులుగ ఉన్న శ్రీ పాండురంగా రావు, శ్రీనివాస రావు, గోపాల్ రావు గార్లతో చర్చించాను. వారు దీనికి ఒప్పుకోలేదు. కీ.శే. గవర్రాజు గారు తన స్వార్థం కోసం ఇలా చేస్తున్నారని మనము వినకూడదని అన్నారు. దానిని నేను ఒప్పుకొని పేరు మార్చలేదు. ఇంకా కొందరి అభిప్రాయము కొరకు వేచిచూస్తున్నాను. ఈ విషయాన్ని తిరుపతిలోని శ్రీకొండారెడ్డిగారితో చెప్పాను. మరియు తిరుపతిలో ఆయనకు తెలిసిన పెద్దలతో చర్చించి నేను పీఠంను పెట్టుకోవచ్చా? లేదా అనే విషయంను కనుక్కొమ్మన్నాను. మరియు నా సంకల్పమును కూడ అంటే స్వామివారికి మొత్తం 111 కోట్ల జపసమర్పణ విషయమును, స్వామివారికి బొట్టు పెట్టుటను పూర్తి విషయాలను తెలుపుచు ఈరోజు ఒక సుదీర్ఘమైన ఉత్తరమును వ్రాసాను. నేను సందిగ్ధములో ఉన్నానని, ఈ పనులు చేయవచ్చా లేదా అనే విషయమును తిరుపతిలోని పండితులను విచారించి తెలుపమని మరిమరి వేడుకున్నాను. మరియు అంతవరకు నేను శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠంను కొనసాగించుచు, జప పుస్తకముల పంపిణీని జరుపుచున్నాను.

వచ్చే వైకుంఠఏకాదశి రోజున తిరుమల కొండపైన స్వామివారి జపపుస్తకాల పంపిణీ చేయాలని చాల కోరిక కలిగింది. మరియు స్వామివారిని ఆ రోజు దర్శించాలనిపించింది. ఈవిషయాన్ని డా॥ కొండారెడ్డి గారితో చెప్పి సహాయము చేయమన్నాను. చివరికి ఆయన ఆహ్వానం మేర వైకుంఠ ఏకాదశికి తిరుపతి వెళ్ళాను. అనుకోకుండా

నా సందేహాలకు నివృత్తి లభించింది. ఆలీల ఈవిధంగ ఉంది.

14-01-2003 , ఈరోజు వైకుంఠ ఏకాదశి, తిరుమల కొండపైన స్వామివారి జపపుస్తకాలను పంపిణి చేయాలని, మరియు స్వామివారిని వైకుంఠ దర్శనము చేసుకోవాలనే ఉద్దేశ్యముతో తిరుమలకు వెళ్ళాను. డా॥ కొండారెడ్డి గారి సహకారముతో కొండపైన జపపుస్తకములను పంచాను. మరియు ఉదయము స్వామివారి దర్శనము కూడ చేసుకున్నాను.

ప్రతి వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం స్వామి వారి బంగారు రథము తిరుమల ఆలయం చుట్టు తిరుగుట ఆనవాయితి. అప్పుడు తిరుమలలో కీ.శే. శ్రీశ్రీ మాడాంబకం స్వామి అనే ఒక వైఖానస పండితుడు ఉండేవారు. వీరు తిరుమల ఆస్థాన పండితులు. స్వామి కృపవల్ల డా॥ కొండారెడ్డిగారికి ఈ బంగారు రథం త్రిప్పే దానిలో డైరీఫాం తరఫున డ్యూటీ పడింది. ఆ రథయాత్రకు శ్రీమాన్ మాడాంబకం స్వామివారు కూడ వచ్చారు. ఆనాడు ఈ రథయాత్ర మొత్తం దాదాపు 2 గం॥ల కాలం జరిగింది. ఈ రెండుగంటల కాలము డా॥ కొండారెడ్డిగారు మరియు మాడాంబకం స్వామివారు కలిసి రథయాత్ర ముందు నడుచుకుంటు ఉన్నారు. ఈ సందర్భంగ మొత్తం దాదాపు 2 గంటల కాలము డా॥ కొండారెడ్డి గారు నాగురించి మాడాంబకం స్వామివారికి అన్ని విషయాలు చెప్పారు. డైరీఫాంలోని స్థూపనిర్మాణము, స్వామివారి ప్రేరణ, నా తపన శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఏర్పాటు, మరియు 16 సం॥లు ప్రతి సం॥ము 7 కోట్ల జపసమర్పణ గురించి చెప్పారు. మరియు నేను శ్రీవేంకటేశ్వరునికి బొట్టుపెట్టుట గురించి కూడ అడిగారు.

అప్పుడు కీ.శే. మాడాంబకం స్వామివారు ఈ కార్యక్రమము చాల మంచిదని అన్నారు. కాని ప్రస్తుతము నేను వ్రాయించుచున్న "ఓం శ్రీం వేంకటేశాయ నమః" అనే మహామంత్రానికి బదులుగా "ఓం నమో వేంకటేశాయ" అనే మహామంత్రమును వాడమని చెప్పారు. "శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం" అనే పేరు పెట్టుటలో తప్పులేదని అన్నారట. ఇక బొట్టు విషయము వచ్చేసరికి, దీనికి ఒక పూజ అంటూ ఏదీలేదని ఇది భక్తులు వారివారి మనస్సులో జరుపుకొనే పూజ అని తెలిపారు. మరియు నన్ను ఇదే విధంగ కొనసాగించమని చెప్పారు. మధ్యహ్నం 2.0 గం॥లకు శ్రీ కొండారెడ్డి గారు కొండపై రూంలో ఈ విషయాలు నాతో చెప్పారు. మరియు, మాడాంబకం స్వామివారు చాల కాలము స్వామివారి ప్రధాన అర్చకుడు, తిరుమల తిరుపతి ఆలయాలకు పెద్ద, ఆయనను మించిన వారు లేరు కాబట్టి ఆయన చెప్పిన దానిని పాటించమన్నాడు. సందేహాలను తీర్చుకొనుటకు మరెవ్వరిని అడుగకు మన్నారు. దీనికి నేను చాల సంతోషించాను. ఇది నా స్వామి అనుగ్రహము వలననే జరిగిందని భావించాను. పేరును మార్చను మరియు 'ఓం శ్రీం వేంకటేశాయ నమః" నుండి "ఓం నమో వేంకటేశాయ" అని మహామంత్రమును మార్చుదునని నిర్ణయించాను.

గతంలో తేది 26-08-2002 నాడు శ్రీగవర్రాజు గారు పొందిన కలను విశ్లేషించుకున్నాను. "ఈ స్థూపం పేరుపైన ఒక సంస్థ ఏర్పాటు అగునని, మంచి పేరు సంపాదించునని చెప్పుచు ఈ విషయం నీకు ఇప్పుడు అవసరంలేదు" అని చెప్పారు. అప్పుడే స్వామివారు దీనిని ఇన్‌డైరెక్టుగ తెలిపారని భావించాను. ఇప్పటి నుండి శ్రీ గవర్రాజు గారితో బంధం తెగిపోయింది, టి.టి.డితో బలపడింది.

సం॥ 2003 లో నా ఆర్థిక పరిస్థితి అంతంతనే ఉంది. భక్తి ప్రపంచములో అప్పుడప్పుడే ప్రవేశించాను. శాస్త్రజ్ఞానము అసలే లేదు. ఇలాంటి పరిస్థితులలో నేను సం॥ 2002 నుండి సం॥ 2018 వరకు, 16 సం॥లు ఇంత పెద్ద సేవ చేయ నిర్ణయించానంటే దానికి పూర్తి ప్రేరణ, శక్తి నా స్వామివారిదే! ఈ సంకల్పం తీసుకొన్నప్పుడు, దీనిని నేను 100% పూరించగలననే నమ్మకము నాలో దృఢంగ ఉంది. నేనేమాత్రం వెరవలేదు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టాల్సిన పని అయినప్పటికి నాలో ఎలాంటి భయము కాని చేయలేననే అనుమానము కాని ఏ కోశాన లేదు. నా భార్యకు మాత్రం మనం ఈ పని చేయగలమా? మన ఆర్థిక పరిస్థితి సహకరించునా? అనే అనుమానం ఉండేది. పైగ మేము ఈపనికి మా సొంత డబ్బును ఉపయోగించదలచాము. ఇష్టపూర్వకంగ ఇస్తే తప్ప ఇతరులను నోరు తెరచి అడగకూడదని నియమం పెట్టుకున్నాం! జీవితాంతం, మా ఆఫీసుకు వచ్చిన ప్రతి భక్తునికి లేదనకుండ జప పుస్తకము ఇవ్వాలని నిర్ణయించుకున్నాము. ఈ జీవితంలో తనవితీర స్వామిసేవ చేయుటకు ఈ సంకల్పాన్ని తీసుకున్నాను తప్ప స్వామివారిని పొందాలనే ఉద్దేశ్యము నాలో ఏమాత్రం లేదు.

ఇక ఈ సేవ సరైనదేనా? శాస్త్ర ప్రకారంగ ఉన్నదా? అనే ప్రశ్నను ఎవ్వరైన వేస్తే వినదలచుకోలేదు. ఇతరులు చెప్పే విషయాలకు ప్రభావితులమై మార్పులు చేర్పులు చేయదలచుకోలేదు. కేవలం శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞానుసారం, వారిని సంతోషపెట్టుటే లక్ష్యంగ సేవను ప్రారంభించాము. కాని నా సంకల్పం ఇతరులకు తెలియకుండ ఒక లోగోను తయారు చేయాలని భావించాను.

## శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం లోగో

**08-02-2003 :** శ్రీ వేంకటేశ్వరునికి సంకల్పించిన మొత్తం 111 కోట్ల జప సమర్పణ మరియు దాని లక్ష్యంను ఎవ్వరికి తెలియకుండ రహస్యంగ ఒక లోగోలో ఇమిడ్చాలనిపించింది. స్వామివారి ప్రేరణతో ఆనందనిలయంపై

తిరునామం పెట్టి, ఆ నామం మధ్యలో బొట్టుపెట్టుటను లోగోగ నిర్ణయించాను. దీనర్థం తిరుమల ఆనందనిలయ వాసునికి 111 కోట్ల జపము సమర్పించి దాని ఫలితముతో ఆయనకు బొట్టుపెట్టుట అనేది ఈ లోగో యొక్క లక్ష్యంగ పెట్టుకున్నాము. రథసప్తమి 08-02-2003 రోజు ఆఫీసులో పూజ చేసి సంకల్పమును విడుదల చేసాము. ఈపూజ చేయు సమయాన స్వయంగ తిరుమల శ్రీవారే నా ముందు కనబడ్డారు. నేను స్వయంగ వారినే పూజించానన్న తృప్తిపొందాను. మొత్తం సంకల్పమును మరియు లోగోను భక్తులకు పంచాను. సం॥ 2002 నుండి 2018 వరకు ప్రతి సం॥ 7 కోట్ల జపసమర్పణ జరుగునని తెలిపాను. సంకల్పం ఇలా ఉంది.

## తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము

1. శ్రీ వేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట. వారందరినీ శ్రీవారి కరుణాకటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.

2. భక్తులు తమ కోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామమును స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.

3. భక్తులలో శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల భక్తిని పెంపొందించి, ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.

4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేలమంది భక్తుల కోరికలను తీర్చుమని శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.

5. 2002 నుండి ప్రతి సంవత్సరము 7 కోట్ల జపమును శ్రీ వేంకటేశ్వర స్వామికి సమర్పించుచూ "శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము" ను శ్రీవారి నామముతో నింపి శ్రీవేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.

6. శ్రీ వేంకటేశ్వరుని \|/ నామము విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను \|/ కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో \|/ బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలక ధారణలోని ఆనందమును అనుభవించుట.

7. ఈ కార్యక్రమములో అందరు భక్తులు పాలుపంచుకునేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశము కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవచేయుచూ చిట్టచివరకు ఆ శ్రీ వేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

ఇది, ఆరోజు వ్రాసుకున్న సంకల్పము. దీనిని పూరించుటకు సేవచేయ సిద్ధమైనాము.

నా ఆత్రుతలో భాగంగ రెండు జపపుస్తకములకు ఈ సంకల్పమును జతచేసి అప్పటి టి.టి.డి ఇ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారికి, మాడాంబకం స్వామివారికి, డా॥ కొండారెడ్డి గారికి మరికొందరు టి.టి.డి అధికారులకు పంపాను. కాని తరువాత రోజులలో శ్రీవేంకటేశ్వరుడు దీని ద్వార ఒక లీల జరిపి నాకు మహాదానందం కలిగించునని ఊహించలేకపోయాను.

**ఒక విశ్లేషణ :** శ్రీ వేంకటేశ్వరుడు నాకు తన 'సేవావృక్షాన్ని' ప్రసాదించారు. శ్రీవేంకటేశ్వరున్ని పొందడమే లక్ష్యంగ జపసమర్పణతో పాటు ఎన్నోసేవలను ప్రసాదించారు. ప్రతి సేవాలక్ష్యం స్వామివారిని పొందడమే. పూర్వము ఋషిభద్రుడు, ఋషియాదగిరి తపస్సు చేసి యోగ్యత సాధించి వారి ఇష్టదైవాన్ని పొంది భద్రాచలం, యాదగిరిగుట్ట క్షేత్రాలను ఏర్పాటు చేసారు. అదే విధంగ నేను కూడ స్వామి సేవలనే తపస్సు చేసి యోగ్యత సాధించి, శ్రీవేంకటేశ్వరున్ని పొంది చిన్నగుండవెళ్ళి గ్రామంలో 'హరినామ క్షేత్రం' ఏర్పాటుకు కారకున్ని కావలెనని స్వామివారి లక్ష్యం. ఈ లక్ష్య సాధనకే సం॥2000 నుండి నేటి వరకు (అక్టోబర్, 2023) స్వామివారి లీలలు కొనసాగుచున్నవి. ప్రతిలీల స్వామివారి గురించి తపనే లక్ష్యంగ సాగుతుంది.

**నా దిశ:** స్వామివారి సేవాభాగ్యం లభించింది. శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠంను ఏర్పాటు చేసాను. 16 సం॥ ల సేవ లభించింది. ఒక్క తప్పు లేకుండ సేవ చేసి శ్రీ వేంకటేశ్వరున్ని పొందాలనే లక్ష్యం ఏర్పడింది.

**భాగవత ఆశీర్వాదము:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురించుచున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన. **(సశేషం)**

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**
ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050
Visit: www.srivenkatesham.org



# దశావతార వ్రతము

– చిల్లర సీతారామారావు

భారతదేశము ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యతనిచ్చు దేశము. భాద్రపద మాసమున వ్రతములు, నోములు అధికము. వ్రతములను ఆచరించుట వలన ఆత్మశుద్ధి, జ్ఞానము, బుద్ధి, శ్రద్ధ, మేధ, భక్తిభావన, పవిత్రత మున్నగునవి వృద్ధి చెందుతాయని వ్రత గ్రంథములు పేర్కొంటున్నాయి. భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో వ్రతములు చేసినట్లయితే ధనధాన్య సమృద్ధి, సుఖ సంపదలు సమస్త పాపముల నుండి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసము. వ్రతము అనగా పుణ్య ప్రాప్తికొరకు ఉపవాసము మున్నగు నియమములతో సత్సంకల్పముతో చేయు కార్యము అని అర్థము. ఉపవాసము ఉండుట వలన సమస్త రోగములు సమసిపోయి మంచి ఆరోగ్యము, దీర్ఘాయువు ప్రాప్తిస్తుంది.

దశావతార వ్రతము శ్రీ మహావిష్ణువు దశావతారముల నుద్దేశించి చేయు వ్రతము. ఈ వ్రతమును భాద్రపద మాస శుక్ల పక్ష దశమి నాడు జరుపుకుంటారు. ఆరోజు వేకువజామున లేచి నదీ తీరమునకు వెళ్ళి స్నానము చేస్తారు. పితరులకు తర్పణాలు వదులుతారు. గృహమునకు తిరిగి వచ్చిన తరువాత శ్రీమహావిష్ణువును ధూపదీప గంధ పుష్పాదులతో, షోడశోపచార పూజలను చేస్తారు. భగవంతునికి నైవేద్యము పెడతారు. భగవంతుడికి సమర్పించిన నైవేద్యములో సగభాగమును దేవుని దగ్గరే ఉంచాలి. నాలుగవ వంతు భాగమును బ్రాహ్మణునకు ఇవ్వాలి. మిగతా భాగమును తాను స్వీకరించాలి. ఈ వ్రతమును పది సంవత్సరములు చేయాలి. భక్తిశ్రద్ధలతో పూజించినవారు భగవంతుడి అనుగ్రహము వలన జనన మరణముల నుండి విముక్తులవుతారు. విష్ణులోకమునకు వెళ్ళి అక్కడ నివసిస్తారు. పిదప విష్ణు భగవానుని ప్రార్థించుకుంటారు.

శ్లో|| గతో2స్మి శరణం దేవం హరిం నారాయణం ప్రభుమ్
ప్రణతో2స్మి జగన్నాథం సమేవిష్ణుః ప్రసీదతు
ఛినన్తు వైష్ణవీం మాయాం భక్త్వా ప్రీతో జనార్దనః
శ్వేత ద్వీపం నయత్వ స్మాన్మయాత్మావినివేదిత

(భవిష్యత్పురాణమ్)

దశావతారములను ధరించువాడా, నారాయణా, హరీ, నేను మీ శరణు కోరి వచ్చాను. మీరు నాయందు ప్రసన్నులై కనికరించండి. జనార్దనా! మీరు భక్తికి మాత్రమే వశీభూతులు. వైష్ణవీ మాయను నివారించి, నన్ను మీ సదనమునకు తీసుకొని వెళ్ళండి. సంపూర్ణ భక్తి భావనతో నన్ను మీకు సమర్పించుకుంటున్నాను.

విష్ణు భగవానుడు దశావతారములను ఎత్తడానికి సంబంధించిన నొక కథ భవిష్యత్ పురాణములో చెప్పబడింది. సత్య యుగమున భృగువు అను ఒక మహర్షి ఉండేవాడు. ఆయన ధర్మపత్ని పేరు దివ్య. భాగవతము, విష్ణు పురాణముల యందు భృగువు ధర్మపత్ని ఖ్యాతియని పేర్కొనబడినది. దివ్య మహాపతివ్రత. దంపతులిద్దరూ సుఖమయ జీవనమును గడుపుతుండెడివారు. అగ్నిహోత్ర కార్యము నిర్విఘ్నముగా సాగుతుండేది. ఒకసారి దేవతలకు రాక్షసులకు భయంకరమైన యుద్ధము జరిగింది. ఆ యుద్ధములో మహా విష్ణువు బలపరాక్రమాదులకు రాక్షసులు భయపడిపోయారు. వారు వెంటనే భృగువు దగ్గరకు వెళ్ళి రక్షించమని ప్రార్థించారు. భృగువు రాక్షసులను రక్షించెదనని పలికి వారిని పంపించి వేశాడు. పిదప అగ్నిహోత్ర కార్యమును ధర్మపత్ని దివ్యకు అప్పగించి తపమాచరించుటకు హిమాలయ పర్వత ఉత్తర ప్రాంతమునకు వెళ్ళాడు. భృగువు శివుడి గురించి తపము చేయగా ఆ తపమునకు శివుడు ప్రసన్నుడై భృగువును వరమును కోరుకోమని పలికాడు. తన యెదుట ప్రత్యక్షమైన శివుడిని చూచి ఆనందముతో శివుడిని స్తుతించాడు. పిదప తనకు సంజీవని విద్యను ప్రసాదించమని ప్రార్థించాడు. తథాస్తు అని పలికి శివుడు అదృశ్యమైనాడు. ఆ వర ప్రభావముతో రాక్షసులను విజయులను గావించుదామని సంకల్పించుకున్నాడు.

రాక్షసులకు దేవతలకు యుద్ధము జరుగుతున్న సమయములో మహావిష్ణువు గరుడ వాహనుడిగా వచ్చి రాక్షసులందరినీ హతమార్చాడు. రాక్షసులందరూ హతమవడాన్ని గమనించిన దివ్య మిక్కిలి కోపముతో విష్ణువును శపించాలనుకున్నది. ఆమె నోటి నుండి శాప పలుకులు వెలువడడానికి ముందే శ్రీమహావిష్ణువు తన చక్రముతో ఆమె శిరస్సును ఖండించాడు. శివుడు ప్రసాదించిన వరముతో, ఆనందముతో ఆశ్రమమునకు చేరుకున్నాడు భృగువు. ధర్మపత్ని దివ్య, రాక్షసగణము విగత జీవులు గావడం చూచి భృగువునకు అమితమైన క్రోధము కలిగింది. ఆ క్రోధముతోనే విష్ణువును భూలోకమున పది అవతారములు ఎత్తుమని శపించాడు. భృగువు శాపముననుసరించి విష్ణు భగవానుడు దశావతారములను ధరించవలసి వచ్చింది.

శ్లో॥ మత్స్య కూర్మో వరాహశ్చ నరసింహశ్చ వామన
రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కిర్జనార్దన॥

దుష్టశిక్షణ శిష్టరక్షణ నిమిత్తము శ్రీ మహావిష్ణువు పలు అవతారములు ధరించిననూ అందు ముఖ్యమైనది దశావతారములు. మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, త్రివిక్రమ (వామన), పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణ, బుద్ధ, కల్కి అనునవి దశావతారములు. శ్రీమహావిష్ణువు అవతార గాథలు ఎన్నిమార్లు చదివిననూ, ఎన్నిమార్లు వినిననూ తనివితీరని అద్భుత గాథలు. ఒక్కొక్క అవతారమును క్లుప్తముగా స్మరించుకుందాం.

## దశావతార స్తుతి

### 1. మత్స్యావతారము

శ్లో॥ వేదోద్ధార విచారమతే సోమకదానవ సంహరణే
మీనాకార శరీర నమో భక్తంతే పరిపాలయమామ్॥

వేదములను దొంగిలించి, సంద్రమున దాగిన సోమకాసురుడిని జంపుటకై మహా మీన రూపము దాల్చిన యో విష్ణు దేవా! నీ భక్తుడగు నన్ను కాపాడుము.

### 2. కూర్మావతారము

శ్లో॥మంథానాచల ధారణ హేతో దేవాసుర పరిపాల విభో
కూర్మాకార శరీర నమో భక్తంతే పరిపాలయమామ్॥

సురాసురులు పాల సంద్రమును మందర గిరితో మథించువేళ వారి సౌకర్యమునకై కూర్మావతారమెత్తి మందరగిరిని మూపున దాల్చిన యో విష్ణుదేవా! నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

### 3. వరాహావతారము

శ్లో॥భూచోరక హర పుణ్యమతే క్రోడోద్ధృత భూదేవిహరే
క్రోడాకార శరీర నమోభక్తంతే పరిపాలయమామ్॥

భూమిని దొంగిలించి, చాపగా చుట్టి, సంద్రమున దాగిన హిరణ్యాక్షుడిని వధించి భూమి నుద్ధరించుటకై వరాహావతారము దాల్చిన యో విష్ణు దేవా! నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

### 4. నరసింహావతారము

శ్లో॥ హిరణ్యకశ్యపుని సంహరించి, భక్తాగ్రేసరుడగు ప్రహ్లా
దునకు అభయమొసంగ దలచి, కనివిని యెరుంగని ఆశ్చర్య
కరమగు నరసింహావతారము దాల్చిన యోమహావిష్ణు దేవా! నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

### 5. వామనావతారము

శ్లో॥ భవబంధనహర వితతమతే పాదోదక విహతా ఘతతే
వటు పటువేషమనోజ్ఞ నమో భక్తంతే పరిపాలయమామ్॥

సంసార బంధములను తొలగించువాడా, విశాల హృదయము గల వాడా, పాదము లను కడిగిన బలి చక్రవర్తి సమస్త పాపములను తొలిగించినవాడా, గొడుగు, జందెము, కృష్ణాజినము, కౌపీనము, పంచశిఖలు పాలాశ దండము,



కమండలము మున్నగు బ్రహ్మచారి లక్షణములు గలవాడా, వామన రూపము ధరించిన యో విష్ణుదేవా! నేను నీ భక్తుడను కాపాడుము.

### 6. పరశురామావతారము

**శ్లో॥ క్షితిపతి వంశక్షయ కరమూర్తే క్షితిపతి కర్తాంహరమూర్తే**
**భృగుకుల రామ పరేశ నమో భక్తంతే పరిపాలయమామ్॥**

జమదగ్ని కడుపున బుట్టి, రాజవంశమును నాశనమొనర్చి రక్తపు మడుగుల నందలి రక్తముచే తండ్రికి తర్పణములిచ్చిన భార్గవ రామా, పరేశా, విష్ణు స్వరూపా, నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

### 7. రామావతారము

**శ్లో॥ సీతావల్లభ దాశరథే దశరథ నందన లోకగురో**
**రావణ మర్దన రామ నమో భక్తంతే పరిపాలయమామ్॥**

దశరథ రాజపుత్రుడవై జన్మించి, సీతను పరిణయమాడి వనవాస సమయమున సీతను అపహరించిన రావణాసురుడిని వధించుటకు రామావతారమెత్తిన యోవిష్ణుదేవా! నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

### 8. కృష్ణావతారము

**శ్లో॥ కృష్ణానంత కృపాజలధే కంసారే కమలేశ హరే**
**కాళీయమర్దన లోక గురో భక్తంతే పరిపాలయమామ్॥**

అనంతుడు, దయాసముద్రుడు, కంసుడిని సంహరించిన వాడు, కాళీయమర్దనుడు, లోకములకు గురువుగా శ్రీకృష్ణావతారమెత్తిన యోవిష్ణుదేవా! నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

### 9. బుద్ధావతారము

**శ్లో॥ దానవపతి మానాపహరా త్రిపుర విజయమర్దన రూపా**
**బుద్ధజ్ఞాయచ బౌద్ధ నమోభక్తంతే పరిపాలయమామ్॥**

దానవపతియగు బలి చక్రవర్తి గర్వమును అణచినవాడా, త్రిపుర విజయుడిని మర్దించినవాడా, బుద్ధికి జ్ఞానమును ప్రసాదించు బుద్ధునిగా అవతారమెత్తిన యో విష్ణుదేవా! నీ భక్తుడనగు నన్ను కాపాడుము.

శ్రీ మహావిష్ణువు కృతయుగమున మత్స్య, కూర్మ, వరాహ, నారసింహావతారములను, త్రేతాయుగమున వామనుడు, పరశురాముడు, దశరథ రాముడి అవతారములను, ద్వాపర యుగమున కృష్ణుడు, బుద్ధుడు అవతారములను ధరించి కలియుగమున కల్కి అవతారమును ధరించబోతున్నాడు. భక్త జయదేవుడు శ్రీ మహావిష్ణువు దశావతారములను ఒక్క శ్లోకమున శ్రవణోపేయముగా రచించాడు.

**శ్లో॥ "వేదానుద్ధరతే, జగన్నివహతే, భూగోళముద్బిభ్రతే**
**దైత్యందారయతే, బలించ్ఛలయతే, క్షత్రక్షయం కుర్వతే**
**పౌలస్త్యం జయతే, హలం కలయతే, కారుణ్యమాతన్వతే**
**మ్లేచ్ఛాన్మూర్ఛయతే, దశాకృతి ధృతే కృష్ణాయతుభ్యం నమః"**

వేదములను ఉద్ధరించిన మత్స్య రూపుడవు, భూమిని వహించిన కూర్మ రూపుడవు, చాపగా జుట్టి సంద్రమున ముంపబడిన భూగోళమును పైకెత్తిన వరాహ రూపుడవు, ప్రహ్లాద ద్వేషియగు హిరణ్య కశిపుడిని వధించిన నారసింహ రూపుడవు. బలి రక్కసుడిని వంచనచే పాతాళమున కణచివేసిన వామన రూపుడవు, రాజవంశమును పలుమార్లు నాశనమొనర్చిన పరశురామ రూపుడవు, దుష్ట రావణుడిని పోరున జయించిన శ్రీరామ రూపుడవు, నాగలిని ఆయుధముగా దాల్చిన బలరామ రూపుడవు, కరుణా శీలము గల బుద్ధ రూపుడవునగు విష్ణుదేవా! కృష్ణదేవా! నీకు నమస్కారము.

భాద్రపద శుక్ల దశమినాడు దశావతార వ్రతము నాచరించి, దశావతార స్తుతి స్మరించి, జీవితములను ధన్యము చేసుకుందాము. దశావతారుడైన శ్రీమహావిష్ణు దీవెనలతో ఇహపర లోకములందు సుఖ సంపదలను బొందుదాము.



# జ్ఞాన సంబంధ నయనార్

- మందరపు వి.జి. శంకరాచారి

క్రీ.శ. 6,7 శతాబ్దముల మధ్యకాలములో ద్రవిడ దేశంలోని (తమిళనాడు) శీర్షాలి గ్రామంలో శివపాద హృదయుడు, భగవతి దంపతులకు జన్మించినవాడే జ్ఞాన సంబంధ నయనార్. త ల్లిదండ్రులిద్దరూ శివారాధకులు. తండ్రి ప్రతిరోజూ ఆ గ్రామములో గల శివాలయమునకు వెళ్ళి అక్కడగల కోనేటిలో స్నానమాచరించేవాడు. అతడు ఉదయం, సాయంత్రం రెండుపూటలా కోనేటి స్నానమాచరించి సంధ్యావందనము గావించి ధవళ వస్త్రములు ధరించి పరమ పవిత్రమైన మనసుతో గుడిలోని శివుడ్ని దర్శించి ఆరాధిస్తూ ఉండేవాడు. గుడి తలుపులు మూసిన తర్వాత మాత్రమే ఇంటికి బయలుదేరేవాడు. అంతవరకు ఆ గుడిలో అతడు ధ్యాన నిమగ్నుడై అంతర్యామితో మమేకమయ్యేవాడు.

ఈవిధంగా శివపాద హృదయుడు శివారాధనలో నిమగ్నమైతే.. అతని భార్య భగవతి గృహిణిగా తన వ్యవహారములను చక్కదిద్దుకుంటూ ప్రతిక్షణం శివుడే దైవంగా భావించి కర్మయోగినిలా జీవిస్తూ ఉండేది.

ఇలాంటి భక్తులైన ఆ దంపతులకు పరమ శివుడి అనుగ్రహంతో ఒక బాలుడు జన్మించాడు. ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమానుడై 3 సంవత్సరాల వయసు గలవాడు అయినాడు.

ఆరోజు తండ్రి శివపాద హృదయుడు ఎప్పటిలాగే కోనేటి స్నానమాచరించి శివదర్శనం చేసుకుందామని శివాలయానికి బయలుదేరాడు. అతడితో పాటే కుమారుడు తను కూడా వస్తానని ఏడుస్తూ శివపాద హృదయుడి కాళ్లు చుట్టేస్తాడు. ఎంత ఊరడించినా ఊరుకోకపోయేసరికి తనతోపాటు శివాలయమునకు తీసుకుని వెళ్తాడు శివపాదహృదయుడు.

శివాలయం చేరుకున్న శివపాద హృదయుడు అక్కడ గల కోనేటిలో స్నానమాచరించి సంధ్యావందనం చేసిన తర్వాత ఆలయ ప్రవేశం చేయడం పరిపాటి. అయితే తనతోపాటు మూడు సంవత్సరాల వయసుగల కుమారుడు రావడం వలన ఆ బాలుడ్ని కోనేటి వద్దకు తీసుకుని వెళ్ళకుండా శివాలయ

ప్రాంగణంలోనే ఒకచోట (కోనేరు కనిపిస్తుంది) కూర్చోబెట్టి "నాయనా! నేను కోనేటిలో స్నానం చేసి వస్తాను. అప్పుడు మనమిద్దరం గుడిలోనికి వెళ్ళి శివుడ్ని దర్శించుకుందాం. అల్లరి చేయకుండా ఇక్కడ కూర్చో! ఒకవేళ నీకు భయం వేస్తే వృషభరూఢులై కూర్చునియున్న శివపార్వతులను చూపిస్తూ... చూశావా ఈ గోడలపై చెక్కబడినవి బొమ్మలనుకున్నావా.. కాదు.. ఆ దంపతులిద్దరూ నీకే కాదు.. ప్రపంచంలోని వారందరికీ తల్లి, తండ్రి.. కాబట్టి నీకు భయమనిపిస్తే అమ్మా.. అప్పా.. అని వారిని పిలువు నీకు కలిగిన భయం వెంటనే పోతుంది"అని చెప్పాడు.

అందుకు ఆ మూడేళ్ళ బాలుడు అలాగేనంటూ తల ఊపాడు.

శివపాద హృదయుడు స్నానం చేయడానికని కోనేటి దగ్గరకు వెళ్ళినాడు. కోనేటిలో స్నానమాచరిస్తూ ముక్కు మూసుకుని సంధ్యావందనం చేయాలని నీట మునిగాడు. తదేకంగా తండ్రినే గమనిస్తున్న మూడేళ్ళ జ్ఞాన సంబంధ నయనార్ తండ్రి కనబడకపోవడంతో బిగ్గరగా ఏడుస్తూ శివపార్వతులున్న గోడ దగ్గరకు వెళ్ళి "అమ్మా.. అప్పా... నాన్న" అంటూ బిగ్గరగా రోదించసాగాడు.

ఆ పసిబాలకుడి పిలుపు విన్న పార్వతీపరమేశ్వరులు సాకారులై హుటాహుటిన ఆ బాలుడి దగ్గరకు వచ్చారు. పార్వతీదేవి ఆ బాలుడ్ని తన చేతిలోకి తీసుకుని ఊరడించసాగింది. అయినా ఆ బాలుడు ఏడుపు మానలేదు. అది గమనించిన శివుడు పార్వతితో..

"పార్వతీ! నీ కుమారులైన వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి అల్లరిచేస్తే ఏవిధంగా ఊరుకోబెడతావు" ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకు పార్వతీదేవి "ఏడ్చిన పిల్లలకు నాస్తన్యమిచ్చి వారి ఆకలి తీరుస్తాను"సమాధానం చెప్పింది.

ఇప్పుడు కూడా అదే పని చేసి బాలుడి రోదనాన్ని ఆపమంటాడు శివుడు.

"నా స్తన్యం ఈ బాలుడికిచ్చిన మరుక్షణం బ్రహ్మజ్ఞానం పొంది అలవోకగా నోటి నుండి శివస్తుతులను చేస్తాడు. కీర్తనలు పాడుతాడు. అది ఇప్పుడు అవసరమా?" అడుగుతుంది.

"అవును దేవి! ఇప్పుడు అవసరమే. ఇప్పుడు భూలోకంలో సనాతన ధర్మాన్ని ఉద్ధరించవలనంటే ఇప్పుడీ బాలుడు బ్రహ్మజ్ఞాని కావలె. వేదములకు సనాతన ధర్మమునకు ప్రాముఖ్యతను ఇవ్వని పాషండులు పెరిగిపోవుచున్నారు. కాబట్టి వారిని నిరోధించి సనాతన ధర్మాన్ని ఉద్ధరించి తిరిగి ముక్కోటి దేవతలు ప్రజల చేత ఆరాధింపబడవలెనంటే ఇతడి దైవభక్తి ప్రబోధాలు సమాజానికి ఎంతో అవసరం"అని చెబుతాడు.

వెంటనే పార్వతీదేవి ఒక బంగారు గ్లాసులో తన స్తన్యము నుండి వచ్చిన పాలను నింపి ఆ బాలుడి చేత త్రాగిస్తుంది. ఆ పాలను త్రాగిన వెంటనే కింకను ఆపుతాడు. శివపార్వతులు అదృశ్యమవుతారు.

అంతలో కోనేటిలో స్నానం చేసి కుమారుడి దగ్గరకు వచ్చిన శివపాద హృదయుడు కుమారుడి నోటిపై గల పాల చారికలను చూసి "నీకు పాలు ఎక్కడివి? ఎవరు ఇచ్చారు?"అని ప్రశ్నిస్తాడు.

అంతే.. ఆ బాలుడు తడుముకోకుండా తండ్రి చూపించిన పార్వతీ పరమేశ్వరులను చూపిస్తాడు. (గోడలపై చెక్కబడియున్న శివపార్వతులు)

కుమారుడు చెప్పిన మాటలను నమ్మిన శివపాద హృదయుడు "కుమారా! నీవు చాలా అదృష్టవంతుడివి. శివపార్వతుల దర్శనం జరిగింది. మాకు కలగని దర్శన భాగ్యం నీకు కలిగినందుకు నీ పట్ల శివపార్వతులిద్దరూ కరుణ చూపించి సాకారులై నీ దగ్గరకు రావడం నాకెంతో ఆనందం కలిగిస్తోంది. పద.. గుడిలో కొలువై యున్న పరమ శివుడ్ని దర్శిద్దాం" అంటూ మూడేళ్ళ కుమారుడ్ని ఎత్తుకుని గుడిలోకి వెళ్ళసాగాడు.

అంతే.. మూడేళ్ళ బాలుడైన జ్ఞాన సంబంధ నయనార్ అశువుగా శివుడ్ని తన కీర్తనలతో స్తుతిస్తూ గానం చేయసాగాడు. ఆ గానం శివపాద హృదయుడ్ని మరింత ఆశ్చర్యచకితుడ్ని చేసింది.

అది మొదలు జ్ఞాన సంబంధ నయనార్ తన వెంట కుమారుడ్ని కూడా శివాలయానికి తీసుకుని వెళ్ళసాగాడు.

జ్ఞాన సంబంధ నయనార్ యొక్క కృతులను, కీర్తనలను, బోధనలను, బ్రహ్మజ్ఞానం వినడానికి ఆ గుడికి ఎంతోమంది ప్రజలు వస్తూ ఉండేవారు. ఈ విధంగా ఆ ఊరిలోనే ఉంటూ శివభక్తి పట్ల ప్రచారాన్ని ఉధృతం చేశాడు.

సంవత్సరాలు గడిచాయి.

జ్ఞాన సంబంధ నయనార్ 8 సంవత్సరాల ప్రాయం వాడయేసరికి తండ్రి శివపాద హృదయుడు కుమారుడికి ఉపనయన మహోత్సవం జరిపాడు.

తదనంతరం జ్ఞాన సంబంధ నయనార్ ఊరూరా తిరుగుతూ వేదాలలోని గొప్పతనాన్ని శివభక్తిని తన బోధనల ద్వారా ప్రజలకు ఉపదేశిస్తూ ప్రజలలో భక్తి భావాన్ని పెంచసాగాడు. బీటలు వారుతున్న సనాతన ధర్మమునకు సరియైన మార్గాన్ని, దిశను చూపించాడు.

జ్ఞాన సంబంధ నయనార్‌కి ప్రజలలో పెరుగుతున్న ఆదరణను చూసి భ రించలేక పోయేవారు పాషండులు. వీరు వేదాలను ఒప్పుకోరు. సనాతన ధర్మంలో గల దేవుళ్ళను ఆరాధించడం వీరికి నచ్చదు. అందుకే జ్ఞాన సంబంధ నయనార్ ని ఏవిధంగానైనా అడ్డుకుని అతడి ప్రబోధాలు, ఉపన్యాసాలు

ప్రజల చెవులలో పడకూడదని ప్రయత్నం చేసేవారు.

ఈ విధంగా భక్తి తత్వమును తెలియజేస్తూ భక్తిమార్గాన్ని చూపుతూ దేశ సంచారము చేస్తున్న జ్ఞాన సంబంధ నయనార్ ఒకానొక గ్రామంలో ప్రవేశిస్తాడు.

ఆ గ్రామంలో గల ఒక వైశ్యుడు తన కుమార్తెను జ్ఞాన సంబంధ నయనార్‌కిచ్చి పెళ్ళి చేయాలని నిశ్చయించుకుంటాడు. తన ఊ రిలోనికి వచ్చిన వెంటనే జ్ఞాన సంబంధ నయనార్ ని కలిసి తన కోరికను చెప్పుకోవాలని తలపోస్తాడు. అయితే అనుకోకుండా జరిగిన ఒక సంఘటన వలన ఆ వైశ్యుడి కూతురు పాము కాటుకి గురై చనిపోతుంది. అయినా సరే ఆ వైశ్యుడు మరొక విధంగా ఆలోచించకుండా కుమార్తె చితాభస్మమును ఒక సీసానందు భద్రపరుస్తాడు. జ్ఞాన సంబంధ నయనార్ తన శివభక్తి వలన ఎంతోమందికి పునర్జీవనం కల్పిస్తున్నాడు కాబట్టి తను కూడా కుమార్తెను బ్రతికించుకోవాలని అనుకుంటాడు. ఈ కారణం వలనే కుమార్తె చితాభస్మమును భద్రపరచి ఎప్పుడు తన గ్రామంలోనికి జ్ఞానసంబంధ నయనార్ వస్తారా అని ఎదురు చూస్తూ ఉంటాడు.

ఆరోజు తన గ్రామంలోకి జ్ఞానసంబంధ నయనార్ వచ్చారని తెలుసుకున్న వైశ్యుడు కుమార్తె చితా భస్మంతో అతడి దగ్గరకు వెళ్ళి తన కూతుర్ని పునర్జీవింప చేయమని కోరుతాడు.

వైశ్యుడి వేదనను, బాధను అర్థం చేసుకున్న జ్ఞాన సంబంధ నయనార్ ఆ చితాభస్మాన్ని తన చేతిలోనికి తీసుకుని శివస్తుతిని చేస్తాడు. అంతే.. పది నిమిషాలలో ఆ చితాభస్మం వైశ్యుడి కుమార్తెగా అక్కడ నిలబడి ఉంటుంది.

అప్పుడు జ్ఞాన సంబంధ నయనార్ వైశ్యుడితో ''మిత్రమా! చితాభస్మమై మిగిలిన నీ కూతురికి ప్రాణ ప్రతిష్ఠ చేసిన నేను ఆమెకు తండ్రితో సమానుడిని. కాబట్టి నీ కూతుర్ని వివాహం చేసుకోను'' అని చెబుతాడు.

తదనంతరం ఆ గ్రామం విడిచి మధురై చేరుకుంటాడు. ఆ కాలంలో మధురైను చోళరాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఇతడి భార్య శివుడి భక్తురాలు. పాషండ మతస్థుల ప్రభావానికి లోనైన చోళరాజు వారి మాటలను నమ్మి మీనాక్షి దేవాలయాన్ని మూసివేస్తాడు. అది తప్పని భార్య ఎంతగా చెప్పినా ఆమె మాట వినకుండా దేవాలయాన్ని మూసి వేయడం జరుగుతుంది.

ఈ స్థితిలో మధురై వచ్చిన జ్ఞాన సంబంధ నయనార్ అక్కడ ఉన్న ప్రజలకు సనాతన ధర్మం యొక్క విశిష్టతను, శివభక్తిని గురించి, వేదముల గొప్పతనమును గురించి వివరిస్తూ ఉంటాడు. పాషండ మతస్థుల ప్రభావానికి లోనైన ప్రజలు ఇతడి ఉపన్యాసాలు విని తిరిగి సనాతన ధర్మంపై మక్కువ పెంచుకుంటారు. భక్తితత్వాన్ని అలవరచుకుంటారు. ఇది పాషండులు భరించలేకపోతారు.

రాజ్యాన్ని పరిపాలిస్తున్న చోళరాజుకి జ్ఞాన సంబంధ నయనార్ యొక్క బోధనలు, ప్రజలలో దృష్టిని మరలుస్తున్నాయని.. కాబట్టి తగిన చర్య తీసుకోమని కోరతారు.

పాషండ మతస్థులకు విలువనిచ్చిన ఆ చోళరాజు తనయొక్క గూఢచారులతో జ్ఞాన సంబంధ నయనార్ విడిది చేసి యున్న ఇంటిని కాల్చి రమ్మని చెబుతాడు.

ఆ రాత్రి జ్ఞాన సంబంధ నయనార్ విడిదింటికి నిప్పంటిస్తారు. నిద్రలో యున్న జ్ఞాన సంబంధ నయనార్‌కి వెంటనే తెలియవస్తుంది. ఆ క్షణమే శివస్తుతి చేస్తూ ''తండ్రి.. శివా.. ఎవరో తనపై కక్ష కట్టి ఈ విడిదింటిని కాల్చి నన్ను మంటలలో పడి చనిపోవునట్లుగా ప్రణాళిక వేశారు. అయితే ఎవరైతే ఈ పనిని చేయమని పురమాయించారో వారు అధిక ఉష్ణంతో, మంటలతోను బాధపడునట్లుగా చేయమని'' ప్రార్థన చేస్తాడు.

ఆ ప్రార్థనకు బోళా శంకరుడు స్పందిస్తాడు. విడిదిలో చెలరేగిన మంటలు ఆరిపోతాయి. మరుక్షణమే విశ్రాంతి భవనంలో నిద్రపోవుచున్న చోళరాజు గారి శరీరం అత్యంత వేడిగా మారిపోతుంది.

ఆ ఉష్ణానికి ఎవరూ అతడి దగ్గరకు వెళ్ళలేకపోతారు. విపరీతమైన వేడికి రాజుగారు అటు మరణించక ఇటు జీవించక నరకయాతన పడుతున్నాడు. అది చూసి శివభక్తురాలైన అతడి భార్య.. జ్ఞాన సంబంధ నయనార్ యొక్క విడిదిని మంటలలో కాల్చి వేయడానికి ప్రయత్నించడం వల్లనే నేడు మీరు అధిక ఉష్ణంతో బాధపడవలసి వస్తోంది. కాబట్టి వెంటనే అతడ్ని పిలిచి క్షమాపణ చెప్పుకుంటే ఇప్పుడు పడుతున్న బాధ తొలగిపోతుంది అని చెబుతుంది.

అయితే రాజు పాషండుల యొక్క ఉపదేశం వలన మొదట ఒప్పుకోడు. కాకపోతే అతడి ఒంట్లో వేడి మరింతగా పెరిగిపోయి భరించలేని స్థితికి రావడంతో జ్ఞానసంబంధ నయనార్‌ని తీసుకురమ్మని ఆజ్ఞాపిస్తాడు.

చోళరాజు గారు రమ్మని కబురు పంపడంతో జ్ఞాన సంబంధ నయనార్ రాజుగారి దగ్గరకు వెళతాడు.

అక్కడ రాజుగారి దగ్గర పాషండ మతస్థులు నిలబడి ఉంటారు. వారు జ్ఞాన సంబంధ నయనార్ వైపు గుర్రుగా చూస్తారు.

జ్ఞాన సంబంధ నయనార్ యొక్క స్తుతుల వలన రాజుగారిలో చెలరేగిన ఉష్ణం తగిపోతుందేమోనన్న శంకతో పాషండులు రాజుగారితో.. రాజుగారి కుడి భాగంలో మంటలు తగ్గించడానికి మేము మా విధానాలను ఉపయోగిస్తాము. ఎడమ




మాకు సంబంధించిన గ్రంథములన్నీ ఇక్కడ సమీ పంలో గల నదిలోకి విసిరివేస్తాము. అ దేవిధంగా సనాతన ధర్మమునకు సంబంధించిన వేదములు, భక్తి తత్వరచనలు మా లాగే నదిలోకి విసిరివేయాలి. అప్పుడు ఎ వరివి ఎదురు ప్రవాహంలో కొట్టుకుని పోకుండా నిలుస్తాయో వారు, వారి గ్రంథాలు, వారు నమ్మిన దేవుళ్ళు సత్యమని ఒప్పుకుంటాం. లేనిపక్షంలో నయనార్ మా పక్షానికి రావాలి"అంటారు.

ఈ పరీక్షకు నయనార్ ఒప్పుకుంటాడు.

నది దగ్గరకు వెళ్ళి ముందుగా పాషండులు తమ యొక్క గ్రంథాలు, రచనలు మొదలగు వాటినన్నింటినీ నదిలోకి పారవేస్తారు. పిదప నయనార్ కూడా సనాతన ధర్మానికి సంబంధించిన గ్రంథాలన్నింటినీ నదిలోకి విసిరివేస్తాడు.

అందరూ చూస్తుండగానే పాషండులు వేసిన గ్రంథాలు ఎదురు ప్రవాహానికి నిలువలేక నదిలో కలిసిపోతాయి. నయనార్ వేసిన గ్రంథాలు మాత్రం ఎదురు ప్రవాహానికి నిలబడి.. ఒడ్డున నిలబడి యున్న నయనార్ కాళ్ళ దగ్గరకు వచ్చి పడతాయి.

ఆ సంఘటనను చూసి పాషండులు నివ్వెరపోయి తమ ఓటమిని అంగీకరిస్తారు. తదనంతరం మీనాక్షి ఆలయం తెరుస్తారు. నిత్యకైంకర్యాలు జరుగుతాయి.

జ్ఞాన సంబంధ నయనార్ దేశాటన ముగించి తన ఇంటికి చేరుకుంటాడు. నయనార్‌కి వివాహం నిశ్చయం చేస్తారు. మూడు రోజుల పాటు వివాహం జరుగుతుంది.

పెండ్లికి వచ్చిన వారినందరినీ శివాలయంలోనికి తీసుకుని వెళతాడు జ్ఞాన సంబంధ నయనార్.

శివాలయంలో ఈ విధంగా ప్రార్థన చేస్తాడు. "తండ్రీ శివా! నాకు జ్ఞానం అనుగ్రహించి నీ పాద సేవకుడ్ని చేసినందుకు కృతజ్ఞతలు. అంతేకాదు శివా! నా పెళ్ళికి వచ్చిన బంధువులందరికీ (నాతో సహా) ముక్తిని, మోక్షాన్ని అనుగ్రహించమని ప్రార్థన చేస్తాడు.

అతడి ప్రార్థనను మన్నించి అశరీరవాణిగా శివుడు మాట్లాడతాడిలా "నాయనార్! నీవు కోరినట్లే నీకే కాదు. నీ వివాహం చూడడానికి వచ్చి ఈ గుడిలో ప్రవేశించిన వారందరికీ ముక్తిని, మోక్షాన్ని అనుగ్రహిస్తున్నాను" అంటాడు.

అశరీరవాణిగా శివుడు పలికిన మాటలు విని అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యానికి లోనవుతారు. తదనంతర కాలంలో అందరూ ముక్తిని, మోక్షాన్ని పొందుతారు.

★★★

వైపు మంటలు తగ్గించే ప్రయత్నం చేయమని జ్ఞాన సంబంధ నయనార్‌కి సూచిస్తారు. అయితే ఎవరి చర్యల వలన ముందుగా రాజు గారి మంటలు తగ్గుతాయో వారు తప్పనిసరిగా తమ విధానాలు, క్రియలు, ప్రార్థనలు సరియైనవని ఒప్పుకోవాలి. పాషండులు తమ విధానాల వలన రాజుగారి మంటలు తగ్గుతాయని భావించి ఆ షరతును విధించారు.

అందుకు సరేనని ఒప్పుకుంటాడు జ్ఞానసంబంధ నయనార్.

రాజుగారి యొక్క శరీరం ఎడమ భాగమంతా విభూధి వ్రాసి శివుడ్ని ప్రార్థిస్తాడు. కుడి భాగంలో మంటలు పోవాలని పాషండులు నెమలి విసన కర్రలతో విసురుతూ వారికి వచ్చిన క్రియలను, విధానాలను అమలు చేస్తారు.

అయితే పాషండులు చేసిన పనుల వలన రాజుగారి మంటలు తగ్గలేదు. జ్ఞాన సంబంధ నయనార్ వ్రాసిన విభూది, చేసిన ప్రార్థన వలన ఎడమవైపు రాజుగారి శరీర ఉష్ణోగ్రత, మంటలు తగ్గాయి.

అది చూసి పెదవి విరిచి పాషండులు చెప్పిన మాటలను రాజుగారు వినకుండా నయనార్ చేత కుడివైపు భాగమంతా విభూది వ్రాయించుకుని శివుడ్ని ప్రార్థన చేయమని కోరి తన శరీర ఉష్ణోగ్రతలను తగ్గించుకున్నాడు.

అప్పుడు రాజుగారికి శివబోధ చేస్తున్న నయనార్‌పై గురి ఏర్పడడమే కాదు.. భక్తిభావం కూడా కలిగింది.

రాజుగారు నాస్తిక త్వం నుండి అస్తికత్వం వైపు మరలిపోతున్నారని గ్రహించిన పాషండులు రాజుగారితో "రాజా! నయనార్ చేసిన ఇంద్ర జాలం వల్ల మీ మంటలు తగ్గాయేమోగాని శివారాధన వలన గాదు. అయినా మేము సనాతన ధర్మాన్ని, భగవంతుడి ఆరాధనను, వేదములలో చెబుతున్న భగవత్తత్వాన్ని ఒప్పుకోవలెనంటే చివరగా నయనార్‌కి ఒక పరీక్ష పెట్టదలుచుకున్నాము. అదేమిటంటే..

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## నృగ మహారాజు

సూత మహర్షి వేదికను సమీపించగానే మునులందరూ లేచి నమస్కరించి ఆసీనులైనారు. విఘ్నేశ్వర స్తుతి చేసి ఆనాటి ఉపాఖ్యానం చెప్పటం ప్రారంభించాడు సూతుడు. ఒక్కసారి శ్రోతలందిరి వైపు సాలోచనగా చూశాడు. అందరూ శ్రద్ధాళువులుగా ఉన్నట్లు గమనించాడు.

మునులారా! ఈరోజు పుణ్యానికి పోయి, పాపానికి తల ఒగ్గిన ఒక మహారాజు చరిత్ర చెబుతాను. వినండి. ఆ మహారాజు పేరు నృగుడు. గోదానం చేస్తే – ఆ దానం పరమ పుణ్యప్రదమని, స్వర్గలోకవాసం ప్రాప్తిస్తుందని, సకల సుఖసంతోషాలు లభిస్తాయని ఇంతకుముందే చెప్పాను. అయినప్పటికీ ఆ దానం సదుద్దేశంతో చేసినా, ఆ దాన క్రియలో ఏదైనా తప్పు జరిగితే తత్ఫలితం దాతకు సంక్రమించి అతనిని అధోగతి పాలు చేస్తుంది. అదే జరిగింది నృగమహారాజు విషయంలో. నృగ మహారాజు నిజానికి సత్పురుషుడు. ధర్మపరుడు, నీతిమంతుడు, దానశీలి, ప్రజారంజకుడు. ఆయన వేలాది ధేనువులను విద్వద్వరేణ్యులకు మణులతో సహ దానమిచ్చాడు. అతనికి లభించిన పుణ్యం అనంతం కాని, ఒకసారి ఏం జరిగిందంటే – ఒకసారి దానం చేసిన ఆవునే తెలియక మరొకరికి దానం చేశాడు ఆ మహారాజు. అది ఆ పుణ్యాత్ముడికి పాపంగా సంక్రమించింది. మహారాజు కాస్తా తొండగా మారిపోయి పైనుంచి క్రిందకు పడిపోయాడు. పడటం పడటం శ్రీకృష్ణుడు నివసించే ద్వారకా నగరంలోని ఒక నూతిలో పడ్డాడు. నూతిలో పడ్డ ఆ తొండ ఒక్కసారిగా కదలలేనంత పెద్ద శరీరాన్ని పొందింది. చుట్టుపక్కల ఉన్న ద్వారకావాసులు ఆ నూతిలో కదలక మెదలక పడి ఉన్న తొండను, దాని ఆకారాన్ని చూసి – ఇంత పెద్ద తొండ నీటిలో ఉంటే నీరంతా పాడైపోతుంది. తాగడానికి, వాడుకోవటానికి పనికిరాదు. అయినా ఇంత పెద్ద తొండను ఎప్పుడూ చూడలేదు అని ఆశ్చర్యపోతూ, దానిని ఎలాగయినా సరే బయటకు తీయాల్సిందేనని నిశ్చయించారు. వెంటనే పెద్ద తాడులు తెచ్చి తొండకు తగిలించారు. పదిమంది తాడులతో పదివైపుల నుంచి పైకి ఎంత బలంగా లాగినా, ఆ తొండ కించిత్తు కూడా



కదలలేదు. జరగలేదు. ఆ అద్భుతాన్ని చూసి, ఇక ఏమీ చేయలేక ప్రజలు తొండ ఏమిటి? కదలక పోవటమేమిటని అనుకొంటూ శ్రీకృష్ణుడికీ విషయం తెలియజేద్దామని ఆ పరమాత్ముడి వద్దకు వెళ్లారు. విషయమంతా విన్నవించారు. ప్రజల మాటల విన్న శ్రీకృష్ణుడు వెంటనే నూతి వద్దకు వచ్చాడు. నూతిలో కి తొంగి చూసి అంత పెద్ద తొండను క్షణంలో లాగి బయట పడేశాడు. ఆ తొండ కథ తెలిసి కూడా, శ్రీకృష్ణుడు ఏమీ ఎరుగనట్లు ''నీకింత పెద్ద రూపం ఎందుకు వచ్చింది? అసలు నీవెవరు? ఎందుకు నూతిలో పడ్డావు? నీ వివరాలన్నీ మావాళ్లకు స్పష్టంగా చెప్పు. వాళ్లంతా నీ ఆకారం చూసి చాలా ఆశ్చర్యపోతున్నారు! వాళ్ల అనుమానాలను తీర్చు'' అని చెప్పటంతో ఆ తొండ తన పూర్వ జన్మ స్మృతితో ''మహాత్మా! శ్రీకృష్ణ పరమాత్మా! నేను పూర్వజన్మలో నృగుడనే మహారాజును''అని తొండ మానవ భాషలో చెప్పగానే శ్రీకృష్ణుడు –

''నృగ మహారాజా! నీవు వేనకు వేల గోవులను వేదవిదులైన విప్రోత్తములకు దానమిచ్చావని విని ఉన్నాను. ఇంతటి చెడు జన్మ నీకెందుకు కలిగింది? నీ పుణ్యమంతా ఎటుపోయింది? మా ప్రజలకందరికీ అర్థమయ్యే విధంగా నీ వృత్తాంతం అంతా విశదంగా తెల్పు''అని అనగానే నృగుడు తనకీ దుర్దశ ఎందుకు వాటిల్లిందో వినయంగా చెప్పసాగాడు.

''మహానుభావా! శ్రీకృష్ణా! అసలేం జరిగిందంటే – ఒకసారి నేను విద్యాపారంగతుడైన ఒక బ్రాహ్మణోత్తముడికి ఒక మంచి గోవును దానమిచ్చాను. అతడా గోవును సంతోషంగా ఇంటికి తోలుకొనిపోయాడు. కొద్దిరోజులు జరిగాయి. ఒకనాడా గోవు మేత కొఱకు మా ఆవులతో కలిసి తిరిగింది. నిత్యకృత్యాలలో ఒక భాగంగా ఆనాడు నేను గోపాలురను, గోవులను నా చెంతకు పిలిపించాను. గోదానం చేయాలనే సంకల్పంతో ఆవులన్నిటినీ అర్హులైన వారందికీ దానం చేసేసాను. కాని, నా దురదృష్టమో, ఏమోగాని, అంతకు పూర్వమే దానమివ్వబడిన ఆ ఆవు వీటితో కలిసి ఉండటం చేత, ఆ విషయం తెలుసుకోక, దానిని కూడా మరొక విప్రునికి దానమిచ్చాను. విధి విధానం కాకపోతే, ధర్మాత్ముడనైన నేను ఒకసారి దానమిచ్చిన ఆవును మళ్లీ మరొకరికి దానమివ్వటమేమిటి? అజ్ఞానం నన్నావహించింది. ఆ సమయంలో ముందుగానే తెలుసుకొని ఎవరికీ దానమివ్వని గోవులను దానమివ్వటం చేయవలసిన ధర్మకార్యం గదా! అదిచేయక నేను దోషినయ్యాను. మొదటగా దానం గ్రహించిన ఆ భూసురుడు నా వద్దకు వచ్చి ''ఇది నా గోవు. నీవు నాకు దానమిచ్చావు గదా! మరి వేరొకడు దానిని ఎందుకు తీసుకుపోతున్నాడు? నాది నాకిస్తే నేను వెళ్లిపోతాను''అని చెప్పినప్పుడు గాని, నావల్ల జరిగిన అన్యాయం నాకు తెలిసి

రాలేదు. ఇం తలోకి రెండవవాడు వెనుకకు వచ్చి "ఇది రాజు గారు నాకిచ్చారు. నీదెట్లా అవుతుంది?"అని కలహానికి దిగాడు. కొంతసేపు ఇద్దరి మధ్య వాదోపవాదాలు కొనసాగాయి.

"నాకిచ్చిన దానిని నీవు మళ్లీ తీసుకొని ఇంకొకరికిస్తావా? ఇదెక్కడి ధర్మం రాజా?" అని మొదటి విప్రుడు ప్రశ్నించగా అతనిని శాంతపరచడానికి ప్రయత్నించాను.

**దానికి నేను జిత్తమునఁ దాపము నొందుచు మున్నుగొన్న య**
**మ్మానిత విప్రుడు వేఁడికాని మంచి గోవులు నీకు నూఱువే**
**యైనను నిచ్చెదన్ విడువవయ్య మహీసురవర్య! నెమ్మి న**
**ద్దేనువు నన్న నాస్యమున దీనత దోపఁగ నాతఁడిట్లనున్"**
**—ద్వి.ఆ.—426ప.—అను.ప.—మ.భా.**

"నావల్ల జరిగిన నేరానికి నేను మనసులో చాలా బాధపడ్డాను. దానికి ప్రత్యామ్నాయంగా మొదట విప్రుని దగ్గరకు పిలిచి 'విప్రోత్తమా! నేనొకమాట చెబుతాను. దయచేసి విను. తెలియక నా వల్ల తప్పు జరిగింది. ఆ గోవును వదిలిపెడితే నీకు లక్ష గోవుల నిస్తాను. నీతో వాదించిన విప్రుడు దానిని తీసుకుపోతాడు. దానివల్ల మీ కలహమూ తీరిపోతుంది. నా తప్పూ సైరింపబడుతుంది"అని చెప్పిన నా పలుకులకా విప్రుని ముఖమంతా బాధతో నిండిపోయింది. పరమదైన్యంతో అతడెంత చక్కటి సమాధానం ఇచ్చాడంటే — దానికి నేనే మారు పలకలేకపోయాను.

"రాజా! నాకు నీవిచ్చిన ఆవు మా అందరికీ చాలినన్ని పాలను ఇస్తుంది. అంతేకాదు. దానికి దాని దూడ మీద ఎంత ప్రేమ ఉందనుకొన్నావు? పసిపిల్లలంటే ఆ గోవుకెంతో ప్రీతి. నా కొడుకు సమయపాలన లేకుండా ఎప్పుడు ఏడ్చినా సరే — అప్పటికప్పుడు ఆ గోవు పాలిస్తుండేది. ఎప్పుడైనా, ఎక్కడైనా అటువంటి మంచి గోవు ఎవరికైనా దొరుకుతుందా? నా పుణ్యవశాత్తూ నీవు నాకా గోవునిచ్చావు. నీకు సదా కృతజ్ఞతలు. ఇంకొక మాట చెబుతాను విను. ఆ గోవు మహాలక్ష్మి లాగా నా ఇంట్లో మసలుతుంటే భక్తితో దానిని చూడగలను గాని, నీవు లక్ష కాదు, కోటి గోవులనిచ్చినా నేను తీసుకొంటానా? కోటి గోవులే కాదు ఇంకెన్ని ఆవులను ఎక్కువగా ఇచ్చినా ఆ గోవుతో అవన్నీ కలిసినా సమానం కావు రాజా! ఇన్ని మాటలెందుకు? నాకేమీ అక్కరలేదు"అంటూ కోపంతో విసవిసా వెళ్ళిపోయాడు. అతని మీద నాకు కోపం రాలేదు శ్రీకృష్ణా! నా దుస్థితికి నా మీద నాకే బాధ కలిగింది. పోనీ "రెండో విప్రుడైనా ఇదంతా చూస్తూ నా పట్ల దయామయుడు కాకపోతాడా?"అని ఆశ కలిగింది. ఆయనను నా వద్దకు పిలిచి — "బ్రాహ్మణోత్తమా! నీవైనా నా మాట వింటావనుకొంటున్నాను.

**కనకము ధేనువుల్ మణినికాయము లిచ్చెద, నేమియైనఁ ద**
**క్కును మదికిష్టమైనయది గోరుము గోవునుకంచుఁజేరి త**
**క్కిన ధరణీ సుపర్వునకు గీడ్పడి యెమ్మెయి వేఁడికొన్నఁనేఁ**
**గొన భవదీయ రాజ్యమును; గుత్సిత వృత్తికి నియ్యకొందునే!"**
**—429 ప. —ద్వి.ఆ.—అను.ప.—మ.భా.**

సువర్ణాన్ని, మణులను, గోవులను— నీకెంత కావాలంటే అంత, ఎన్నికావాలంటే అన్ని ఇస్తాను. అవే కాకుండా, ఇంకేది కావాలని నీవు కోరినా అది తప్పక ఇస్తాను. ఆ గోవును నేను మొదటగా ఇచ్చిన విప్రోత్తముడికి ఇచ్చివేయి"అని నేను ఎంత దీనంగా ప్రార్థించినా, ఆ రెండో విప్రుడు కూడా నా మాట వినలేదు, సరికదా నా రాజరికాన్ని కూడా సరకు చేయలేదు. పైగా నన్నే ఎదిరించి 'నీ రాజ్యం నాకెందుకు? నీవు మణి కనక వాహనాలు ఇచ్చినా నాకవసరం లేదు. నీలోని కుత్సిత బుద్ధి అర్థమైంది. నాకు దానమిచ్చిన గోవును తిరిగి ఇచ్చివేమయంటావా? నీ నీచత్వం బాగా తెలిసింది. నీవె ఎంతగా వేడుకొన్నా గోవును మాత్రం తిరిగి ఇవ్వటానికి నేనెంత మాత్రం అంగీకరించను"అని వెళ్లిపోయాడు. నేను నిర్వీర్యుడనైపోయాను. కొంతకాలం జరిగిపోయింది. నాకు అవసానకాలం ప్రాప్తించింది. యమధర్మరాజు సన్నిధికి వెళ్లాను. 'ఎంత పుణ్యాత్ముడైతే నృగమహారాజు యమధర్మరాజు సందర్శనాన్ని పొందగలుగుతాడ'ని ఆశ్చర్యపోయారు ద్వారకావాసులైన యాదవులందరూ.

'అది నిజమే కదా! మహాత్మా! అని వంత పాడాడు శౌనక మహర్షి.

'అవును నాయనా! నృగుడు మహాపుణ్యాత్ముడే. ఇంకో విషయం ఇక్కడ గమనించాల్సింది ఉంది. అది ఏమిటంటే— గోదాన మహిమ. గోవును దానమిచ్చేటప్పుడు గాని, ఇచ్చిన తరవాత గాని దాత ఏ దోషం చేయరాదు. తెలిసి చేసినా, తెలియక చేసినా దోషం దోషమే. సేవకుల వల్ల కలిగినా, మంత్రుల వల్ల కలిగినా, పౌరుల వల్ల కలిగినా, ఎవరి వల్ల కలిగినా, ఎవరు చేసినా, ఆ పాపం రాజుకే సంక్రమిస్తుందన్నది పరమనీతి. దానికి ఉదాహృతుడు నృగుడే. ఎంత ఘోర పాపం అనుభవించాడో విన్నారు గదా! గోవు అంత పవిత్రమైనది. అంత పూజనీయం. ఇంతకూ యముని వద్దకు వెళ్లిన నృగుడి గతి ఏమైందో వినండి' అని మళ్లీ చెప్పటం ప్రారంభించాడు సూతమహర్షి.

నన్ను చూసిన యముడు సంతోషాంతరంగంతో—

**"జనవర! పుణ్యకర్మము లసంఖ్యములీ వొనరించి తొక్క వి**
**ప్రునిధన మజ్ఞతం గొనుటఁబొందె సకల్బిషభావమల్ప మి**
**టొనరిన రెంటనయ్యెడు మహోన్నతి దుర్గతులందు మున్ను నీ**
**చనునెడ యెద్ది నావుడు న సౌఖ్యపుఁజోటని సమ్మతించితిన్'**
**—431ప.—ద్వి.ఆ.—అను.ప.—మ.భా.**

"మహారాజా! నీవు చేసిన అనేకానేక పుణ్యకార్యాల వల్ల నీకు

ఉన్నతమైన సద్గతి ప్రాప్తిస్తుంది. కాని అజ్ఞానంతో విప్రుడికిచ్చిన గోవును. నీదనుకొని మరొకరికి దానమివ్వటంతో నీకు పాపమంటుకొన్నది. దానివల్ల నీకు దుర్గతి కూడా కలుగుతుంది. ఈ రెండింటిలో దేనిని ముందుగా అనుభవించాలని అనుకొంటున్నావో చెబితే అది నీకు సంక్రమించేటట్లు చేస్తాను" అని నాకు అవకాశమిచ్చాడు ఆ సమవర్తి శ్రీకృష్ణా! అప్పుడు నేను సద్గతి దుర్గతులలో ముందుగా పాపానికి ప్రతి ఫలమైన దుర్గతి ఫలితాన్నే అనుభవిస్తానని చెప్పాను. అంతే – అప్పుడేమైందో తెలుసా– 'నేను పాప ఫలితాన్ని అనుభవిస్తానన్న ఆ క్షణంలోనే నేను తలక్రిందులుగా భూమి మీద పడిపోయాను. పాపినైన నేను క్రింద పడిపోతుండగా దయార్ద్రచిత్తుడైన యమధర్మరాజు నాకు చెప్పిన మాటలు స్పష్టంగా వినపడ్డాయి. మొదట ఆశ్చర్యపోయాను. తరవాత ఆనందపడ్డాను"అని ఆగాడు నృగుడు.

"యముడు ఏమని చెప్పాడని' శ్రీకృష్ణుడు అడగడంతో నృగుడు యముని పలుకులను వినిపించాడు.

**"వాసుదేవుఁడనేక సంవత్సరముల**
**కథప! నీ యున్న చోటికి నరుగుదెంచి**
**యుద్ధరించు నిన్నట నిత్య సిద్ధ సౌఖ్య**
**మైన లోకమునకుఁ జను దనఘ! నీవు"**

**–434ప. –ద్వి.ఆ. –అను. ప–మ.భా.**

"నృగ మహారాజా! నీవు పాపరహితుడవవుతావు. అనేక సంవత్సరాలు గడిచిన తరవాత శ్రీకృష్ణ పరమాత్ముడు నీవు ఉన్న చోటికి వస్తాడు. నిన్ను పైకి లాగి రక్షించటమే కాక దయతో నిన్ననుగ్రహిస్తాడు. నీకు శాశ్వత సుఖాలు లభించే లోక నివాసం ప్రాప్తిస్తుంది. నీకిక ఏ ఆపదా కలుగదు. నీవు చేసుకొన్న పుణ్యమే నీకు సురలోక వాసాన్ని కలుగజేస్తుంది"అన్న యముని పలుకులు వింటూ భూలోకంలో పడిపోయాను. అప్పటి నుంచీ ఈ తొండ రూపంలో చరిస్తూ, నేటికి ఈ బావిలోకి చేరాను. అదేమిటో, ఎందుకో తెలియదుగాని అంతకంతకు పెద్దదై బావి నిండా నిండిపోయింది. యమధర్మరాజు దయ వల్ల నాకు పూర్వజన్మ పరిజ్ఞానం సంపూర్ణంగా ఉంది. యముడి వరప్రభావం వల్ల పరమయోగీంద్రులకు మాత్రమే దర్శనమిచ్చే నీవు నాకు దర్శనమిచ్చి, నన్ను ఉద్ధరించి, నాకు పూర్వ రూపమిచ్చావు శ్రీకృష్ణా! దేవదేవా. నీ కృప అమృతమై నా మీద జాలువారటం వల్ల ధన్యాతిధన్యుడనైనాను. నాలో ఏర్పడిన దైన్యమంతా నిన్ను దర్శించిన క్షణంలోనే మటుమాయమైపోయింది"అని చెప్పి నృగుడు సాష్టాంగ ప్రణామం చేసి, శ్రీకృష్ణుని దయను పొందాడు.

**"అని సవినయ ప్రణామం**
**బున నారాధించి వృష్ణిపుంగవుఁ దగ వీ**
**డ్కొని యా నృగుడు విమానం**
**బున నుత్తమలోకమునకుఁబోయె నరేంద్రా!"**

**–437ప. –ద్వి.ఆ. –అను.ప. –మ.భా.**

నృగుడు శ్రీకృష్ణుని పూజించి, ఆ పరమాత్ముని వీడ్కొని, విమానారూఢుడై ఉత్తమలోకానికి వెళ్లి, అక్కడ శాశ్వత సుఖానందాలను పొందాడు"అని చెప్పి సూత మహర్షి శౌనకాదులవైపు ఆదరంగా చూశాడు.

శౌనకుడు వెంటనే లేచి "మహాత్మా! తెలిసి చేసినా, తెలియక చేసినా పాపకార్యం ఫలితాన్నివ్వక మానదన్న విషయం నృగమహరాజు చరిత్ర వల్ల స్పష్టంగా తెలిసింది. అందులోనూ, ముఖ్యంగా రాజైనవాడికి, పాలకుడు కావడంతో పాపఫలం అంటి తీరుతుంది"అని అనగానే మునులందరూ ఔనన్నట్లు తలలూపారు.

"అంతేకాదు. పాపపు పని ఎవరు చేసినా దాని ఫలితాన్ని అనుభవించి తీరవలసిందే. భగవంతుడి అనుగ్రహం కొరకు తపించి తీరవలసిందే!"అని చెప్పి సూత మహర్షి ఆశ్రమానికి వెళ్లడానికి లేవడంతో మునులందరూ లేచి ఆయనను గమించారు.

# గంగాదేవి

"శౌనకమునీ! మన వాళ్లందరూ వచ్చినట్లేనా? మొదలుపెడదామా?"అని సూత మహర్షి అడగగానే శౌనకుడు సర్వులూ వచ్చారు స్వామీ!" అని సమాధానం చెప్పి అందరితో పాటు తనూ సూతుడికి నమస్కరించాడు. "నాయనలారా! ఈరోజు గంగాదేవి గురించి చెబుతాను. ఆ దేవతా మూర్తికీ, మనకూ, అంటే మానవులకు ఉన్న అవినాభావ బంధాన్ని కూలంకషంగా చెబుతాను. "భూలోకంలో భాగీరథీ పేరుతో, స్వర్గలోకంలో మందాకినిగా, పాతాళ లోకంలో భోగవతిగా – త్రిలోక గామిని అయిన గంగామాతను సేవించినా, పూజించినా, ఆ పవిత్ర జలాలలో స్నానమాడినా, చివరకా పునీతమైన నీటిని స్పృశించినా కలిగే ఫలితం, దక్కే పుణ్యం అనంతం. ఎలాగంటారంటే – యజ్ఞం చేసినా, బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించినా, తపస్సానరించినా, త్యాగాన్ని విధిగా అవలంబించినా లభించే పుణ్యం గంగాజల స్పర్శతో సంక్రమించే అత్యధిక పుణ్యం ముందు దిగదుడుపనుకోండి. జలరూపాన్ని ధరించిన గంగామాత సరస్వతీ, లక్ష్మీ, పార్వతీ మూర్తులతో సరిసమానంగా అర్చించబడే దేవతా స్వరూపిణి. సకల జీవ పాప పరిహార కృపాపరాయణురాలు. అటువంటి త్రిలోక

పావని అయిన గంగాదేవి గురించి వర్ణించి చెప్పటానికి మాటలు చాలవను కో. అయినా నేను చేతనయిన మేరకు చెబుతాను. భక్తితో ఆకళింపు చేసుకోండి. ''గంగా మాతను తలిస్తేనే పుణ్యం. చెప్పండి మహాత్మా!'' అన్నారు మునులు.

**"మే నించు సోకిన గం**
**గానది తోయములు జనుల కల్మష కోటిం**
**బో నమిచి పురందర లో**
**కానందముఁ బొందఁజేయు నాగమవేదీ!"'**

**–103 ప. –ద్వి.ఆ. –అను.ప. –మ.భా.**

'మానవుల శరీరం ఏమాత్రం కొంచెం గంగాజలాలకు తాకినా, ఆ పవిత్ర దేవత ఆ నరుల సకల పాపాలను పోగొట్టి స్వర్గలోక సౌఖ్యాన్ని ప్రసాదిస్తుంది. పాపాలను పోగొట్టడం ఒక యెత్తు. అంతటితో ఊరుకోక తన చెంతకు వచ్చిన వారికి స్వర్గలోకానందాన్ని కూడా అందజేయుట మరొక యెత్తు.


అంతేకాదు. ఇంతకుపూర్వం ఎన్నెన్ని పాపాలు చేసినా, పూర్వజన్మలలో చేసిన పాపాలతో సహా గంగలో మునిగినంత మాత్రం చేతనే ఆ సమస్త పాపాలు పటాపంచలైపోతాయి. సూర్యుడు రాగానే చీకట్లన్నీ ఎలా మటుమాయమౌతాయో గంగోదకం తగలగానే పాపాలన్నీ కూడా అలాగే అంతరించిపోతాయి. మరో ముఖ్య విషయం. పాపాలు పోవటమే కాదు, ఆ నరుడు దైవత్వాన్ని పొంది మరణాన్ని జయిస్తాడు. గంగా జలంతో నరుడి ఎముక ఎన్ని సంవత్సరాలుంటుందో (అస్థి నిమజ్జనం చేయటం వల్ల) అన్ని వేల సంవత్సరాలు స్వర్గసౌఖ్యాలనుభవిస్తూ ఆ నరుడు అమరలోకంలోనే స్థిర నివాసిగా ఉంటాడు.

గంగానది లేని దేశంలో నివసించటం నిరర్థకమనుకో శౌనకా! యజ్ఞం చేస్తే సోమరసాన్ని పానం చేయలేకపోతే ఆ యజ్ఞం చేయటం వృథానే అవుతుంది. సోమంలేని యజ్ఞం, చంద్రుడి లేని రాత్రి, సూర్యుడు ప్రకాశించని ఆకాశము, స్వధర్మాన్ని పాటించని ఆశ్రమము (బ్రహ్మచర్యాశ్రమము, గృహస్థాశ్రమము, వానప్రస్థాశ్రమము, సన్యాసాశ్రమము – ఈ నాలిగింటిలో ఏదైనా సరే), పుష్పాలు లేని చెట్టు ఏవిధంగా కాంతి హీనంగా ఉంటాయో గంగానది కానరాని ప్రదేశం కూడా ఆ విధంగా అంద విహీనంగానే ఉంటుంది. నూర్ల కొలది వ్రతాలు చేసినా గంగా జల పానం వల్ల కలిగే పుణ్యం వంటి పుణ్యం లభించదు. కేవలం గంగలో మునిగినంత మాత్రం చేతనే సకల పాపాలు పోతాయంటే నమ్ము. నిప్పులో పడిన దూదిపింజల వలె సమస్త జీవరాశుల దుఃఖాలు గంగాస్నానం చేసినప్పుడే తొలగిపోతాయి. గంగకు మరే ఇతర దేవతా దుఃఖ నివారణకు సాటిరాదు. దేవతలకు అమృతము ఎటువంటిదో మానవులకు



గంగాజలం అటువంటిదన్నది ఋషి వాక్కు. మునులారా! మీకొక విషయం తెలుసా! శిరస్సుపైన గంగలోని ఇసుకనుగాని, నుదుటి మీద గంగానదిలోని మన్నుగాని రాసుకొంటే పాములు గరుత్మంతుని చూసీ చూడంగానే ఎలా పారిపోతాయో మానవుల పాపాలు కూడా అలాగే అతి త్వరితగతిని పారిపోతాయి. ఇంకో విషయం గంగానదిలో ఎగసి ఎగసి పడే అలల మీద తుంపర్లను మోసుకొచ్చే పిల్ల వాయువులు ఎవరి శరీరాన్ని తాకి ఆ తుంపర్లను వాడి పైన చిందింప చేస్తాయో, ఆ తుంపర్ల స్పర్శ వల్ల అతడి పాపాలన్నీ క్షణంలో ఎగిరిపోతాయి.

గంగాస్నానం చేయటం వల్ల ఆ నరుడి ఇటు వైపు ఏడు తరాల పితృదేవతలు, అటువైపు ఏడు తరాల పూర్వీకులు పుణ్యులౌతారు. గంగను కేవలం చూసినంత మాత్రాన మాటల వల్ల, మనసులోను, శరీరం నుంచి చేసిన సమస్త పాపాలు వైదొలగిపోతాయి. గంగా మతల్లి మహిమ గురించి విన్నా, పండగ చేసుకొన్నా, ఆ పవిత్ర జలాలను చూసినా, తాకినా పుట్టినింటి వైపు పితృదేవతలను, మెట్టినింటి వైపు పితృదేవతలను ఆ మాతృమూర్తి స్వర్గానికి పంపిస్తుందంటే, ఇక స్నానమే చేస్తే మరెంత గొప్ప సద్గతిని, సత్ఫలితాన్ని ప్రసాదిస్తుందో చెప్పటానికి మాటలు చాలవు. తలచినంత మాత్రం చాలు ఆమె వరం పొందటానికి.



"విను, గంగ గంగ యను కీ
ర్తనములతో నొండు నీటఁదగ మునిఁగిన య
జ్జనులు దురితములఁదొఱఁగుదు
రని యార్యులు సెప్ప విందు నంచిత చరితా!"

—112 ప. —ద్వి.అ—అను.ప.—మ.భా.

"గంగానదిలో కాకుండా వేరే యే యితర నదీజలాలలోగాని, తటాకాదులలో గాని 'గంగ, గంగ' అంటూ గంగా నామస్మరణ చేస్తూ, గంగను స్తుతిస్తూ, కీర్తిస్తూ స్నానం చేసినా, అటువంటి జనుల పాపాలన్నిటినీ గంగామాత పోగొడుతుందని—పూజ్యులు చెబుతూ ఉంటారు. ఆ తల్లి మహిమ అంతా ఇంతా కాదు. గంగ వద్దకు వెళ్ళడానికి శక్తి ఉండి కూడా వెళ్ళి చూడనివాడు, ఆ పవిత్ర జలాలలో మునగని వాడు పశువుతో సమానుడనుకో. అతడిని గుడ్డివాడనే అనుకోవాలి. త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడు మొదలైన సమస్త దేవతలు కోరే గంగాజల సాన్నిహిత్యాన్ని నరులు కోరవద్దా? ప్రాణం పోయేటప్పుడు ఏ నరుడు గంగను తలుస్తాడో, అతడికి మోక్షమే లభిస్తుంది. గంగను స్తోత్రం చేస్తే – రాజభయం, చోరభయం, పాపభయం, పిశాచ భయం మొదలైన సమస్త భయాలు వైదొలగిపోతాయి. గంగాదేవి స్వర్గలోకం నుంచి భూలోకానికి దిగి వస్తున్నప్పుడు – ఆమె మహత్తుకు తలయొంచి శివుడు ఆ పవిత్ర మూర్తిని తన తలపై ధరించాడంటే ఆమె ఘనత గురించి వేరే పొగడాలా?

ముల్లోకాలకు అందచందాలనిస్తూ, మూడింటా ఉజ్జ్వల కాంతితో ప్రవహిస్తూ, నిర్మలమైన మూర్తితో విరాజిల్లుతున్న గంగాదేవిని భజించేవాడు నిజంగా ధన్యుడు. త్రిలోక వాసులకు ఇంద్రుడెంత ఆరాధ్యుడో, గ్రహాలకు సూర్యుడెలా అధిపతో, నక్షత్రాలకు చంద్రుడు ఎలా వల్లభుడో, అదేవిధంగా మానవులకు గంగాదేవి అర్చనీయురాలు. కరుణామయి కావటం వల్లనే కపిలుడు (మహర్షి) శాపం వల్ల సగర రాజ పుత్రులు బూడిదపాలయినా, వారిని తన జల స్పర్శతో ఉద్ధరించి, స్వర్గలోకానికి పంపింది. భగీరథుడి అకుంఠిత తపస్సుకు మెచ్చి, భూలోకానికి వచ్చి, సగర పుత్రులతో పాటు భూలోక వాసులనందరినీ పుణ్యులను చేసిన జల రూపదేవత, సకల దేవతా ప్రీతిపాత్ర గంగాదేవి.

"విష్ణు పదము వలన, విధుని వలన, సూర్యు
వలన, మేరు రూప కలితుఁడైన
విష్ణు వలనఁ ద్రిపుర విజయి మౌళి వలన
నుండి హిమ నగమున నొలసె గంగ"


—118 ప.—ద్వి.ఆ.—ఆ.ను.ప.—మ.భా.

గంగా ప్రవాహ వైలక్షణ్యం అత్యద్భుతం. సృష్టికర్త, చతుర్ముఖుడు, వాక్పతి అయిన బ్రహ్మదేవుడే ఆమె రూపలావణ్యాన్ని, సుగుణ సంపదను వర్ణించలేడంటే మానవ మాత్రులకు సాధ్యమౌతుందా? ఆమె భూమికి దిగిన సొబగు, ఆగి ఆగి వచ్చిన పవిత్ర స్థలాలు, సంభాషించి వచ్చిన దేవతామూర్తులు— ప్రతిదీ వినసొంపే. మందాకినిగా ప్రసిద్ధి చెందిన ఆకాశగంగ ముందుగా చంద్రుని వద్దకు ప్రవహించి, తరవాత సూర్యుని చేరి, ఆ తరవాత మేరు పర్వత రూప సదృశుడైన విష్ణుమూర్తిని చేరుకొని, అటు పిమ్మట త్రిపురారి అయిన పరమ శివుడి శిరస్సుమీదకు, ఆ వెనుక హిమాలయ పర్వత శిఖరం మీదకు ఏతెంచి భూమిని పునీతం చేసిందంటే దానికంతటికీ భగీరథుని ఘోర తపస్సే కారణం. ఎవరు శరణు కోరినా వారిని సఫలీకృతుని చేయటమే ఆదిత్యవాహిని దయాగుణం.

గంగాదేవి దివ్యగుణాలు ఇన్నీ అని చెప్పటం అంటే అది అవివేకమనే చెప్పాలి. మేరు పర్వతంలోని రత్నాలు ఇన్నీ అని లెక్కపెట్టి చెప్పగలమా? సాగరంలోని నీటి బిందువులు ఇన్నీ అని లెక్కపెట్టి చెప్పగలమా? లేదే? అది అసంభవం. గంగామాత సుగుణాలు కూడా అంతే. స్వధర్మ నిరతుడై (తన ధర్మాన్ని తాను పాటిస్తూ) గంగాదేవిని అర్చించే మానవునికా జగన్మాత సకల సౌఖ్యాలూ ప్రసాదిస్తుంది. విష్ణు పాదోద్భవి, శంభు శిరోవాసిని అయిన గంగను దర్శించి, స్నానమాచరించి పునీతుడవు కావటానికే— ఆ తల్లి మహిమలన్నీ వర్ణించి చెప్పాను"అన్న భీష్ముని పలుకులను శిరసా వహించిన ధర్మరాజాది పాండవులు గంగాస్నానంతో పాపరహితులై పరమ పుణ్యులైనారు. గంగాదేవి చరిత్ర పాండవులకెంతగానో ఉపకరించటానికే భారతంలో ఉట్టంకించబడింది" అని అందరివైపు సాభిప్రాయంగా చూశాడు సూత మహర్షి. గంగాదేవినే తలపోస్తూ, సూత మహర్షి చెబుతున్న గంగా ప్రాభవాన్ని వీనులారా వింటూ తన్మయ స్థితిలో ఉన్న మునులందరూ ఒక్కసారిగా యథాస్థితిలోకి వచ్చి గురువుగారి వైపు సభక్తికంగా చూశారు. తమ ఆనందాన్ని కన్నులలోనే వ్యక్తం చేశారు. ఇన్ని మంచి విషయాలు చెప్పుకున్నాం. ఈరోజుకికచాలు, రేపు మళ్లీ మరొక మంచి ఉప కథను చెప్పుకుందాం సరేనా! అంటూ వేదిక దిగి ఆశ్రమం వైపు నడక సాగించాడు సూత మహర్షి. మునులందరూ ఆయన వెంట నడక సాగించారు.

**(సశేషం)**

# అమ్మకథలు




# వాగ్ బీజాక్షరం

–డి. శ్రీనివాస దీక్షితులు

సుసంపన్నమైన కోసల దేశంలో దేవదత్తుడు అనే బ్రాహ్మణుడు నివసిస్తున్నాడు. అతను వేదవేదాంగాలు చదువుకున్నాడు. కూటికీ గుడ్డకీ లోటులేదు. తాత ముత్తాతల నుంచి పారంపర్యంగా సంక్రమించిన సంపద ఉంది. అనుకూలవతి అయిన భార్య ఉంది. ధర్మ దృష్టి కూడా ఉంది.

అన్నీ ఉన్నా దేవదత్తునికి చాలాకాలం వరకూ సంతానము కలగలేదు. దేవదత్తుడు ఆయన భార్య రోహిణీ చాలా విచారించారు.

పుత్ర సంతానము లేకపోతే తమకి, చనిపోయిన తమ పూర్వీకులకి ఉత్తమగతులు లభించవని, వంశం అంతరిస్తుందని ఆ దంపతులు బాధపడ్డారు. కులగురువుల దగ్గరికి వెళ్ళి వాళ్ళను తరణోపాయం చెప్పమని అడిగారు.

వాళ్ళ సూచన ప్రకారం దేవదత్తుడు పుత్ర సంతానం కోసం పుత్ర కామేష్టి అనే యాగాన్ని చెయ్యాలని సంకల్పించాడు. వెంటనే యాగానికి ఘనంగా ఏర్పాట్లు చేశాడు దేవదత్తుడు.

తమసానది ఒడ్డున విశాలంగా యాగమండపాన్ని నిర్మించాడు ఆ బ్రాహ్మణుడు. ఆ మండపం మధ్యలో యజ్ఞ వేదికని నిర్మించాడు. వేద పండితుల్ని, యోగుల్ని ఆహ్వానించాడు.

పుత్రకామేష్టి ఆరంభమయింది.

సుహోత్రుడు బ్రహ్మగా, యాజ్ఞవల్క్యుడు అధ్వర్యుడుగా, బృహస్పతి హోతగా, పైలుడు ప్రస్తోతగా, గోభిలుడు ఉద్గాతగా నియమింపబడ్డారు. ఈ మహర్షుల పర్యవేక్షణలోనే యాగం జరుగుతోంది.

ఇతర మునులు యాగాన్ని చూడటానికి సదస్యులుగా వచ్చారు. ఈ మహాత్ముల్ని దేవదత్తుడే స్వయంగా ఆహ్వానించాడు.

వేద మంత్రాలతో యాగమండపము ప్రతిధ్వనిస్తోంది. యాగ కుండం నుండి వెలువడుతున్న పొగలు అక్కడంతా వ్యాపిస్తున్నాయి. ఆవు నేతి వాసనలు గుప్పుమంటున్నాయి.

యాగం సాగుతోంది.

ఉద్గాతగా నియమించబడిన గోభిల మహర్షి సప్తస్వరయుక్తంగా సామవేదాన్ని గానం చేశాడు.

ఊపిరి తీసుకోకుండా గానం చెయ్యాల్సిన చోట మాటి మాటికీ ఊపిరి తీసుకుంటూ గోభిలమహర్షి పొరబాటున సామ గానం చేశాడు. అందువల్ల స్వరం తప్పింది. ఆ విధంగా స్వర భంగం కావడం దోషం. యాగఫలం ఆశించిన రీతిలో లభించదు.

ఆ విషయాన్ని గ్రహించిన దేవదత్తుడు పట్టరాని కోపంతో మండిపడ్డాడు.

"గోభిల మహర్షీ నేను చేస్తున్న ఈ పవిత్ర యాగంలో నువ్విలా స్వరభంగం చేశావేంటి? ఇది నీకు తగునా? ముమ్మాటికీ నువ్వు మూర్ఖుడివి. పెద్ద తప్పు చేశావు?"అని నిందించాడు దేవదత్తుడు.

ఆ మాటలు అవమానంగా భావించాడు గోభిలుడు.

"దేవదత్తా! నువ్వు ఈ యాగానికి యాజమానివి అనే అహంకారంతో నన్ను నిందించావు. ఊపిరి తీసుకోవటంలోను విడిచిపెట్టటంలోనూ జరిగిన చిన్న పొరబాటుకి నన్ను మూర్ఖుడివి అని నిందించావు. కనుక నీకు మూర్ఖుడూ, సరిగా పదాల్ని ఉచ్చరించలేనివాడూ పుత్రుడిగా జన్మిస్తాడు"అని శపించాడు గోభిలుడు.

శాపాన్ని వినగానే దేవదత్తుని కోపమంతా కరిగిపోయింది. అహంకారమంతా అణగారిపోయింది.

''మహర్షీ! శాంతంగా ఉండాల్సిన నువ్వు నా మీద దారుణంగా శ పించావేంటి? సంతానం లేదని అమితంగా బాధపడుతున్న నన్ను మరింతగా బాధపెట్టావు. మూర్ఖుడయిన, స్పష్టంగా వేదమంత్రాల్ని ఉచ్చరించలేని పుత్రుడు ఎందుకూ కొరగాడు. శ్రాద్ధ కర్మల్లో భోక్తగా కూడా పనికిరాడు. లోకం అతనిని గౌరవించదు సరికదా దూషిస్తుంది. దైవకార్యాలు చెయ్యటానికి ఆ పుత్రుడు పనికిరాడు. అటువంటి పుత్రుడు ఉండటం కంటే అసలు పుత్రుడు లేకపోవడమే మేలు. ఈ విషయాన్ని శాస్త్రాలన్నీ చెప్పాయి. నీ శాపం మూలంగా పుత్ర కామేష్టి చేసినా నిష్ఫలం అయింది. మూర్ఖ పుత్రుడి కంటే మరణమే మేలు కదా! అందువల్ల దయతో నాకు శాపవిముక్తిని అనుగ్రహించు మహర్షీ!'' అని దీనంగా ప్రార్థించాడు దేవదత్తుడు.

గోభిల మహర్షి పాదాల్ని పట్టుకున్నాడు దేవదత్తుడు. వెంటనే గోభిలుని మనసులోని కోపమంతా పాలపొంగులాగా చల్లారిపోయింది. జాలి జాలువారింది.

''దేవదత్తా! నువ్వు చేసిన ఈ యాగం ఎన్నటికీ నిష్ఫలం కాదు. అయితే నా శాపం తిరుగులేనిది. అందువల్ల నీకు పుత్రుడు మూర్ఖుడుగా పుడతాడు. నువ్వు దైవానుగ్రహాన్ని సంపాదించు. నీకు తప్పకుండా మేలు కలుగుతుంది''అని శాప విముక్తిని అనుగ్రహించాడు గోభిలుడు.

దేవదత్తుడు ఎంతగానో సంతోషించాడు. తన శక్తికి తగ్గట్టుగా దానధర్మాలు చేశాడు. బ్రాహ్మణులకి తృప్తిగా దక్షిణలిచ్చాడు. పుత్ర కామేష్టి పూర్తయింది.

దేవదత్తుడు, రోహిణి దంపతులు మంచి సంతానాన్ని కోరుకుంటూ మహాదేవిని మనసారా ధ్యానిస్తూ కాలం గడుపుతున్నారు.

కొంతకాలం తర్వాత రోహిణి గర్భవతి అయింది. సుముహూర్తంలో ఒక పుత్రుణ్ణి ఆమె ప్రసవించింది. వేదమంత్రాలతో ఆ శిశువుకి సంస్కారాలు చేయించాడు దేవదత్తుడు. తర్వాత తన కుమారునికి ఉతథ్యుడు అని దేవదత్తుడు నామకరణం చేశాడు.

క్రమంగా ఉతథ్యునికి ఎనిమిదేళ్లు వచ్చాయి. కుమారునికి దేవదత్తుడు ఉపనయనం చేశాడు. వేదాలని చదువుకునేందుకు కుమారుణ్ణి గురుకులానికి పంపాడు దేవదత్తుడు. కానీ గురుకులంలో వేదమంత్రాల్ని స్పష్టంగా ఉచ్చరించలేకపోయాడు ఉతథ్యుడు.

గురుకులం నుంచి గురువులు ఇంటికి పంపారు ఆ ఉతథ్యుని. ఏళ్లు గడుస్తున్నా అతని ఉచ్చారణలో మార్పు రాలేదు. తండ్రి కూడా ప్రయత్నించాడు. కానీ ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు.

ఉతథ్యునికి పన్నెండేళ్ళు వచ్చాయి. అయినా అతనిలో మార్పు రాలేదు. సంధ్యావందనం మంత్రాల్ని కూడా సరిగా ఉచ్చరించ లేకపోవడంతో ఉతథ్యుడు పరమ మూర్ఖుడు అనే ప్రచారం లోకంలో బాగా వ్యాపించింది. ఇరుగు పొరుగువాళ్లు కూడా అతనిని వెక్కిరించసాగారు. బంధువులూ స్నేహితులు అందరూ ఉతథ్యుణ్ణి ఎగతాళి చేస్తున్నారు. నిందిస్తున్నారు.

అతని లేత మనసు బాగా గాయపడింది. వైరాగ్యంతో నిండిపోయింది. తల్లిదండ్రుల్ని విడిచిపెట్టి అతను అడవుల్లోకి వెళ్ళిపోయాడు. ఎక్కడెక్కడో అతను తిరిగాడు. చివరికి ఉతథ్యుడు గంగానదీ తీరానికి చేరుకున్నాడు. అక్కడ అతను ఒక చిన్న ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు. అక్కడే గంగలో స్నానం చేస్తూ సత్యాన్ని పలుకుతూ కందమూల ఫలాల్ని తింటూ జీవనం సాగిస్తున్నాడు ఉతథ్యుడు.

గంగాతీరంలోని జనమంతా ఉతథ్యుణ్ణి సత్యవ్రతుడు, సత్యతపుడు అని పిలుస్తున్నారు. ఉతథ్యుని దినచర్య ఇతర మునుల దినచర్యకి భిన్నంగా ఉంటుంది.

అతను జపం చెయ్యడు, ఏ దేవుణ్ణీ ధ్యానించడు. ఏ దేవతనీ ఆరాధించడు. యోగాభ్యాసం చెయ్యడు. అతనికి వేదమంత్రాలు రావు. ధర్మాలు అసలే తెలియవు. సంధ్యా వందనం కూడా చెయ్యడు.

ఉదయం నిద్ర లేవగానే అతను పళ్ళు తోముకుంటాడు. గంగలో మునుగుతాడు. మధ్యాహ్నం అడవిలోకి వెడతాడు. కంద మూలాలు పళ్లు తెచ్చుకుని తింటాడు. రుచీ పచీ తెలియదు.

సత్యవ్రతుడికి ఏ స్వార్థం లేదు. పరోపకారమూ తెలియదు. అలాగే మేలు చెయ్యడం కీడు చెయ్యటం కూడా అతనికి తెలియదు.

నిరంతరం అతని వేదన ఒక్కటే. ''అందరూ నన్ను మూర్ఖుడని ఎందుకు అంటున్నారు? నాకు మరణం ఎప్పుడొస్తుంది? నేనెందుకు పుట్టాను? ఎందుకు బతుకుతున్నాను? పూర్వజన్మలో చేసిన కర్మల ఫలాన్ని నేను అనుభవిస్తున్నానా? నాకు ఎన్ని కష్టాలు కలిగినా నేను అసత్యాన్ని పలకను. సత్యాన్నే చెబుతాను. అంతా కాలమహిమ. కాలాన్ని మించింది లేదు''అనుకున్నాడు సత్యవ్రతుడు.

అతని జీవితంలో పధ్నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకనాడు తన ఆశ్రమంలో పర్ణశాల ముందు దర్భాసనం మీద కూర్చుని దూరంగా ప్రవహిస్తున్న గంగని చూస్తున్నాడు సత్యవ్రతుడు.

అప్పుడే ఒక బోయవాడు గంగ గట్టు మీద జంతువుల్ని వేటాడుతూ బాణంతో అడవి పందిని కొట్టాడు. ఆ గాయంతో రక్తం కారుతుండగా ఆ పంది బిగ్గరగా అరుస్తూ సత్యవ్రతుని ఆశ్రమంలోకి వచ్చింది. అక్కడే ఒక దట్టమైన పొదలో దూరింది.

ఆ పందిని చూసి సత్యవ్రతుడు జాలిపడ్డాడు. మహాదేవి అతనిని కరుణించింది.

అతని నోటి నుండి అప్రయత్నంగా 'ఐ' అనే అక్షరం వెలువడింది. నిజానికి అది బిందువు (సున్నా) లేని వాగ్ బీజాక్షరం. సారస్వత బీజాక్షరం.

పందిని వెదుక్కుంటూ బోయవాడు సత్యవ్రతుని దగ్గరికి వచ్చాడు.

''అయ్యా! నువ్వు నిజమే చెబుతావని నాకు తెలుసు. అందుకే అడుగుతున్నాను. వేట నా కులవృత్తి. ఒక పందిని నా బాణంతో కొట్టాను. ఆ పంది ఇటుగా వచ్చిందా? ఈ రోజు మా కుటుంబానికి అదే ఆహారం'' అన్నాడు బోయవాడు.

ధర్మసంకటంలో పడ్డాడు సత్యవ్రతుడు.

బోయవాడితో తాను పందిని చూడలేదని చెబితే అది అసత్యం అవుతుంది. పందిని చూశానని చెబితే ఆ పందిని చంపి బోయవాడు తింటాడు. అయినా అది సత్యమే అవుతుంది. కానీ హింసతో కూడిన సత్యం సత్యమే కాదు. దయతో చెప్పిన అసత్యం కూడా సత్యమే అవుతుంది.

అమ్మ దయవల్ల శాస్త్రాలన్నీ సత్యవ్రతుడికి స్ఫురించాయి. బోయవాడికి సమాధానంగా సత్యవ్రతుని నోట నుంచి ఒక శ్లోకం వెలువడింది.

**యా పశ్యతి న సా బ్రూతే**
**యా బ్రూతే సా న పశ్యతి**
**అహో వ్యాధ! స్వ కార్యార్థిన్**
**కిం పృచ్ఛసి పునః పునః**

''ఓయీ బోయా! కన్ను చూస్తుంది కానీ చెప్పదు. నాలుక చెబుతుంది కానీ అది చూడదు. నేనేం చెయ్యను. మాటి మాటికీ నన్ను అడుగుతావేంటి? పోయి అడివిలో పందిని వెదుక్కో'' అన్నాడు సత్యవ్రతుడు.

నిరాశతో బోయవాడు ఇంటికి వెళ్ళిపోయాడు.

ఆనాటి నుంచి సత్యవ్రతుడు మహాకవిగా, మహా పండితుడిగా ప్రసిద్ధి కెక్కాడు. అదంతా మహాదేవి కరుణా కటాక్షంగానే అతను అనుకున్నాడు.

# తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి తేది 7–09–2023 గోకులాష్టమి రోజు 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగింది. తేది 6–09–2023 నాడు ఈ జపమును అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు సమర్పించి జపము వ్రాసిన వారి కోరికలు తీర్చుమని ప్రార్థించుచు పూజించుట జరిగింది. గోకులాష్టమి తేది 7–9–2023 గురువారం నాడు ఉదయం, ఎస్.వి. డెయిరీ ఫామ్లో ఉన్న శ్రీవేంకటేశ్వర మహామంత్ర స్తూపం వద్ద జపహోమాదులు నిర్వహించి జపము వ్రాసిన వారందరికీ స్వామివారి కృపాకటాక్షాలు లభించాలని ప్రార్థించాము. టి.టి.డి. చైర్మన్ శ్రీమాన్ భూమన కరుణాకరరెడ్డి మరియు ఇతర అధికారులు, భక్తులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. మరియు వచ్చే సంవత్సరము కొరకు 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ సంకల్పము కూడా చేయడం జరిగింది.

**శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం**
**– పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**







# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

**సేకరణ : కె.వి.రాఘవాచార్యులు**

**గత సంచిక తరువాయి**

### 273. నందగోప మనోహరాయ నమః

విష్ణువు కృష్ణునిగా జన్మించి పెంపుడు తండ్రియైన నందగోపుని మనస్సును ఆకట్టుకొన్నాడు. అష్ట వసువులలో ఒకడు ద్రోణుడు. అతని భార్య ధార. వీరు తప్పు చేయగా బ్రహ్మ మీరు దేవతలు కాకుండా పశుల కాపరులుగా జన్మించండని శపించాడు. ఆ కారణంగా ద్రోణుడు నంద గోపుడుగా ధార యశోదగా జన్మించారు. నంద యశోదులు శ్రీకృష్ణుని పెంచి పెద్ద జేసి శాప విముక్తులై వసువులుగా దేవలోకము చేరినారు.

గోవులకు అధిపతి, రక్షకుడు అయిన నందునిచే పెంచబడిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి అయిన వేంకటేశునకు నమస్కారము.

### 274. చతుర్భుజాయ నమః

**చత్వారః భుజాః యస్య సః చతుర్భుజః**

నాలుగు భుజములు గలవాడు. ఇది నారాయణునకు అసాధారణమైన నామధేయము. మహా విష్ణువు యొక్క మరొక పేరు నారాయణుడు.

**తమద్భుతం బాలకమంబుజేక్షణం। చతుర్భుజం శంఖగదాద్యాయుధమ్॥**

అని కృష్ణుని భాగవతం వర్ణించింది. విష్ణువు నార యందు (జలములందు) శయనించుటచే నారాయణుడనబడినాడు. నార – అయన – నారాయణ.

**శ్లో॥ ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూననః**
**యదస్యాయమనం పూర్వం తేన నారాయణః స్మృతః ॥**

అను మనుస్మృతిలోని శ్లోకమును ఉదాహరించి విద్యారణ్యులు నారాయణ శబ్దమునకు జనశాయి అని అర్థం చెప్పినారు.

చతుర్భుజః అను నామము విష్ణు సహస్ర నామములలో 142 సంఖ్యతో వుంది.

చతుర్భుజుడు భగవంతుని పరవాసుదేవ రూపము అని విష్ణు పురాణము తెలిపింది. చతుర్భుజుని పై చేతులలో శంఖ చక్రములు, క్రింది రెండు చేతులలో గదా, పద్మములు ఉండును. చతుర్విధ పురుషార్థములను భక్తులకు ప్రసాదించుటకు నాలుగు చేతులు గలవాడు వేంకటేశ్వరుడు. చతుర్భుజుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 275. కోమలాంగాయ నమః


చక్కదనము, మృదువు గల్గిన అవయవములు గలవాడు కృష్ణుడు. కోమలాంగుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 276. గదావతే నమః

బుద్ధి తత్త్వమే గదయని శంకరభాష్యము. గద ఆయుధముగా గలవాడు – (కృష్ణుడు). విష్ణువు యొక్క తేజస్సును విరజిమ్ము గదాయుధమునకు కౌమోదకి అని పేరు. విష్ణువు యొక్క పంచాయుధములలో గద ఒకటి. ఓజస్సు, సహస్సు అను బలముతో కూడిన ముఖ్య తత్త్వం గద. విశ్వధారణ చేయగల బలమే ఓజస్సు. దానిని ధరించడమే సహస్సు. విష్ణు సహస్ర నామములోల గదాధరః (997) అను నామము గలదు.



**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

గదాధరుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 277. నీల కుంతలాయ నమః

నల్లని కురులు గలవాడు కృష్ణుడు. నీల కుంతలుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 278. పూతనా ప్రాణ సంహర్త్రే నమః

పూతన అను రాక్షసి ప్రాణములను హరించిన వాడు కృష్ణుడు. కృష్ణుడు బిడ్డగా వున్నప్పుడు పూతన స్త్రీరూపమున వ్రేపల్లెకు వెళ్ళి చను మొనల యందు విషము వుంచుకొని బాలింతగా కృష్ణునికి పాలిచ్చు విధమున అనునయించి కృష్ణుని చంపుటకు ప్రయత్నించింది. కృష్ణుడు పాలు త్రాగుటతో పాటు పూతన ప్రాణములు కూడ పీల్చి చంపినాడు. అంత పూతన రాక్షసిగా చనిపోయింది. పూతన కైతు అను రాక్షసి కుమార్తె. ఈమె కంసుని భార్యకు సేవిక. పూతన పూర్వ జన్మలో మహాబలి (ప్రహ్లాదుని మనుమడు) కుమార్తె రత్నమాల. విష్ణుదేవుడు వామనునిగా అవతరించి బలి యాగము వద్దకు వెళ్ళినపుడు, బలి చేత భూదానము పొందు సమయమున రత్నమాల వామనుని చూచి ముగ్ధురాలై ఇతనికి పాలిచ్చి పెంచు తల్లిగా వుంటే బాగుండునని, ఇతడు నా బిడ్డగా జన్మించకూడదా అని తలంచింది. విష్ణువు రత్నమాల ఆలోచనను గ్రహించి కృష్ణుడిగా జన్మించినపుడు ఆమె పాలు త్రాగి ఆమె కోరికను తీర్చినాడు. పూతన ప్రాణములు తీసిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 279. తృణావర్త వినాశనాయ నమః

తృణావర్తుడను రాక్షసుని సంహరించినవాడు కృష్ణుడు.

తృణావర్తుడు తారకాసురుని కుమారుడు. ఇతడు కంసుని సేవిస్తూ వుండేవాడు. కంసుని ఆజ్ఞ చే తృణావర్తుడు కృష్ణుని చంపడానికి వ్రేపల్లెకు సుడిగాలి రూపమున వెళ్ళినాడు. అప్పుడు యశోద కృష్ణునికి పాలు ఇస్తున్నది. బాలుడు బరువు ఎక్కుతున్నాడు. ఆమె మొయ్య లేక కృష్ణుని చాపపై పరుండ బెట్టి ముఖం చేతులు శుభ్రం చేసుకోడానికి లోపలికి వెళ్ళింది. అప్పుడు సుడిగాలి రూపమున వున్న తృణావర్తుడు కృష్ణుని ఎత్తుకొని ఆకాశమునకు ఎగిరినాడు. కృష్ణుడు తృణావర్తుని కంఠమును, హృదయాన్ని గట్టిగా పట్టుకున్నాడు. ఆ బాలుడు మరింత బరువవుతుంటే కృష్ణుని వదలి పోదామనుకున్నా వదలి వెళ్ళలేక ఊపిరాడక మరణించి, నిజరూపముతో నేలపై పడినాడు. వీనికి చక్ర సమీర దైత్యుడని మరో పేరు గలదు.

తృణావర్తుడను రాక్షసుని చంపిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 280. గర్గారోపిత నామాంకాయ నమః

యదుకులమునకు గురువైన గర్గాచార్యులచే నామకరణం చేయబడినవాడు కృష్ణుడు.

యదుకుల పురోహితుడైన గర్గుడు వసుదేవుని పంపున వ్రేపల్లెలో నందుని యింట నున్న బలరామ కృష్ణులకు నామకరణాది సంస్కారములను చేసినాడు.

గర్గుడు విష్ణుదేవుని అంశతో భరద్వాజుని వంశములో జన్మించాడు. ఇతడు ఖగోళ శాస్త్రంలో ప్రజ్ఞావంతుడు. పృథుని రాజ్యంలో గర్గుడు ప్రధాన ఖగోళ శాస్త్రవేత్త. సరస్వతీ నదీ తీరంలో గర్గస్రోత అనే ప్రదేశం వుంది. గ్రహాల కదలికను గూర్చి నక్షత్రముల గమనం గురించి విస్తృతంగా వివరించినాడు గర్గుడు.

గర్గాచార్యులచే నామకరణాది సంస్కారములను పొందిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. పృథువు ధ్రువుని వంశములో జన్మించిన గొప్ప చక్రవర్తి, ధర్మ పరిపాలకుడు. ఇతని పేరుతోనే భూమికి పృథివి అనే పేరు కలిగింది.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

విన్నాడు రాక్షసుడు. ఎగాదిగా చూశాడు. చేతుల్లో విల్లంబులు, కత్తులు. ఎగుభుజాల వాళ్లు. 'ఎవరు మీరు? ఎందుకు వచ్చారు? నాకు ఆహారంగా వున్నారు. మీ బలం పనికిరాదు. మీ ఆయుధాలు ఏమీ చేయలేవు. బతకలేరు మీరు' అన్నాడు.

''కష్టాల మీద కష్టాలు. ఒకదాని తర్వాత మరొకటి. మన పరాక్రమం పనికిరాదు. కాలం బలవత్తరం. దానికి వశులమైనాం. అయినా దిగులుపడకు. ధైర్యంగా వుండు'' అవి రాముని మాటలు.

విన్నాడు సౌమిత్రి. ''వీడికి తలలేదు. కాళ్లు లేవు. మొండం ఉంది. వీడి బలం చేతుల్లో ఉంది. ఈ చేతులు నరికేద్దాం'' అది లక్ష్మణుని సూచన.

విన్నాడు కబంధుడు. ఉగ్రుడైనాడు. ఇద్దరిని కడుపులోకి వేసుకోవాలనుకున్నాడు. నోరు తెరిచాడు. చేతులు పైకెత్తాడు. అన్నదమ్ములు చూశారు. అదే అదను అనుకున్నారు. కత్తులు దూశారు. కుడిభజం నరికాడు రాముడు. ఎడమ భుజం నరికాడు లక్ష్మణుడు.

రెండు బాహులు తెగిపడ్డాయి. గర్జించాడు కబంధుడు. ఆ శబ్దానికి భూమ్యాకాశాలు ప్రతిధ్వనించాయి. రక్తం ధారలై పారింది. నేలకొరిగాడు కబంధుడు. వాడి దర్పం అణిగింది. ''మీరెవరు?'' మళ్లీ అడిగాడు.

''ఇతడు రాముడు. నేనతని తమ్ముణ్ణి. లక్ష్మణుణ్ణి. ఇక్ష్వాకు వంశస్థులం. మా అన్న భార్య సీత. ఆమెను ఒక రాక్షసుడు అపహరించాడు. ఆమె అన్వేషణలో ఉన్నాం. ఇక్కడికి వచ్చాం. నీవు ఎవరు? ఈ వికృత రూపమేమిటి?''

విన్నాడు వాడు. అంతే కబంధుని పూర్వ స్మృతి వచ్చింది. ''పురుషోత్తములారా! మీకు స్వాగతం. మీ దర్శనం కల్గింది. అది నా భాగ్యం. నా అదృష్టం. నా బాహులు ఖండించారు. ఉపకారం చేశారు''తన చరిత్ర చెప్పడం మొదలు పెట్టాడు. ''నేను దనుపు పుత్రుణ్ణి. దానవుణ్ణి. కామరూపుణ్ణి. మహా బలవంతుణ్ణి. అమిత పరాక్రమవంతుణ్ణి. లోక భీకరాకారం ధరించేవాణ్ణి. తపస్సంపన్నుల్ని భయపెట్టేవాణ్ణి. ఒకరోజు ఒక మహర్షిని చూశాను. పేరు స్థూలశిరుడు. కందమూలాల కోసం వెదుకుతున్నాడు. ఆ తపస్విని భయపెట్టాను. కోపించాడాయన. ''పరమ అసహ్యమైన రూపం వస్తుంది నీకు. లోకం భయపడుతుంది పో'' అని శపించాడు. ''నా అపరాధం మన్నించు. శాప విమోచనం తెల్పు''– ప్రార్థించాను. నీవు

ఉండే చోటుకి రాముడు వస్తాడు. నీ చేతులు ఖండిస్తాడు. శాపం పోతుంది ''— అన్నాడు మహర్షి.

తర్వాత నేను తపస్సు చేశాను. అది మహోగ్రమైంది. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు. నాకు దీర్ఘాయువు అనుగ్రహించాడు. దానితో గర్వాంధుణ్ణి అయ్యాను. ఏకంగా దేవేంద్రుణ్ణి ఎదుర్కొన్నాను. వజ్రాయుధం ప్రయోగించాడు. నా తల, తొడలు, కాళ్లు ఈ దేహంలోకి పోయాయి. బ్రహ్మ వరం ఉంది. నన్ను చంపలేదు. అప్పుడు నేను అన్నాను ఇంద్రునితో— తిరగడానికి కాళ్లు లేవు, తినడానికి నోరు లేదు, నేనెలా బతకాలని అడిగాను. చేతులున్నాయి కదా! ఒక యోజన పర్యంతం సాగుతాయి. జంతువుల్ని పట్టు, తిను, బతుకు. ఒకరోజు రాముడు వస్తాడు నీ చేతులు నరికేస్తాడు. నీకు నిజరూపం వస్తుందని అనుగ్రహించాడు ఇంద్రుడు.

'రామా! ఈ కబంధ రూపం చూడు. ఇంద్రుడు ఇచ్చాడు. ఈ అడవిలో పడి వున్నాను. ఇది తినొచ్చు, ఇది తినకూడదు అనే భేదం లేదు. చేతికి దొరికింది దొరికినట్లే తినేవాణ్ణి. మహర్షి వల్ల, ఇంద్రుని వల్ల వచ్చిన శాపం ఈరోజు పోతోంది. రామా! ఇంత కాలానికి వచ్చావు. నా చేతులు విరగ్గొట్టావు. ఇక నన్ను దహించు. నీకు శుభం కల్గుతుంది. దహన సంస్కారం చేసెయ్. నాకు తోచింది చెబుతాను. అది నీకు మేలు చేకూరుతుంది.''అన్నాడు. శాప విమోచనానికి త్వరపడుతున్నాడు.

విన్నాడు రాముడు. ''కబంధుడా! నీకు కావలసింది చేస్తాను. నాకు కావలసింది నీవు చెప్పాలి. నా భార్య సీత.



ఆమెను అపహరించాడు రాక్షసుడు. వాడి పేరు రావణుడు. ఎలా ఉంటాడో, ఎక్కడ ఉంటాడో తెలియదు. వాడి బలమెంతో తెలియదు. వాడి పరాక్రమం తెలియదు. నీకు తెలిసినంత చెప్పు''.

''రామ ప్రభూ! నాకిపుడు దివ్యజ్ఞానం లేదు. నన్ను కాల్చండి. నాకు నిజరూపం వస్తుంది. తెలిసింది చెబుతాను. సూర్యాస్తమయం లోపల నన్ను తగలబెట్టండి.''

## సుగ్రీవుని పేరు

రామలక్ష్మణులు అటు ఇటు చూశారు. కొండ దగ్గర పల్లపు ప్రాంతం కనపడింది. కబంధుణ్ణి అక్కడ గోతిలోకి తోసాడు. శరీరం చుట్టూ చితి పేర్చారు. నిప్పంటించాడు రాముడు. భగభగమని మంటలు ఎగిసాయి. రాక్షసుని కాయం తగలబడిపోతోంది. ఒక తేజో రూపం మంటల్లోంచి పైకి లేచింది. నిర్మల వస్త్రాలు, దివ్య మాలికలు, అనేక ఆభరణాలు, దివ్యాద్భుత రూపం ఆకాశంలోకి ఎగిరింది. అక్కడ విమానం ఉంది. హంసలతో తీర్చిదిద్దబడి ఉంది. తళతళలాడుతోంది. ధగధగలాడే దివ్యదేహుడు విమానం ఎక్కాడు. అంటున్నాడు —

''రామా! ఆప్తమిత్రుడా! నీకిపుడు దుర్దశ. కాలాన్ని ఎవరూ అతిక్రమించలేరు. ఒక వానరుడున్నాడు. పేరు సుగ్రీవుడు. ఋక్షరజుని క్షేత్ర పుత్రుడు. సూర్యాంశలో జన్మించాడు. వాడికి ఒక అన్న, పేరు వాలి. ఇంద్ర పుత్రుడు. వాలితో వైరం వచ్చింది సుగ్రీవునికి. అక్కడొక గుహ ఉంది. అది విశాలమైంది. దాని ద్వారం శిలలతో కప్పబడింది. అందుకే దానిని శిలాపిధానమంటారు. ఆ గుహలోకి పోవడం కష్టతరం. అందులో నివసిస్తున్నాడు సుగ్రీవుడు. అతనికి నలుగురు వానరులు సహచరులు. ఆయుధాల సాక్షిగా, అగ్ని సాక్షిగా అతనితో మైత్రి చేసుకో''.

''సుగ్రీవుడు వానరుడని చులకనగా చూడకు. అతడు వినయవంతుడు, వీర్యవంతుడు, సత్యసంధుడు, ధైర్యశాలి, మతిమంతుడు, దక్షుడు, కృతజ్ఞుడు, కామరూపి, సీతాన్వేషణలో సాయపడగలడు. ఈ భూమండలంలో అతడు చూడని ప్రదేశం లేదు. వానరులతో వెదుకుతాడు. సీతను తెస్తాడు. నీకు అప్పగిస్తాడు. ఆ పర్వత సమీపంలో మతంగాశ్రమం ఉంది. అక్కడి మహర్షులందరూ స్వర్గస్తులైనారు. వారికి పరిచర్యలు చేసింది ఒకతే. సన్యాసిని. పేరు శబరి. నీ దర్శనం కోసం నిరీక్షిస్తోంది. వెళ్లండి త్వరగా. ఇది దారి'' అని చెప్పాడు కబంధుడు. విమానం కదిలింది. తృటిలో స్వర్గం చేరింది.

అక్కడ జాతి జింకలున్నాయి. అవి మౌనంగా తిరుగుతూ ఉండేవి. అందుకే ఆ ప్రాంతానికి ఋష్యమూకమని పేరు వచ్చింది.



### శబరి

కబంధుడు చెప్పాడు దారి. రామలక్ష్మణులు నడుస్తున్నారు. ఏపుగా పెరిగిన పండ్ల చెట్లు, పూల చెట్లు రకరకాల చెట్లు. అదంతా పెద్ద వనం. మతంగ మహర్షి నిర్మించాడు. మతంగ వనం అని ప్రసిద్ధి. మతంగ పర్వతం ఎక్కారు అన్నదమ్ములు. ఆ రాత్రి అక్కడే విశ్రమించారు. తెల్లవారింది. లేచారు. నిత్యకృత్యాలు ముగించారు. కొండ దిగారు. పంపా సరస్సు చేరారు. దానికి పశ్చిమంగా నడిచారు. అక్కడే శబరి ఆశ్రమం చూసారు. చుట్టూ వృక్ష సంపద రమణీయంగా ఉంది.

శబరిని చూసారు రామలక్ష్మణులు. యోగ సిద్ధి పొందిన సన్యాసిని. సిద్ధుల చేత పూజింపబడిన సిద్ధాంగన. వృద్ధురాలు. దర్శించింది ఇద్దరిని. సాదరంగా ఆహ్వానించింది. అర్ఘ్యమిచ్చింది. పాద్యమిచ్చింది. యథావిధి అతిథి మర్యాదలు గావించింది. కృతాంజలి బద్ధయై నిలుచుంది.

అంటున్నాడు రాముడు ‘‘శ్రమణీ! నీ తపస్సుకి అరిషడ్వర్గాలు జయించావా? కామక్రోధాల్ని అరికట్టావా? ఆహార నియమాలకి భంగం లేదు కదా! గురు సేవ సఫలమైందా? మృదుభాషిణీ చెప్పవమ్మా?’’.

జవాబు ఇస్తోంది శబరి.

అద్యప్రాప్తా తపస్సిద్ధిః తవ దర్శనాన్మయా
అద్యమే సఫలం తప్తం గురువశ్చను పూజితా

‘‘రామా నీ దర్శన భాగ్యం కలిగింది. నా తపస్సు ఫలించింది. నా తపో జీవనం సఫలమైంది. నా గురు సేవలు సార్థకమైనాయి. నిన్ను పూజించే అదృష్టం లభించింది. నా జన్మ ధన్యమైంది. ఇక నాకు దివ్యధామం సంప్రాప్తం’’అవుతుంది.

‘మతంగ ముని శిష్యులుండేవారు. ఆ మహర్షులకి సేవలు చేశాను. ఆ మహాభాగులు ధర్మజ్ఞులు. దివ్యలోకాల్లోకి వెళ్లారు. వెళ్లే ముందు చెప్పారు. రాముడు చిత్రకూటంలో ఉన్నాడు. తమ్ముడు లక్ష్మణునితో వస్తాడు. రామలక్ష్మణుల్ని దర్శించు, సత్కరించు, ఆతిథ్యం ఇవ్వు. మేం ఉండే అక్షయ లోకాల్లోకి వస్తావు అన్నారు. రామా! ఆ రోజు నుంచి నీ కోసం నా నిరీక్షణ. వివిధ వన్య ఫలాలున్నాయి. అవి నీ కోసం. నా ఆతిథ్యం స్వీకరించాలి’.

విన్నాడు రాముడు. సంతోషించాడు. ‘‘శబరీ! నీ గురువుల మహిమ చెప్పాడు కబంధుడు. నీ గురించి చెప్పాడు. నీకు ఇష్టమైతే నీ గురువుల ప్రభావం వినాలని, చూడాలని ఉంది. నా వేడుక తీర్చు’’.

విన్నది శబరి. నడిచింది. అనుసరించారామెను అన్నదమ్ములు. ‘‘రామా! ఈ వనం చూడు. ఇది మతంగ వనం. మా గురువులు నిరంతర ధ్యాన నిరతులు. మంత్రవేత్తలు. నేను వారికి సేవలు చేసేదాన్ని. వాళ్లు యజ్ఞాలు ఆచరించేవారు. ఇదో యజ్ఞ వేదిక. ఇప్పటికీ దివ్యకాంతులీనుతున్నాయి. గంగాజలాన్ని ఆహ్వానించారు. వారి మంత్రశక్తికి ఆ గంగమ్మ దిగివచ్చింది.

అదే ఈ పంపా సరోవరం. ప్రతినిత్యం యోగశక్తితో వెళ్లేవారు. సప్త సముద్రాల్లో స్నానాలు చేసేవారు. తిరిగి వచ్చేవారు. వయోవృద్ధులైనారు. స్వయంగా అలా పోవడం కుదరలేదు. వాటినే చింతన చేశారు. వెంటనే సాగర జలాలు వచ్చేసాయి. అది వారి మనోబలం. అదే ఈ సప్తసాగర తీర్థం. ఇక్కడే స్నానాలు చేస్తారు. తడి బట్టలు ఆరవేస్తారు. ఇంకా ఆ వస్త్రాల తడి ఆరలేదు. అది వారి తపో ప్రభావం. వివిధ పుష్పాలతో పూజలు చేసారు. ఈ పూలు చూడు. ఇంకా వాడిపోలేదు. అది వారి తపోబలం''.

'రామా! అన్నీ చూశావు. చెప్పినవి విన్నావు. ఇక నాకు అనుమతి ఇవ్వు. ఈ తనువు త్యజిస్తాను. పరిచారికను. గురువుల సన్నిధానానికి పోతాను''.

అర్చితోహం త్వయా భక్త్యాగచ్ఛ కామం యథా సుఖం

''భక్తితో పూజించావు. సంతోషించాను. నీ ఇష్టానుసారం వెళ్లు. సుఖంగా పో'' — అది రాముని అనుమతి.

శబరి తల నెరిసింది. జడలు కట్టింది. నార చీరలు ధరించింది. జింక చర్మం చుట్టుకుంది. వృద్ధురాలు. యోగిని. యోగాగ్నిని పుట్టించింది. జీర్ణ శరీరాన్ని ఆహుతి చేసింది.

దివ్యాభరణాలతో దివ్యాంబరాలతో దివ్యమాల్యాలతో, దివ్యలేపనాలతో, అగ్ని తేజస్సుతో అత్యంత దర్శనీయమైన దివ్యరూపంతో మెరుపులా మెరుస్తోందామె. గురువులుండే పుణ్యలోకాలకి యోగశక్తితో పోయింది. తపశ్శక్తికి యోగ బలానికి ప్రకృతి తలవంచింది. పులకించిపోయింది.

శబరి దివ్యతేజోరూపం చూశారు రామలక్ష్మణులు. ఆశ్చర్యపోయారు. ''తమ్ముడా! పరమాత్మ తత్త్వవేత్తలు ఇక్కడి మహర్షులు. వారి శిష్యురాలు యోగిని శబరి. దర్శించే భాగ్యం కల్గింది మనకు. పరమాద్భుత విషయాలు తెల్సుకున్నాం''అన్నాడు రాముడు.

వన్య ఫలాలు తెచ్చింది శబరి. కొరికింది. రుచి చూసింది. బాగున్నవాటిని రామునికి ఇచ్చింది. భక్తపరవశుడైన రాముడు వాటిని తిన్నాడు. ఈ విషయం శ్రీరామాయణంలో లేదు. వాల్మీకి చెప్పనూలేదు. మతంగ మహర్షి మహాతపస్వి. ఆయన శిష్యులకు పరిచారిక శబరి. తపోనిధి. జ్ఞాని. యోగిని. రాముడు నరుడు కాదు. సాక్షాత్ నారాయణుడని గ్రహించిన సిద్ధురాలు. భగవంతునికి ఎంగిలి పండ్లు నివేదిస్తుందా? అది నీచమైన ఆతిథ్యం కాదా! భగవదపచారం కాదా! శబరి పండ్లు ఇచ్చినట్లు రాముడు తిన్నట్లు వాల్మీకి మహర్షి చెప్పలేదు.

విజ్ఞానే నిత్యం అబహిషల్పాతం — అది శబరిని ఉద్దేశించిన మాట. వాల్మీకి అన్నాడు. శబరుడు అంటే ఆకులు కట్టుకుని అడవిలో తిరిగేవాడని అర్థం. శబర జాతికి చెందిందామె. బోయకాంత అన్నారు పెద్దలు. జన్మ చేత కడజాతిలోనిది. బహిష్కృతురాలు. అస్పృశ్యురాలు. అయినా ఆత్మజ్ఞానంతో గురుశుశ్రూషతో అబహిష్కృత. వెలివేయబడలేదన్నాడు వాల్మీకి. గురుసేవా నిరతికి భగవత్ ఆరాధనకు ఆదర్శంగా నిలిచింది శబరి. రాముని కోసం 13 సంవత్సరాలు నిరీక్షించిన తాపసి. శరభంగుని నుంచి శబరి వరకు తపోధనులెందరో వున్నారు. వారి చరితలు చదవాలి. వారిని స్మరిస్తూ ఉండాలి. మనలోని పాపరాశి భస్మమైపోవాలి. అది వాల్మీకి మహర్షి ఉద్దేశం కావచ్చు.

తల్లి అవసాన సమయం. బదరీనాథ్ క్షేత్రంలో ఉన్నాడు శంకర భగవత్పాదులు. కాలడి గ్రామం చేరాడు. తల్లిని దర్శించాడు. ఆమె స్నానం చేయాలి అంది. ఒక క్షణం ధ్యానించాడు. పూర్ణానది ఇంటి ముంగిటకి వచ్చింది. అది ఆదిశంకరుల యోగశక్తి.

కర్నాటక రాష్ట్రంలో తొండమాన్ అనే గ్రామం ఉంది. అక్కడ లక్ష్మీ నరసింహస్వామి కోవెల ఉంది. ఆ స్వామిని ప్రహ్లాదుడు ప్రతిష్ఠించాడని చెబుతారు. అది అక్కడి స్థల పురాణం. భగవత్ రామానుజులు ఆ పుణ్యక్షేత్రానికి వెళ్లాడు. స్వామిని దర్శించాడు. అభిషేక తీర్థం లేదు. క్షణకాలం ధ్యానించాడు రామానుజులు. వెంటనే జలధార పుట్టింది. అది నేటికీ ఉంది. ఒక పెద్ద సరస్సులా ఉంది. అది యతిరాజుల యోగశక్తి.


చాతుర్మాస దీక్ష చేస్తున్నారు మునులు. అక్కడొక దాసీ పుత్రుడు వారికి శుశ్రూషణ చేశాడు. దీక్ష ముగిసింది. వెళ్లిపోతున్నారు. ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించారు వాడికి. ఓం నమో భగవతే వాసుదేవాయ స్మరించేవాడు. పాముకాటుకు వాడి తల్లి చనిపోయింది. బంధవిముక్తుడైనాడు. అడవి చేరాడు. మంత్ర జపం చేశాడు. భగవత్ సాక్షాత్కరమైంది. తర్వాతి కల్పంలో నారదుడైనాడు. శ్రీహరి కృపాకటాక్షం లభించింది. విష్ణు భక్తుల్లో అగ్రేసరుడైనాడు.

ఒకబోయవాడుదారిదోపిడీగాడు.పరమర్షులఅనుగ్రహంతో వాల్మీకి అయ్యాడు. శ్రీరామాయణం విరచించాడు. ఆదికవిగా ప్రసిద్ధిపొందాడు. ఒక గురువు ఒక ఆచార్యుని అనుగ్రహం పొందాలి. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలి. అందుకే శబరి పాత్ర సృష్టించాడు వాల్మీకి మహర్షి. మనమూ ఆ స్థాయికి చేరుకోవాలని మేల్కొల్పుతోంది శ్రీరామాయణం.

అంటున్నాడు రాముడు — ''అదో సప్త సాగర తీర్థం. మనం స్నానం చేద్దాం'' సరే అన్నాడు లక్ష్మణస్వామి. ఇద్దరూ స్నానాలు చేశారు. పితృ తర్పణాలు వదిలారు. అమంగళాలన్నీ తొలగిపోతాయి. అంతా మంచే జరుగుతుంది. అనుకున్నాడు రాముడు. ముందుకు నడిచారు అన్నదమ్ములు. పంపా సరోవరం దాటారు. సుగ్రీవుని కోసం వెదుక సాగారు.

**అరణ్యకాండ సమాప్తం.**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా।। విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## రెండవ అధ్యాయం – శ్వేతవరాహ వృత్తాంతం

### 1.శ్రీ వరాహావతారం:

దేవలుడు, దేవదర్శనుని "సింహాలు సంచరించే కొండ చరియల మధ్యలో ఉన్న స్వామి పుష్కరిణి తీరంలో శ్రీమహావిష్ణువు శ్వేత వరాహస్వామిగా ఎలా ఆవిర్భవించాడు?" అని అడుగగా దేవదర్శనుడు "ఓ విద్వాంసుడా! చరాచర జగత్తుకు గురువైన ఆ వరాహస్వామి యొక్క సుందర వృత్తాంతాన్ని వివరంగా తెలియజేస్తాను, శ్రద్ధగా విను" అంటూ ఇలా చెప్పనారంభించాడు–

పూర్వం ఒకానొకప్పుడు ధర్మం నశించగా దైత్యులు గర్వంతో యథేచ్ఛగా విహరిస్తూ ప్రమత్తులై ఒడలెరుగక, తమ నీడను సైతం నమ్మకుండా అనుమానిస్తూ పరస్పరం కలహించుకుంటూ మదోద్ధతులై అందరిని సంహరించటానికి ఉద్యుక్తులయ్యారు. అప్పుడు గౌతముడు మొదలగు మహర్షులు వారిని భూలోకంలో పుట్టమని శపించారు. వారంతా గొప్ప వంశాల్లో పుట్టి రాజుల ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నారు. పరమ దుర్మార్గులైన ఆ రాక్షసాధములు మహారాజుల వలె అవతరించి ముల్లోకాలకు తోకచుక్కల వలె రాత్రింబవళ్ళు ప్రజలను బాధిస్తున్నారు.

ఈ విధంగా దుర్భర బలగర్వితులైన ఆ రాజులు పెట్టే బాధలను తట్టుకోలేక భూదేవి పాతాళంలో మునిగిపోయింది. ఇలా భూదేవి పాతాళంలోకి వెళ్ళగా సకల లోక సంరక్షకుడు, సర్వసాక్షి, పరమ కరుణామూర్తి అయిన శ్రీమహావిష్ణువు ఆ పాతాళం నుండి భూమిని వెంటనే ఉద్ధరించుటకై పరమపురుషుడై మహా వరాహ రూపంలో ఆవిర్భవించాడు. ఆయన కిరీటంలోని రత్నాల కాంతిని చూసి సత్యలోక వాసులు ఆ కాలంలో ఉదయించిన సూర్యమండలంగా భావించారు. ఆయన పంచోపనిషత్ స్వరూపమైన శరీరాన్ని ధరించాడు.

### 2. మహావరాహ స్వరూపం:

శబ్ద గుణమైన ఆకాశం ఆయన శ్రోత్ర భాగంలో ఉన్నట్లు సిద్ధులు, ముక్తులు భావించారు. ఆయన కనులలో సమస్త తేజస్సులు నిండి వున్నాయి. ఆయన నాసాగ్రంలో వాయుమండలం నిండి ఉంది. మహా సముద్రాలు ఆయన పాదోదకమయ్యాయి. హిమవత్పర్వతము, మేరు పర్వతము మొదలగు కులపర్వతములు ఆయన కాలి డెక్కల క్రింద

ధూళికణా ల్లాగా ఉన్నాయి. ఒకదాని కంటె ఒకటి పదిరెట్లు అధికముగా ఉన్న ఆవరణలు కల లోకాలోక పర్వతం ఆయన దివ్య శరీరానికి ఎల్లగా ఉండినది. సంకల్పమాత్రం చేతనే అనేక రూపములను ధరించే ఆ వరాహస్వామి తన పాద రోమరంధ్రము నందున్న, శ్రీదేవికి సవతి అయిన, సర్వప్రాణులకు ఆధారమైన, తుంగముస్తలతో కూడిన బురదలో నిండిన భూదేవిని వెతకుతున్నాడు.

ఆ విధంగా భూదేవిని వెతకి కనిపెట్టి వణకుతున్న శరీరం కల, సిగ్గుతో చలిస్తున్న నేత్రాలు కల ఆమెను తన అంకము నందు కూర్చొన బెట్టుకొని పవిత్రురాలు, పరదేవత అయిన ఆ భూదేవిని చూచి అధోక్షజుడు, వైకుంఠవాసి, అఘటన ఘటనా సమర్థుడు అయిన వరాహస్వామి ఆమె కంఠమునాఘ్రాణించి ఆమెను ఆలింగనం చేసుకున్నాడు.

## 3. భూదేవి సర్వంసహ :

సత్యవ్రతుడైన ఆ వరాహస్వామి ఎంతో ప్రేమతో ఆమెను కొత్త పెళ్ళి కూతురువలె చూచి సంతోషించాడు. శరదృతువులో వికసించిన తామరపువ్వు వలె నూతన విలాసంతో, ప్రేమతో ఆమెను చూచి బాధారహితుడై మంచి రసవంతమైన అమృత వీచికల వలె పరిహాసంతో కూడిన పలుకులతో "ఓ భూదేవీ! నీకు శుభమగు గాక! ఓ మంగళ స్వరూపీ! నీకు మంగళమగుగాక! నీవు భయపడవద్దు. నీకు శుభం కలుగుతుంది. నిన్ను పూర్వం వలె స్వస్థానంలో ప్రతిష్ఠిస్తాను. నీవు అక్కడ ఉండి స్వస్థురాలవై సకల ప్రాణులకు ఆధారమై వారందరిని ఉద్ధరించు" అని ఆ పద్మలోచనుడైన వరాహస్వామి పలుకగా విని భూదేవి ప్రేమ సాగరంతో నిండిన, సిగ్గుచే చలించిన చూపులు కలదై క్రీగంటితో తన భర్త అయిన వరాహవదనుని చూచి ధర్మమును వినుటయందాసక్తి కలదై, పురుషోత్తముడు, పురాణ పురుషుడు అయిన ఆ వరాహస్వామితో ప్రేమతో నిండిన మధుర సమ్మిళితమైన, హృదయ పూర్వకమైన వాక్కుతో ఇలా అన్నది –

"ఓ దేవదేవా! దైత్యాంతకా! దయానిధీ! గరుడ వాహనా! రాక్షసులు, దైత్యులు వలన కలిగిన సహింపరాని భారం వలన నేను పాతాళంలో మునిగిపోయాను. సర్వ భారములను సహింపగల నన్ను నీవు రక్షించు. సకల ప్రాణులకు నీవే ఆధారం. నీవు అనంత శిరస్సులు కలవాడవు. అటువంటి నీకు నమస్కారము. అనంత విభూతులు కలవాడవు, సకల జీవులకు అవ్యాజ బాంధవుడవు అయిన నీకు మరల మరల నమస్కారము. ఈ విధంగా భయంతో శరీరమంతా గజగజ వణకుచు భూదేవి ప్రార్థించగా, జగద్రక్షణ దీక్షితుడైన వరాహస్వామి భూదేవితో 'దేవీ! నీవు చక్కగా అడిగావు. చెబుతున్నాను విను. నీకు సర్వాన్ని సహించునది అన్న పేరు సార్థకమైనది" అని చెప్పి ఆమెకు సర్వభారములను భరించగల ధర్మాన్ని బోధించాడు. భూదేవి ఈ విధంగా బోధింపబడినదై, నిర్మల మనస్సుకలదై తన భారాన్ని భరించి మహా పూజ్యురాలైంది.

## 4.పాతాళం నుండి శేషాద్రికి:

ఆ తరువాత దేవదేవుడైన వరాహస్వామి మహా తేజస్సుతో పాతాళలోకం నుండి బయలుదేరి ఈ భూలోకాన్ని చూడాలనే కుతూహలంతో శేషాచలంలోని స్వామిపుష్కరిణికి పశ్చిమ భాగంలో ఒక పుట్టలో ప్రవేశించాడు. అక్కడ నుండే ఆ శ్వేతవరాహస్వామి పాతాళ లోకానికి రాకపోకలు సాగిస్తున్నాడు. ఆయన నిత్యశూరులైన పరివారాలతోను, దివ్యగణములతోను, దివ్యభూషణాలు, దివ్యాంబరాలు, దివ్యాస్త్రాలతోను సేవించ బడుతూ అవ్యాజ కరుణామూర్తియై దివ్య శరీరాన్ని ధరించి విహరిస్తూ జ్ఞానానంద స్వరూపులైన దేవతలను సంతోషింపచేస్తూ ఉన్నాడు. సర్వజీవులకు అంతర్యామియైనవాడు, పవిత్రుడు, విచిత్ర లీలలు గల ఆ వరాహస్వామి తన పరిజనులనందరిని ఆనందింపచేస్తూ ఆ వేంకటాద్రిపై నివసిస్తున్నాడు.

## 5. కిరాతులైన కిన్నర దంపతులు:

ఇలా ఉండగా ఒకనాడు పరమ కోపిష్ఠియైన దుర్వాస మహర్షి తన ఆశ్రమంలో తపస్సు చేసుకుంటూ, ఉండగా కామ మోహితులైన కిన్నెర దంపతులు ఆశ్రమంలో లజ్జారహితులై క్రీడిస్తుండగా చూచి మీరిరువురు వేంకటాద్రిలో కిరాత దంపతులై పుట్టుదురు గాక! కందమూలాదులు భుజించుదురు గాక! అని శపించాడు. కిన్నర దంపతులు ఆ శాపాన్ని విని దుఃఖితులై పశ్చాత్తాపంతో శాపవిమోచనాన్ని కోరగా దుర్వాసుడు దయతో అక్కడ స్వామిపుష్కరిణి తీరంలో విహరించేటటువంటి శ్వేతవరాహస్వామి వలన మీకు శాపవిమోచనం కలుగుతుందని చెప్పాడు. అప్పుడా కిన్నర దంపతులు దైన్యంతో "అలాగే" నని చెప్పి వెంటనే వేంకటాచలంలో కిరాత దంపతులుగా పుట్టారు. వారు కందమూలాదులను, ఫలాలను భుజిస్తూ దుష్టమృగాలను శిక్షిస్తూ ఆ శేషాద్రిలో చాలాకాలం గడిపారు.

ఆ అడవిలో ఎలుగ్గొడ్లు, పెద్ద పులులు, శరభ మృగాలు, సింహాలు, ఏనుగులు, పాములు, నిండి ఉన్నాయి. దానిలో ప్రవేశించటానికే వీలుకాదు. అది దుర్గమమైనది. అది మహా భయంకరము, రోమ హర్షణాన్ని కలిగించే పుణ్యకాననం. ఆ అడవిలో పూదేనె తాగి మదించిన ఆ కిరాత దంపతులకు చాలా కాలానికి చిత్రాంగదుడనే కుమారుడు కలిగాడు. ఆ పుత్రుని చూచి ఆ కిరాత దంపతులు పరమానంద పరవశులై

స్తన్యపానాదులతోను, అడవిలోని పళ్ళు మొదలైన వాటితో అతన్ని పెంచారు. అతడు ఐదు సంవత్సరాల పిల్లవాడయ్యాడు.

ఆ పిల్లవానిని ఆ తల్లిదండ్రులు సింహపుగోళ్ళతోను, ముత్యాలతోను, రంగురంగుల నెమలి పింఛాలతోను, అలంకరించేవారు. అతనికి నారబట్టలు కట్టేవారు. మదపుటేనుగు గండస్థలాల నుండి కారే మదజలమును చందనంగా అలంకరించేవారు.

ఒకరోజు ఆ కిరాతుడు ఒక మఱ్ఱిచెట్టు తొఱ్ఱలో బంగారం వలె మెరుస్తున్న ప్రియంగుధాన్యపు (కొఱ్ఱలు) గింజలను చూచి తెచ్చి భార్యకిచ్చాడు. ఆమె వాటిని భూమిపై చల్లి సేద్యము చేయగా కొఱ్ఱధాన్యం పండింది. దాని చుట్టూ కంచెను వేసి సంరక్షించారు. దానికి ఎరువు వేస్తూ పెంచి ఆ పంట చేతి కొచ్చే సమయానికి ఆ పొలాన్ని సంరక్షించటానికి తన కుమారుణ్ణి పంపించారు. అతడు పొలానికి వెళ్ళి నిండుగా పండిన పొలాన్ని చూచి చాలా సంతోషించాడు.

## 6. శ్వేతవరాహ దర్శనం:

ఆ పండిన కొఱ్ఱ పంటను వడిశిలలతోను, కంచెలతోను కాపాడుచుండగా బోయవాడు చూచి ఆ చేను మధ్యలో మంచెను నిర్మించుకొని దానిని కాపాడుటకై రాత్రింబవళ్ళు అక్కడే ఉండి పంటకు కాపలా కాస్తున్నాడు. ఇలా ఉండగా ఒకనాడు శ్వేతవరాహరూపంలో ఉన్న భగవంతుడు ఆకలితో పుట్టలో నుండి బయటకు వచ్చి ఆ పొలంలో ప్రవేశించాడు. బోయవాడు ఆ శ్వేత వరాహాన్ని చూచి చాలా ఆశ్చర్యపోయాడు. వెంటనే ఆ విషయాన్ని ఆ మండలాధిపతి అయిన రాజునకు నివేదించుటకై రాజధానికి వెళ్ళి చక్రవర్తికి ఆ విషయాన్ని నివేదించాడు. ప్రజారక్షకుడైన చక్రవర్తి అది విని ఆ దివ్యమృగాన్ని చూడాలనే కుతూహలంతో వేటగాని వేషం ధరించి ఒంటరిగా బోయవానితో కూడా బయలుదేరాడు. వారిద్దరూ వేంకటాచలానికి వెళ్ళారు. స్వామి పుష్కరిణిలో స్నానం చేసి ప్రయాణ బడలికను తీర్చుకున్నాడు.

అసహాయశూరుడైన రాజు ఆ పుష్కరిణికి నమస్కరించి బోయవాడు చెప్పిన విచిత్రమైన శ్వేత వరాహ వృత్తాంతాన్ని గురించి మనస్సులో ఆలోచిస్తూ బోయవానితో పాటు ఆ కొఱ్ఱ చేను దగ్గరికి వెళ్ళి చూశాడు. అక్కడ నాలుగు స్తంభాలపై చతురస్రాకారంలో ఒక మంచె నిర్మించబడి ఉంది. దానిపైన లేత చిగుళ్ళు పరుచబడి ఉన్నాయి. వాటిపైన మెత్తటి చర్మం పరచబడి ఉంది. ఆ మంచ ఒక ఎత్తైన గుట్టపైన కట్టబడి ఉంది. రాజు శరచాపాలను ధరించి ఆ బోయవానితోపాటు ఆ మంచె నధిరోహించాడు. వారిద్దరూ ఆ రాత్రంతా మేల్కొనే ఉన్నారు.

ఆ విచిత్రమైన శ్వేతవరాహం ఒక పుట్టలో నుండి బయటకు వచ్చింది. చేను చుట్టూ కంచె ఉండుట వలన ఆ వరాహం తన వాడి కోరలతో ఆ కంచెను ఛేదించి చేనులోకి వచ్చింది. ఆ సుందరమైన వరాహాన్ని చూచి రాజు చాలా ఆశ్చర్యపడ్డాడు. వెంటనే మంచె దిగి ధనుస్సు ఎక్కుపెట్టాడు. ఆ చీకటిలో ఆకలితో పరుగులిడుతున్న ఆ శ్వేత వరాహం తన కోరల కాంతితో ఆ చీకటులను పోగొడుతోంది. ఆ వరాహం యొక్క దివ్యరూపాన్ని చూచి రాజు ఆశ్చర్యపడ్డాడు.

ఆయన బోయవానితో పాటు దాన్నెలాగైనా పట్టుకోవాలని ఆ వరాహాన్ని వెంబడించాడు. చేతిలో ధనస్సును ధరించి తన వెంట పరుగెత్తికొని వస్తున్న రాజును చూచి ఆ వరాహం ఒక్కక్షణంలో పుట్టలో దూరింది. పరాక్రమశాలి, ప్రాజ్ఞుడు అయిన ఆ రాజు తన మాట వ్యర్థమైందని తలచి ఆ వరాహాన్ని పట్టుకోవడానికి సాధ్యం కాలేదని బాధపడుతూ దానిని మరల చూడాలనే కోరికతో ఆ పుట్ట వద్దకు వచ్చి, ఎలాగైనా దాన్ని చూడాలని అక్కడే దర్భలు పరుచుకొని పడుకున్నాడు. కాని ఆయనకు ఆ వరాహం దర్శనమివ్వలేదు.

## 7. ఆవుపాలతో అభిషేకించు:

తెల్లవారిలేచి రాజు బాధపడుతూ ఏం చేయాలని ఆలోచిస్తూ స్వామి పుష్కరిణికి వెళ్ళి స్నానం చేసి మునివేషం ధరించి ఆ శ్వేతవరాహాన్నే ధ్యానిస్తూ ప్రాయోపవేశం చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు. అతడు శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వాలను సహించి తదేకనిష్ఠతో నిశ్చల మనస్కుడై తపస్సు చేస్తున్నాడు. ఆ బోయ దంపతులు ఆయనకు సపర్యలు చేస్తున్నారు. ఇంతలో అశరీరవాణి పవిత్రం, అమృతోపము అయిన వాక్కులతో "సదాచార సంపన్నుడవైన ఓ రాజా! నీవు ఆ శ్వేతవరాహాన్ని దర్శించ గోరినచో గర్వంతో చేసే వ్యర్థ ప్రయత్నాలను విరమించు. ఓ సువ్రతా! నీవు నేను చెప్పినట్లు చేయి. కపిల గోవులను దూడలతో సహా ఇక్కడకు తీసుకొని వచ్చి ఆ కపిల గోక్షీర ధారతో ఈ పుట్టపై అభిషేకించు. ఎడ తెగకుండా ఆ క్షీర ధారలతో వల్మీకంలోని శ్వేతవరాహ మూర్తిని అభిషేకించు. నీవు ఈ విధంగా చేస్తే ఆ వల్మీక వివరం నుండి వరాహ రూపుడైన భగవంతుడు బయటకు వచ్చి దర్శనమిస్తాడు" అని చెప్పి విరమించింది.

ఆ అశరీరవాణి పలుకులను విని రాజు ఆశ్చర్యపడ్డాడు. వెంటనే ఆ ప్రయత్నాన్ని ప్రారంభించాడు. అప్రాకృతమైన ఆ నారాయణగిరిలో లక్ష్మీనారాయణుడు నివసించియున్న స్థానానికి దక్షిణ దిక్కున రెండుయోజనాల దూరంలో సువర్ణముఖరీ తీరంలో గండశిలకు తూర్పున సర్వ సమృద్ధిగానున్న గ్రామం నుండి ఆ

అభిషేకానికి కావలసిన సకల సంభారాలను తెప్పించాడు. రాజు స్వస్థచిత్తుడై ఆ వల్మీకానికి, దానిలోని శ్వేతవరాహానికి అభిషేకం చేయాలనే సంకల్పంతో శుద్ధ వస్త్రాలను ధరించి నిర్మల మనస్సుతో అభిషేకానికి ఉపక్రమించాడు.

## 8. పుట్టలో వరాహస్వామి:

రాజు తన మంత్రులతోను, కుమారునితోను, బోయవానితోను కలసి శ్రద్ధతో ఏమరుపాటు లేకుండా అశరీరవాణి వాక్కును తలచుకుంటూ బంగారు బిందెలతో నిండిన కపిల గోక్షీరముతో ధారాపాతంగా ఆ పుట్ట ద్వారములో అభిషేకించుటకు ఆరంభించాడు. ఆ విధంగా అభిషేకం చేస్తుండగా ఆ పుట్ట ద్వారము నుండి వరాహదేవుడు ఆవిర్భవించాడు. ఆయన అనేక మణుల కాంతితో ప్రకాశిస్తున్నాడు.

ఆయన ముఖ భాగంలోని కోరలు చంద్రునివలె ప్రకాశిస్తున్నాయి. ఆయన లలాటంలో వెదురాకువలె ఊర్ధ్వపుండ్రం ప్రకాశిస్తున్నది. ఆయన కంఠం శంఖాకారంలో ఉన్నది. ఆయన భుజస్కంధాలు బలిష్ఠంగా ఉన్నాయి. పారిజాత వృక్ష శాఖల వలె ఆయన చతుర్భుజాలు శోభిస్తున్నాయి. ఆయన శంఖచక్రాలు ధరించాడు. ఎడమ తొడపై భూదేవి కూర్చుని ఉంది. ఆమె సిగ్గుతో తన శరీరాన్ని ఆచ్ఛాదించుకొని ఉంది. ఆమె నేత్రాలు చలిస్తున్నాయి. ఆమె మూర్తీభవించిన దయాస్వరూపం వలె ఉన్నది. ఆమె భగవంతునికి ఆనందాన్ని కలిగిస్తున్నది.

వరాహదేవుడు భూదేవిని తన తొడపై కూర్చోబెట్టుకొని, ఆమెను ఆలింగనం చేసుకొని, ఆమె ముఖకమలాన్నే ఆనందంతో చూస్తున్నాడు. ఆయన విశాల వక్షఃస్థలంలో శ్రీవత్సము, కౌస్తుభమణి విరాజిల్లుతున్నాయి. మెడలో యజ్ఞోపవీతాన్ని ధరించాడు. పైన ఉత్తరీయం వేసుకున్నాడు. మెడలో హారాలు వేసుకున్నాడు. భుజాలకు దండకడియాలు, చేతులకు మురుగులు, వేళ్ళకు వజ్రపుటుంగరాలు ధరించాడు. ఆయన వామపాదాన్ని పైకెత్తాడు. ఆ కాలి నూపురాలు హంసధ్వని చేస్తున్నాయి. ఆయన మెడలో నవరత్న హారాలు, ముత్యాలహారాలు వ్రేలాడుతున్నాయి. లెక్కింపలేనన్ని, వెలకట్టలేనన్ని, నూతనములైన, మనోహరములైన సువర్ణ ఆభరణాలు, చిత్ర విచిత్ర వర్ణాలు కల చీని చీనాంబరాలు ధరించాడు.

సుగంధం వెదజల్లుచున్న తెల్లని పూలమాలలు, అసంఖ్యాకమైన స్వర్ణాభరణాలు, మోకాళ్ళ వరకు ధరించాడు. అటువంటి దివ్య పురుషుడు శిరసు నుండి పిక్కల వరకు మాత్రమే దర్శనమిచ్చాడు. ఇంతలో ఆ క్షీరాభిషేకం ఆగిపోయింది. ఆ వరాహమూర్తి పిక్కల క్రింది భాగం కనబడలేదు. అప్పుడా రాజు ఆ మూర్తిని పూర్తిగా దర్శించాలనే కుతూహలంతో అనేక ప్రయత్నాలు చేశాడు. కాని ఫలించలేదు. అతనికి వేడి నిట్టూర్పులతో నాలుక, నోరు, పెదవులు ఎండిపోయినాయి. అభిమానధనుడైన ఆ రాజు విచారంతో బాధపడ్డాడు.

## 9. నా రూపాన్ని ప్రతిష్ఠించు:

అప్పుడు దుఃఖితుడైన ఆ రాజును చూచి పురాణ పురుషోత్తముడైన వరాహస్వామి కరుణతో ''రాజా! నీ వ్యర్థ ప్రయత్నాన్ని చాలించు. నేను ఇంతవఱకే నా స్వరూపాన్ని చూపించాను. క్రింది భాగంనీకు కనబడదు. శుద్ధ శిలతో ఈ నా రూపాన్ని ప్రతిష్ఠించి సమస్త భోగాలను అర్పించు. ఈ శిల ప్రాకృతమైనది కాదు. ఇది సాత్త్వికమైనది. వైఖానస మహర్షులతో నా విగ్రహాన్ని ఆరాధించు. ఆ పిమ్మట నన్ను పొందెదవు గాక! నీవు వెళ్ళి రాజ్యాన్ని చక్కగా పరిపాలించు'' అని రాజుకు ఉపదేశించి ఆ కిరాతవేషంలో ఉన్న కిన్నర దంపతులకు శాపాన్ని పోగొట్టి వైకుంఠానికి వెళ్ళాడు.

## 10. భూవరాహ స్వామి:

ఆ తరువాత రాజు సంతుష్టుడై విశ్వకర్మను పిలిపించాడు. ఆయన సంకల్పమాత్రం చేతనే చిన్న భూవరాహస్వామి విగ్రహాన్ని నిర్మించాడు. ఆ రాజర్షి ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, సాష్టాంగ దండ ప్రణామాలాచరించి, అంజలి ఘటించి, భగవంతుని ఆశ్చర్యకరమైన లీలలను తలచుకుంటూ, జితేంద్రియుడై, జితక్రోధుడై, నిస్సంగుడై, శత్రువులను జయించి, తన పట్టణానికి వెళ్ళాడు.

అప్పటి నుండి దేవదేవుడు, స్వయంభువుడు సుందరమూర్తి అయిన ఆ వరాహస్వామి భూదేవితో కూడి ఆ శేషాచల శిఖరంలో తన పాదపద్మముల నుంచి స్వామి పుష్కరిణి తీరంలో ఎవరికీ కనబడకుండా సుఖంగా ఉంటున్నాడు.

## 11. వైకుంఠం నుండి వేంకటాద్రికి:

శ్రీనివాసుడు కూడ స్వామి పుష్కరిణికి దక్షిణ తీరంలో జీవులకు సకలార్థముల ననుగ్రహించుటకై నివసిస్తున్నాడు. ఆయన సచ్చిదానంద స్వరూపుడు, వృద్ధిక్షయ రహితుడు, కారుణ్యనిధి, కమలా ప్రియుడు, కవి, క్రాంతదర్శనుడు, ఆపదలంటనివాడు, సర్వసంపదలకు నిలయము, జ్ఞాననిధి, సమస్త సామగానములచే కీర్తించబడే సచ్చరిత్రుడు, పవిత్ర హృదయుడు, పురుణ పురుషుడు, ధాత, తమస్సుకు ఆవలనుండు పరమ పురుషుడు. అటువంటి శ్రీమన్నారాయణుడు పూర్వం ఉండే వైకుంఠాన్ని వదలి ఇప్పుడీ వేంకటాద్రిలో నివసిస్తున్నాడు.



# తిరుమలలో శ్రీవారికి

# ఓటి కుండలో నివేదన

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి

**కలగంటి కలగంటి నిప్పుడిటు కలగంటి**
**ఎల్ల లోకములకు అప్పడగు తిరువేంకటాద్రీశు గంటి**
**అతిశయంబైన శేషాద్రి శిఖరమ్ముగంటి**
**ప్రతిలేని గోపుర ప్రభలు గంటి**

– అంటూ అన్నమయ్య తన సంకీర్తనలో తిరుమలను తిరుమల రాయుడినీ కీర్తించాడు. చిత్ర విచిత్ర మండపాలు, తిరువీధులు, దివ్యతీర్థాలు, ఘనగోపుర ప్రాకారాలు, కనక శిఖరాలు నందనోద్యానవనాలు, ధర్మసత్రాలు, బొక్కసాలు, ఉగ్రాణాలు పాకశాలలు, ముఖ్య వాహనాలు, గొడుగులు, మకర తోరణాలు, సత్కళ్యాణ వేదికలు, ఉపాలయాలు, పరివార దేవతలు, భక్తజన సందోహాలతో తిరుమల కలియుగ వైకుంఠంగా అలరారుతూ ఉంటుంది. వేదనాదాలు ప్రబంధ గానాలు మంత్రోచ్చారణలు, మంగళ వాద్యాలు, మామిడాకుల తోరణాలు, స్వర నీరాజనాలు, గోవింద ఘోషలు, నైవేద్యపు వంటల ఘుమఘుమలు, కర్పూర పరిమళాలు, పూల వాసనలు అన్నీ కలిపి కలగలిపి నిత్య కళ్యాణం పచ్చతోరణంగా భాసిల్లే తిరుమల వాతావరణం వైకుంఠ పుర వైభవాన్ని తలపింపచేస్తుంది.

ఆనందనిలయంగా పిలువబడే గర్భగుడిలో కొలువై ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసుడు సాక్షాత్తు వైకుంఠ వాసుడైన విష్ణుమూర్తిని తలపించేటంతటి వైభవాన్ని మనకి దర్శింపచేస్తాడు. బంగారు పద్మపీఠం, ఆ పీఠంపై శ్రీవారి కనకపు పాదాలు, ఆ పాదాలపై మెరిసే గజ్జెలు, అందియలు, ఆపైన ఘనపట్టు పీతాంబరం. పీతాంబరం కుచ్చెళ్ళపై జీరాడుతూ వేలాడుతున్న సహస్ర నామాల మాలలు. బొడ్డు దగ్గర మెరిసే సూర్య కఠారి. నడుముకు బిగించి వున్న ఒడ్డాణం, బంగారు మొలతాడు. వజ్రఖచిత వరద హస్తం. తనను శరణు కోరితే సంసార సముద్రం మోకాళ్ళబంటే అని ఒయ్యారంగా చూపుతున్న కటి హస్తం. ఉరముపై కౌస్తుభమణి. నవరత్న హారాలు. వక్షస్థలంపై అనుగ్రహిస్తున్న వ్యూహలక్ష్మి. శ్రీదేవి భూదేవి పతకాల హారాలు. కంఠమాలలు. బంగారు యజ్ఞోపవీతం. చేతులకు నాగాభరణాలు. ఆపైన భుజకీర్తులు. భుజాల నుండి వేలాడుతున్న సాలగ్రామ మాలలు. అభయ ప్రదానం కావిస్తూ మెరిసిపోతున్న శంఖు చక్రాలు. చిరు మందహాసం చిందించే నల్ల నగుమోము. ఆ మోముపై తెల్లని నామాలు. ఆ మోముకు ఇరువైపులా కర్ణాభరణాలు. చుబుకంపై తెల్లని కప్పురపు చుక్క. శిరస్సుపై అమరివున్న నవరత్నాల కిరీటం. మూలమూర్తిని స్పష్టంగా, ప్రస్ఫుటంగా పట్టి చూపించే బంగారు మకరతోరణం. స్వామికి అందంగా, అమరికగా

పొందికగా అలంకరించబడిన సుగంధభరిత సుమనోహర సుమమాల లు ... ఇన్ని అలంకారాల మధ్య స్వామివారు సమ్మోహనంగా అద్భుతంగా కాదు.. కాదు.. పరమాద్భుతంగా భక్తులకు దర్శనమిస్తుంటే ఆ వైభవం మనకు సాక్షాత్తు వైకుంఠ వాసుడైన విష్ణుమూర్తి వైభవాన్ని గుర్తుకు తెస్తుంది.

తిరుమల రాయని వైభవానికీ, వైభోగానికీ రెండే రెండు అంశాలు కారణాలుగా స్పష్టంగా గోచరిస్తాయి. మిరుమిట్లు గొలిపే అమూల్య రత్నాభరణాలు, ఉత్సవాలు, ఊరేగింపులు మొదటి అంశం కాగా రెండవ అంశం స్వామికి ఆరగింపు చేసే దివ్య ప్రసాదాలు. తిరుమలలో తప్ప ప్రపంచంలో మరెక్కడా ఇన్నిరకాల ప్రసాదాలు, ఇంత వాసి కల్గిన రుచికరమైన ప్రసాదాలు నివేదనకు తయారు కావేమో! శ్రీనివాసుడు ఎంతటి అలంకార ప్రియుడో అంతటి నైవేద్య ప్రియుడట! ఎంతటి నైవేద్య ప్రియుడో అంతటి భక్త ప్రియుడట! తనకు ఆరగింపు చేసిన నైవేద్యాలన్నీ భక్తులు తినాలని ఆ భక్త వరదుని సంకల్పమట! స్వామివారికి సమర్పించే ప్రసాదాలను శ్రీవారి ఆలయంలో గమేకార్లు అనబడే వంటవారు సంప్రదాయబద్ధంగా పోటు అని పిలువబడే వంటశాలలో వండుతారు. తిరుమలలో స్వామివారికి ప్రతిరోజూ తెల్లవారుజామున సుప్రభాతం మొదలు రాత్రి ఏకాంత సేవ వరకు జరిగే నివేదనల గురించి తెల్సుకొందాం.

ప్రతిరోజు తెల్లవారుజామున సుప్రభాత వేళలో శ్రీనివాసుడికి వెన్న, పాలు, చక్కెర నివేదన చేస్తారు. ఆ తర్వాత స్వామివారికి కొలువు సేవ అనబడే దర్బారు జరుగుతుంది. బంగారు సింహాసనంపై ఛత్ర చామర మర్యాదలతో మహాదర్పంగా వేంచేసి వున్న శ్రీనివాస ప్రభువులకు రాజోచిత మర్యాదలు సమర్పించిన తరువాత ఆనాటి తిథి వార నక్షత్రాది పంచాంగ శ్రవణం, శ్రీవారి ఆదాయ వ్యయాలు వినిపించిన తరువాత వేయించిన నువ్వులను బెల్లంతో కలిపి దంచిన నువ్వుల పిండి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇలా రోజూ శనిదేవునికి ప్రీతికరంగా స్వామి నువ్వుల పిండిని ఆరగిస్తారు. అందుకే స్వామి వారి భక్తులకు శనిగ్రహ దోషాలు తొలగిపోతాయి. పిదప సహస్ర నామార్చన జరుగుతుంది. ఆ తరువాత మొదటి గంట అని పిలువడే తొలి నైవేద్యంలో స్వామి వారికి ఎదురుగా పులిహోర, పొంగలి, దధ్యోదనం, చక్కెర పొంగలి మొదలగు అన్న ప్రసాదాలు, లడ్డు, వడలు అప్పాలు వగైరా పిండివంటలు కులశేఖరపడికి ఇవతలే ఉంచి నివేదన చేస్తారు. గర్భగుడి గడపనే కులశేఖరపడి అంటారు. ఈ సమయంలోనే ప్రధాన వంటవారు 'ఓడ' అని పిలువడే పగిలిన మట్టికుండలో 'మాత్రా' అనబడే చిక్కటి మీగడ పెరుగు అన్నాన్ని ఆనంద నిలయంలోకి తీసుకెళ్ళి స్వామివారికి సమర్పిస్తారు. ఈ మాత్రా అని పిలువబడే మీగడ పెరుగు అన్నం తప్ప మరి ఏ ఇతర ప్రసాదాలు కులశేఖరపడి దాటి ఆనంద నిలయంలోకి తీసుకెళ్ళరు. అలాగే ఓడ అని పిలువడడే పగిలిన మట్టి కుండ తప్ప ఏ ఇతర నివేదనా పాత్రలు కూడా ఆనంద నిలయం లోనికి తీసుకెళ్ళబడవు.

ఇక మధ్యాహ్నం అష్టోత్తర శతనామార్చన అయిన వెంటనే స్వామివారికి రెండవ గంట అనబడే మధ్యాహ్న నివేదన జరుగుతుంది. అన్న ప్రసాదాలతో బాటు శుద్ధాన్నం, భక్తులు మొక్కులుగా సమర్పించే అన్న ప్రసాదాలు, సీరా, పాయసం, కేసరీబాత్, క్షీరాన్నం కదంబం మొదలగు ప్రసాదాలు ఈ మధ్యాహ్న నివేదనలో సమర్పిస్తారు. రెండవ గంట అయిన వెంటనే స్వామికి నిత్య కళ్యాణోత్సవం జరుగుతుంది. కళ్యాణానంతరం శ్రీవారికి లడ్డు, వడలు, అప్పాలు దోసెలతో పాటు చక్కెర పొంగలి, పులిహోర, పొంగలి, దధ్యోదనం వంటి అన్న ప్రసాదాలు నివేదించబడతాయి. తరువాత వసంతోత్సవం జరుగుతుంది. ఈ వసంతోత్సవంలో దోసెలు అన్న ప్రసాదాలు నివేదిస్తారు. ఆ వెంటనే అద్దాల మండపంలో జరిగే డోలోత్సవంలోను, ఆ వెంటనే సాయంకాలం జరిగే సహస్ర దీపాలంకార సేవలోనూ పంచకజ్జాయం అనే ప్రసాదం నివేదించబడుతుంది. చక్కెర, గసగసాలు, కలకండ ముక్కలు, ఎండు ద్రాక్ష, జీడిపప్పు, బాదంపప్పు ఎండు కొబ్బరికోరు అన్నీ కలిపి చేసే పొడి లాంటి ప్రసాదమే 'పంచకజ్జాయం'.

ఇక సాయంసంధ్యలో శ్రీవారికి తోమాల సేవ అనే పుష్పాలంకార సేవ ఏకాంతంగా జరుగుతుంది. వెంటనే తోమాల దోసెపడి అనే పెద్ద పెద్ద నెయ్యి దోసెలు మొళహోర, కదంబం నివేదించబడతాయి. తర్వాత స్వామికి మూడవ అర్చనగా అష్టోత్తర శతనామార్చన జరిగిన తర్వాత మూడవ గంట అనబడే రాత్రి నైవేద్యం జరుగుతుంది. చక్కెర పొంగలి, పొంగళ్లు, మొళహోర, కదంబం వంటి ప్రసాదాలను నివేదిస్తారు. ఇలా మూడుసార్లు నివేదనలేగాక చివరగా రాత్రిపూట 'తిరువీసం గంట' అనే ప్రత్యేక నివేదనలో 'చక్కెర పొంగలి' మాత్రమే శ్రీవారికి నివేదన చేస్తారు. రాత్రి ఏకాంత సేవలో చక్కెర కలిపిన గోరు వెచ్చని పాలు, పండ్లు, పంచ కజ్జాయంతో బాటు మేవా అనబడే పంచామృతం లాంటి ప్రసాదం నివేదించబడుతుంది. ఇవీ ప్రతిరోజూ జరిగే నివేదనలు. సోమవారం మలయప్ప స్వామికి జరిగే విశేష పూజలో పెద్ద వడలు, లడ్డు, అన్నప్రసాదాలు నివేదన చేస్తారు. ప్రతి బుధవారం ఉదయం బంగారు వాకిలి వద్ద జరిగే సహస్ర కలశాభిషేకంలో క్షీరాన్నంతోబాటుగా మిగిలిన అన్నప్రసాదాలు నివేదన చేస్తారు. ప్రతి గురువారం జరిగే తిరుప్పావడ సేవలో సుమారు 420 కిలోల బియ్యంతో తయారు చేసిన పులిహోరను స్వామివారి

మూలమూర్తికి ఎదురుగా, బంగారు వాకిలి ముందర పెద్ద రాశిగా అమర్చి వేరుగా నివేదన చేస్తారు. తిరుప్పావడ సేవలో చాటంత జిలేబీలు, చాటంత మురుకలు కూడా నివేదన చేస్తారు. శుక్రవారం నాడు పోళీలు లేదా హోళిగలు అనే పూర్ణం భక్ష్యాలను సుఖియలనే ఉండ్రాళ్లను నివేదన చేస్తారు. ఆదివారం నాడు ఆదివారం ప్రసాదం అనబడే చలిపిండి ప్రసాదాన్ని నివేదిస్తారు. ఈ చలిపిండినే అమృత కలశం అంటారు.

ఇక ఏకాదశి, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాలలో శనగపప్పుతో తయారు చేసిన శుండలి దోసెలు నివేదన చేస్తారు ఇవేగాక పెసరపప్పు పణ్ణారం పానకాన్ని కూడా సమర్పిస్తారు. ఇక ధనుర్మాస వ్రత సమయంలో బెల్లపు దోసెలు నివేదన చేస్తారు. విశేష పర్వదినాలలో కేసరీబాత్, శాకరీ బాత్, బకాళాబాత్, మనోహరం పాయసం వంటి విశేష వంటకాలు నైవేద్యంగా సమర్పిస్తారు. ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున నివేదనలు ఈ దేవాలయంలో తప్ప మరెక్కడా జరగవేమో! అందుకే బహుశా తెనాలి రామకృష్ణ కవి తిరుమల రాయుడిని 'తిండి మెండయ్య' అని వ్యాఖ్యానించి వుంటాడు. అలాగే తొలిసారి తిరుమలను దర్శించిన అన్నమయ్య ''శ్రీవారి వంటశాలలో కాగి – కాగి చివరకు మిగిలిన ఒకనాటి నెయ్యి గసిని ఇతర ఆలయాలలో వంటకు ఒక సంవత్సరం పాటు ఉపయోగించవచ్చునని'' ఆశ్చర్య పడుతూ వ్యాఖ్యానించాడట. అంతేకాదు ''తోమని పళ్ళాలవాడు'' అంటూ స్వామివారిని వ్యవహరించాడు. నైవేద్య ప్రియుడు, భోజన ప్రియుడు తిండిమెండయ్య , తోమని పళ్ళాలవాడు అనే బిరుదులు ఎన్ని ఉన్నా, ఎంతటి వైభవంగా వైభోగంగా నివేదనలు జరిగినా స్వామి మాత్రం నిరాడంబరంగా, నిశ్శబ్దంగా అతి సామాన్యునిలా తన భక్త ప్రియత్వాన్ని చాటుకొంటూ ఓడ అనే విరిగిన మట్టి కుండలో మాత్రా అనబడే చిక్కటి మీగడ పెరుగు అన్నాన్ని మాత్రమే ఆనంద నిలయంలోనికి అనుమతిస్తున్నాడు. అది మాత్రమే ప్రియంగా ఆరగిస్తున్నాడు. మిగిలిన నైవేద్యాలన్నీ కులశేఖరపడికి ఈవల నుండి మాత్రమే నివేదించబడతాయి. ఇలా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ఓటి కుండలో మాత్రమే నివేదన స్వీకరించడానికి కారణం తెల్సుకోవాలంటే మనం భీముడు అనే ఒక కుమ్మరి భక్తుని గాథ తెల్సుకోవాలి. పూర్వం శ్రీవారు అర్చామూర్తిగా వెలసిన తొలినాళ్ళలో తొండమానుడు శ్రీవారి పాదపద్మాలకు బంగారు తులసీ దళాలతో సహస్ర నామార్చన రోజూ చేసేవాడట. ఇలా చేస్తూ ''నాలా బంగారు తులసి దళాలతో నిత్యార్చన ఎక్కడా ఉండదు''అని కించిత్ గర్వంతో తలపోసాడట. ఆ మర్నాడు పూజలకు రాగా తన బంగారు తులసీ దళాలు పక్కకి తొలగిపోయి బంక మట్టి పూవులు శ్రీవారి పాదాల మీద కనిపించాయట. విస్మయం చెందిన తొండమానుడు శ్రీనివాసుని ప్రార్థించి విషయం తెలుపగా ''ఓయీ రాజా! నీవంటి భక్తులు నాకు అనేకులు ఉన్నారు. భీముడనే కుమ్మరివాడు ఇక్కడికి ఉత్తరంగా ఒక యోజన దూరంలో ఉన్నాడు. ఆలయానికి కావల్సిన కుండలు చేసికొంటూనే, చేతికి అంటిన బంక మట్టితో పూలు చేసి ఇంట్లోనే కొయ్య బొమ్మగా నన్ను ప్రతిష్ఠించి పూజ చేస్తున్నాడు. ఆ మట్టి పూలనే ఆనంద నిలయంలోని నా పాదాలపై నీవు చూస్తున్నావు. కనుక నీవు మాత్రమే భక్తుడవని అహంకరించడం తప్పు'' అంటూ మందలించాడు. వెంటనే తొండమానుడు భీముని ఇంటికి వెళ్ళి నమస్కారం చేసి అలసటతో తెలివి తప్పి పడిపోయాడు. అంతలో శ్రీనివాసుడు ప్రత్యక్షం కాగా, కుమ్మరి భీముడు అనేక విధాల స్తుతించి, తన ఆతిథ్యం స్వీకరించమని కోరాడు. శ్రీనివాసుడు అంగీకరించి మట్టిమూకుడులో సంకటి తిన్నాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. స్వర్గం నుంచి వచ్చిన దివ్య విమానంలో కుమ్మరి భీముడు అతని భార్య వైకుంఠానికి వెళ్ళిపోయారు. ఈ కుమ్మరి భీముడే తరువాతి కాలంలో కురువనంబి లేక కురవరతినంబిగా ప్రసిద్ధికెక్కాడు. ఆనాడు కుమ్మరి భీముడు భక్తితో ఇచ్చిన విందుకు గుర్తుగా ప్రతిరోజూ మొదటి గంట అనబడే నివేదనా సమయంలో ఓడు అనే సగం పగిలిన మట్టి కుండలో మాత్రా అనబడే మీగడ పెరుగు అన్నం శ్రీవారికి ఆనంద నిలయంలో నివేదన కావించబడుతుంది. ఏరోజు కారోజు ఆ ఓడ అనబడే ఓటి కుండను పారేస్తారు. మర్నాడు మళ్ళీ కొత్త ఓడలో మాత్రా నివేదన చేస్తారు. అందుకే అన్నమయ్య శ్రీవారిని తోమని పళ్ళాలవాడు అంటూ వ్యాఖ్యానించాడు. మణిమయరత్న ఖచిత ఆభరణాలతో బంగారు మేడలో కొలువై ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తన భక్తుడైన కుమ్మరి భీముని భక్తికి పరవశించి, భీముడిచ్చిన ఆతిథ్యానికి గుర్తుగా నేటికీ ఓటి కుండలోనే నివేదన అందుకొంటున్నాడు. పైగా ఈ ఓటికుండలో మాత్రా అనబడే పెరుగన్నం తప్ప ఇతర పదార్థాలకు ఆనంద నిలయంలోనికి ప్రవేశం లేదు. ఎంతటి ఘుమఘుమలాడే మధురాతి మధుర పదార్థాలైనా కులశేఖరపడి దాటి వెళ్ళే వీలు లేదు. ఇదే శ్రీవారి భక్తప్రియత్వం. వింత వింత విభవాల వేంకటేశుడు తన భక్తులకు ఇచ్చే విలువ. తన భక్తులపై చూపే శాశ్వత అనుగ్రహం. అందుకే అన్నమయ్య తన సంకీర్తనలో ఏడుకొండలవాడిని ఇలా కీర్తించాడు.

**కుమ్మరి దాసుడైన కురువరతినంబి**
**ఇమ్మన్న వరములెల్లా ఇచ్చినవాడు**
**కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు**
**కొండలంత వరములు గుప్పెడువాడు.**

# తిరుమల సర్వస్వం

**పల్లపోతు వాణిశ్రీ**


## రాజుగారి పశ్చాత్తాపం

మదపుటేనుగు ఘీంకారానికి మెలకువ వచ్చిన రాజభటులు ఏనుగు చెరకుగడలను భుజించటం చూసి విస్తుపోయారు. మూసిన గృహద్వారాలు మూసినట్లే ఉండటంతో, నమ్మశక్యం కాని ఈ వింతను రాజు గారికి వివరించారు. ప్రత్యక్షసాక్షుల ద్వారా ఈ కథనాన్ని వినడంతో జ్ఞానోదయమైన రాజుగారు బాబాజీ చెప్పిన శ్రీవారి పాచికలాట ఉదంతాన్ని విశ్వసించి, అతణ్ణి శ్రీవారి పరమభక్తుడిగా గుర్తించి, బాబాజీకి అనుచరుడిగా మారిపోయాడు. అంతటితో, 'గిరిధర రాయలు', 'గిరిధర దాసు'గా మారి, బావాజీకి ప్రథమ శిష్యుడయ్యాడు. బావాజీ ఆశ్రమానికి లెక్కలేనన్ని కానుకలనిచ్చి తన భక్తిని చాటుకున్నాడు. అప్పటి నుండి ఆశారామ్ బల్జోత్ 'హాథీరాం బాబా'గా వినుతికెక్కారు. 'హాథీ' అనగా ఏనుగు ఆయన రామభక్తికి గుర్తుగా 'రాం' అనే పదం, ఉత్తరభారతదేశంలో సాధుపురుషులను సంబోధించే 'బాబా' లేదా 'బావా' అనే పదం వెరసి 'హాథీరామ్ బాబాజీ'గా అవతరించారు.

ఈ ఉదంతంతో బావాజీ భక్తి ప్రపత్తులు లోకప్రసిద్ధమై, వారిని దర్శించుకోవడానికి భక్తులు ఎగబడేవారు. ఉత్తరాది నుండి కూడా భక్తులు వెల్లువెత్తడం మొదలైంది. శ్రీవారి దర్శనానంతరం తప్పనిసరిగా బావాజీ ఆశ్రమానికి వచ్చి, వారిని కూడా భక్తిశ్రద్ధలతో నమస్కరించుకుని, కానుకలు సమర్పించుకునే వారు. అలా భక్తుల విరాళాలతో, రాజుగారి ప్రాపకంతో బాబాజీ ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేపట్టేవారు. దేవాలయానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం అనేక దానధర్మాలు నిర్వహించేవారు. బ్రహ్మోత్సవాల వంటి సందర్భాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు గావించేవారు. ఈ విధంగా భక్తుల విరాళాలతో, రాజుగారి అండదండలతో అనతికాలంలోనే బాబాజీ నివాసముంటున్న చిన్న ఆశ్రమం ఈనాడు మనం చూస్తున్న పెద్దమఠంగా రూపు దిద్దుకుంది. ఎందరెందరో భక్తులు గృహస్థాశ్రమాన్ని త్యజించి, బావాజీ అనుచరులుగా, శిష్యులుగా మారారు. వారికి ప్రతిరాత్రి బావాజీ ఎవరితోనో సంభాషిస్తున్నట్లు, పాచికలు వేసిన సవ్వడి వినిపించేవి.

తరువాతి కాలంలో బాబాజీ, తదనంతరం వారి అనుచరులు 'మహంతుమఠం' పేరిట ఒక ధార్మిక సంస్థను ఏర్పరచి దాని ద్వారా ఆలయాన్ని అనేక రకాలుగా అభివృద్ధి చేశారు. ఈ ఆశ్రమంలో నిరాశ్రయులకు, సాధువులు సన్యాసులకు, బైరాగులకు నిత్యాన్నదానం జరిగేది. 'మహంతు' అనే ఉత్తర భారత పదానికి 'సాధువు' లేదా 'సన్యాసి' అని అర్థం. కొందరి కథనం ప్రకారం, బావాజీ వల్లనే శ్రీ వేంకటేశ్వరునికి 'బాలాజీ' అనే నామాంతరం వచ్చింది. అయితే, ఈ విషయం ధృవీకరించటానికి బలమైన ఆధారాలు లేవు. దేవాలయంలో పలు ఉత్తరభారత దేశ సాంప్రదాయాలకు మహంతుల కాలంలోనే శ్రీకారం చుట్టబడింది.

## బాబాజీ జ్ఞాపకాలు



బాబాజీ జీవిత చరిత్రతతో ముడిపడియున్న అనేక జ్ఞాపకాలను నేడు కూడా తిరుమల క్షేత్రంలో దర్శించుకోవచ్చు. వాటిలో ముఖ్యమైన వాటిని గురించి ఇప్పుడు చెప్పుకుందాం.

**హాథీరామ్ బాబా మఠం**

ఆలయ మహాద్వారానికి ఎదురుగా నిలబడితే, మనకు ఎడం ప్రక్కగా పాత సహస్రదీపార్చన మంటపం పైభాగంలో, స్వామివారితో పాచికలాడుతున్న హాథీరామ్ బాబా కుడ్యశిల్పం నయన మనోహరంగా దర్శనమిస్తుంది. సరిగ్గా,దానికి వెనుక భాగంలోనే, ఎత్తైన గుట్టపై హాథీరామ్ బాబా మఠం ఉంది. దక్షిణమాడవీధిలో, తిరుమలనంబి ఆలయం దాటిన తరువాత, 'సుపథం' ప్రక్కన ఉన్న సన్నటి మార్గం ద్వారా వెళ్ళి, కొన్ని మెట్లెక్కి ఈ మఠాన్ని చేరుకోవచ్చు. ఆ ప్రదేశంలోనే బాబాజీ ఒకప్పుడు నివసించేవారు. బాబాజీ ఒక రాత్రి నిర్బంధించబడింది కూడా ఆ ప్రదేశంలోనే!

కొన్ని వందల ఏళ్ళ క్రితం, శేషాచల అరణ్యాలలో విరివిగా లభ్యమయ్యే ఎర్రచందనం స్తంభాలతో, వివిధ కళాకృతులు

అత్యంత మనోహరంగా చెక్కబడిన తలుపు ద్వారబంధాలతో, పటిష్టమైన పై కప్పుతో రాచఠీవి ఉట్టిపడేలా నిర్మించబడ్డ ఈ మఠం నేటికీ చెక్కుచెదరకుండా, తిరుమల యాత్రికులను ఆకట్టుకుంటోంది. దీనికి అనుబంధంగా తరువాతి కాలంలో నిర్మించబడ్డ కట్టడాలు యాత్రికులకు వసతిగృహంలా ఉపయోగ పడుతున్నాయి. ముందస్తుగా ఆరక్షణ (రిజర్వేషన్) చేసుకొని, ఇందులో గదులు పొందవచ్చు. అయితే, దేవాలయానికి అతి దగ్గరగా ఉండటం, సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడు నడయాడిన ప్రాంతం కావటం వంటి కారణాల వల్ల ఇందులో వసతి లభించటం కొంచెం కష్టంతో కూడుకున్నది.

ఈ ఆవరణలోనే కొత్వాల్ ఆంజనేయస్వామి దేవాలయాన్ని మరియు గణపతి ఆలయాన్ని సందర్శించుకోవచ్చు. మఠం లోపల ఉన్న కోదండ రామాలయంలో చలువరాతితో హృద్యంగా చెక్కబడిన సీతారామలక్ష్మణుల ముగ్ధమనోహరమైన విగ్రహాలను కన్నులారా వీక్షించుకోవచ్చు. ఆ విగ్రహాల చెంతనే, దశావతార సాలగ్రామాలు కూడా తరతరాలుగా పూజలందు కొంటున్నాయి. ఒక్కొక్క సాలగ్రామంపై ఒక్కొక్క దశావతారపు చిహ్నం మత్స్యాకారము, తాబేటి డిప్ప, వరాహమూపురము, మొదలైన ప్రకృతిసిద్ధంగా ముద్రాంకితమై, చూపరులకు అచ్చెరవు గొల్పుతుంటుంది.

ఆ ఆలయానికి మూడు ప్రక్కలా ఊయలలో ఊగుతున్న చిన్నికృష్ణునికి, దశావతారాలకు ఉపాలయాలు ఉన్నాయి. ముద్దుల కృష్ణుని వెండి ఊయలను మనం కూడా ఊపి, స్వయంగా వారికి పవళింపు సేవ చేసి తరించవచ్చు.

ఈ మఠంలో అన్నింటికంటే ముఖ్యంగా చెప్పుకోదగ్గది హాథీరామ్ బాబాతో, శ్రీ వేంకటేశ్వరుడు పాచికలాడిన ప్రదేశం. ఈ ప్రదేశంలో నిర్మించబడిన చిన్న మంటపంలో ఆనాడు పాచికలాడిన, పట్టువస్త్రపు పాచికలపటం మరియు అఖండజ్యోతి నేటికీ నిత్యపూజలందుకొంటున్నాయి. ఈ ప్రదేశం వద్ద కొని వందల సంవత్సరాలుగా ఎల్లవేళలా, విరామం లేకుండా, రామనామ జపం జరుపబడుతోంది. ఆశ్రమవాసుల కథనం ప్రకారం బావాజీ వారే ఈ రామనామ పారాయణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుండి అది నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఆ రామనామ సంకీర్తన మహాయజ్ఞంలో మనం కూడా కొంతసేపు శృతి కలిపి, బాబాజీ కృపకు పాత్రులుకావచ్చు.

బాబాజీ, వారి శిష్యులైన మహంతులు ఆసీనులై ఉండే గద్దె కూడా ఈ మఠంలో సంరక్షించబడింది. మఠం ప్రాంగణంలో మఠాధిపత్యం వహించిన మహంతుల సమాధులను కూడా పరిరక్షించారు. మఠం యొక్క ప్రహరీగోడకు గల గవాక్షం గుండా దేవాలయ ఉపరితల భాగాన్ని, గోపురాలను కన్నులపండువగా కాంచవచ్చు. ఇప్పటి ప్రధాన మహంతు, మహంతు మఠానికి చెందిన మరికొందరు సభ్యులు ఈ మఠంలోనే నివాసముంటారు. దాదాపు రెండున్నర ఎకరాల సువిశాల ప్రదేశంలో నిర్మితమైన హాథీరామ్ బాబా మఠం తిరుమల యందు తప్పనిసరిగా దర్శించి తీరవలసని విశేషాల్లో ఒకటి.

దాదాపుగా ఇలాంటిదే మరొక మహంతు మఠం తిరుపతి పట్టణాన, గోవిందరాజస్వామి ఆలయానికి సమీపంలో ఉంది. ప్రస్తుతం అది మహంతుకు మరొక ఆవాసంగానూ, తిరుపతిని దర్శించుకొనే సాధువులకు, సన్యాసులకు, బైరాగులకు విడిదిగానూ ఉపయోగపడుతోంది. తిరుమల క్షేత్రంలో బాబాజీ జీవితంతో ముడిపడిన మరికొన్ని విశేషాలను, మహంతుల పరిపాలనాకాలంలో తిరుమల క్షేత్రం తీరుతెన్నులను ఇప్పుడు తెలుసుకుందాం.

## కుడ్య శిల్పం

హాథీరామ్ జీవన గమనానికి సంబంధించి తిరుమలలో దర్శించుకోదగ్గ మరో ముఖ్య విశేషం ఈ కుడ్యశిల్పం. సంపంగి ప్రదక్షిణ మార్గంలో, ధ్వజస్తంభానికి ఎదురుగా, 'నడిమిపడి కావలి' లేదా 'వెండివాకిలి' ప్రవేశ మార్గంలో, దక్షిణం వైపున ఉన్న కుడ్యంపై, భక్తిపారవశ్యంలో మైమరచి ఉన్న హాథీరామ్ బాబాజీ, శ్రీ వేంకటేశ్వరునితో పాచికలాడుతుండగా, అప్పటి చంద్రగిరి రాజైన గిరిధరదాసు వారి సమీపంలో నిలబడి ఈ వినోద క్రీడను ఆసక్తిగా తిలకిస్తున్నట్టున్న ఘట్టం జీవకళ ఉట్టిపడేట్లు చెక్కబడి ఉంది. ఈ శిల్పాన్ని రాజుగారే ప్రతిష్ఠించి ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం. దీనికి వెండి తాపడం గావించి, అద్దాల అరలో భద్రపరిచారు. వెండివాకిలి లోనికి ప్రవేశిస్తున్నప్పుడు ఈ శిల్పాన్ని మనకు ఎడమ ప్రక్కగా, అతి సమీపంలో నుండి దర్శించుకోవచ్చు. ఈసారి స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా ఈ విగ్రహానికి నమస్కరించుకుందాం.

## హాథీరాం బావాజీ సజీవ సమాధి

బాబాజీకి సంబంధించిన మరో ముఖ్య విశేషం వారి 'జీవసమాధి'. సుదీర్ఘకాలంపాటు శ్రీవారిని సేవించి తరించిన బాబాజీ తన అవసాన దశలో, ఆలయానికి ఉత్తరదిశగా మూడు మైళ్ల దూరంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు. గోగర్భం ఆనకట్ట దాటిన తరువాత, ఆకాశగంగ తీర్థానికి ముందుగా, రహదారికి దాదాపు పావు మైలు దూరంలో ఈ ఆశ్రమం ఉంది. బాబాజీ ఈ ఆశ్రమంలో ఏకాంతంగా ఉంటూ, తపోదీక్షలో శేషజీవితాన్ని గడుపుతూ ఉండేవారు. రోజుల తరబడి నిరాహార



దీక్షలో ఉండే బాబాజీ అప్పుడప్పుడు ఆశ్రమానికి సమీపంలో ఉన్న 'రామపత్రవృక్షం' యొక్క ఆకులను మాత్రం భుజించి ప్రాణాలు నిలుపుకునేవారు తీయని రుచి గల ఆకులతో ఉండే ఈ వృక్షాన్ని, ఆ ఆశ్రమ ప్రాంతంలో నేడు కూడా చూడవచ్చు. సమాధిని దర్శించుకోవడం కోసం వచ్చే భక్తులకు ఈ పత్రాలను ప్రసాదంగా ఇచ్చే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

బాబాజీ ఆశ్రమానికి అతి సమీపంలోనే శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించి, అందులో నిత్యపూజలు నిర్వహించేవారు. అలా త్రేతాయుగపు శ్రీరామచంద్రుణ్ణి సేవించడంతో మొదలైన బాబాజీ ప్రస్థానం, శ్రీమహావిష్ణువు కలియుగ అవతారమైన శ్రీవేంకటేశ్వరుణ్ణి కొలుచుకుంటూ, అంత్యదశలో, ద్వాపరయుగపు అవతారమైన శ్రీకృష్ణుని చరణాల చెంత ముగిసింది. బాబాజీ అక్కడే ఒక అఖండ జ్యోతిని వెలిగించి, ప్రతి నిత్యము తన తపస్సును ప్రారంభించేవారు. వయోభారం మీదపడటంతో జనసంచారానికి దూరంగా ఉన్న ఆ ఆశ్రమంలో మౌనంగా శ్రీనివాసుణ్ణి స్మరించుకుంటూ కొన్ని సంవత్సరాలు గడిపిన బాబాజీ అదే ప్రదేశంలో సజీవసమాధి అయ్యారు. ప్రస్తుతం ఆ సమాధి మహంతుల సంరక్షణలో ఉంది. వేణుగోపాల స్వామి ఆలయాన్ని ఈ మధ్యనే ఆధునీకరించారు. ఉత్తర భారత దేశస్తులు, ముఖ్యంగా లంబాడి గిరిజన తెగకు చెందిన భక్తులు, ఈ సమాధిని అధికంగా దర్శించుకుంటారు. ప్రతి ఏడాది బాబాజీ సజీవ సమాధిలోకి ప్రవేశించిన రోజును పురస్కరించుకుని నరక చతుర్దశి నాడు 'హాథీరామ్ బావాజీ సమాధి వార్షికోత్సవం' అత్యంత వైభవంగా జరుగుతుంది.

## మహంతుల నిర్వహణలో తిరుమల ఆలయం

ఈ విషయాన్ని చెప్పుకునేముందు, ఆలయ అజమాయిషీ ఈస్ట్ ఇండియా కంపెనీ వారి నుండి మహంతుల చేతిలోకి మారడం వెనుకనున్న చారిత్రక నేపథ్యాన్ని కొద్దిగా తెలుసుకోవాలి. విజయనగర రాజుల తరువాత, మారుతున్న రాజకీయ పరిణామాలకనుగుణంగా ఆలయ నిర్వహణ క్రమంగా ఆర్కాట్ నవాబుల చేతికి, తరువాత మరాఠా పాలకుల చేతికి మారింది. కాలక్రమేణా 19వ శతాబ్దపు ప్రథమార్ధంలో, తిరుపతి – తిరుమలలో ఉండే ఆలయాలన్నీ తిరుమలలోని ప్రధాన ఆలయంతో సహా ఈస్టిండియా కంపెనీ పరిపాలన పరిధిలోకి వచ్చాయి.

## తెల్లదొరల పరిపాలనలో తిరుమల

దాదాపు అర్ధశతాబ్దం పాటు ఆలయ నిర్వహణ బాధ్యతను నిర్వహించిన తెల్లదొరలు, వైదిక కార్యక్రమాల కంటే ఆర్థిక వ్యవహారాలకే ప్రాముఖ్యత నిచ్చారు. తిరుమల ఆలయం హైందవ మతానికి ఆటపట్టు అన్న విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించి, ఈ ఆలయాన్ని ఆదాయవనరుగా భావించేవారు. ఒక పద్ధతి ప్రకారం హిందూ మతాన్ని నిర్వీర్యం చేసే కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. అంతకుముందు భక్తులకు ఉచితంగా అందించే సేవలకు రుసుము వసూలు చేయడం ప్రారంభించారు. సరుకుల విషయంలో రాజీ పడడం వల్ల, ప్రసాదాల తయారీలో నాణ్యత లోపించింది.

అయితే, ఈస్టిండియా కంపెనీ వారి హయాంలో అనేక లోటుపాట్లు ప్రస్ఫుటంగా కాన వచ్చినప్పటికీ, వారి వల్ల ఆలయానికి, అయాచితంగా నైనా కొంత మేలు కూడా జరిగింది.

ఉదాహరణకు హిందువుల మనోభావాలను గౌరవించిన ఒకరిద్దరు బ్రిటిష్ ఉన్నతాధికారుల చొరవతో, సప్తగిరుల పైకి అన్యమతస్తుల రాకను నిషేధిస్తూ కఠినమైన చట్టాలు చేయబడ్డాయి. హిందూ మతస్తులు అందరికీ ఈ రోజుల్లో నిమ్న కులస్తులుగా భావించబడే వారితో సహా ఆలయం లోనికి ప్రవేశం కల్పించబడింది. అంతే కాకుండా ఆలయానికి సంబంధించిన అనేక వ్యవహారాలు, బ్రిటిష్ వారి హయాంలోనే గ్రంథస్తం చేయబడ్డాయి. అంతకు ముందు వరకూ శిలాఫలకాలపై, రాగిరేకుల మీద, తాళపత్రాలలో, చేతివ్రాత ప్రతుల యందు ఉన్నట్టి ఆలయ నియమ నిబంధనలను మొట్టమొదటిసారిగా అచ్చులలో ముద్రించి, వాటికి శాశ్వత రూపం కల్పించి భావితరాల వారికి అందజేశారు. ఇందులో వారి స్వార్థం



ఎంతో ఉన్నప్పటి కీ నిర్వహణ వ్యవహారాలు వ్రాతపూర్వకమైన ప్రామాణికతను సంతరించుకోవడం వల్ల దేవాలయానికి మాత్రం కొంతలో కొంత మేలే జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెనీ వారి హయాంలో 19వ శతాబ్దపు తొలి దశకాల్లో ఆలయానికి సంబంధించి వెలువడిన ముద్రిత గ్రంథాలలో ఈ ఐదింటినీ ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.

సవాల్–జవాబ్ పట్టీ అనే పట్టికలో తిరుమలలోనూ తిరుపతిలోనూ ఉన్నట్టి అనేక ముఖ్యమైన దేవాలయాల సమాచారాన్ని ప్రశ్నోత్తరాల రూపంలో పొందుపరిచారు. శిలాశాసనాల రూపంలో అప్పటికి అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా ఈ పట్టిక రూపొందించబడటం వల్ల విలువైన చారిత్రక సమాచారం వెలుగు చూసింది. వివిధ ఆలయాలకు ఉన్న మాన్యాల విస్తీర్ణాన్ని, హద్దులను కూడా ఇందులోనే పొందుపరచారు.

కైంకర్య పట్టి అనే గ్రంథలో ఆనాడు దేవాలయంలో సేవలందించే వివిధ వర్గాల వారి జీతభత్యాలను, వారి హక్కులను, విధులను, వారికి చెందవలసిన ఆలయ మర్యాదలను క్రోడీకరించారు. ఆనాటికీ అమలులో ఉన్న సాంప్రదాయాలు, వివిధ వర్గాల వారి నుండి రాబట్టిన మౌఖిక సమాచార సంకలనమే ఈ గ్రంథం.

బ్రూస్ నిబంధనావళి అనే పుస్తకంలో ఆలయ నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను, స్పష్టంగా నిర్వచించారు. ఆలయ వేళలు, ఉన్నతాధికారులకు గల అధికారాలు, ఆలయ నిర్వహణలో కంపెనీకి గల పరిమితులు, ఆదాయంపై అజమాయిషీ మొదలగు వాటిని గ్రంథస్థం చేశారు. తిరుమలలో ఈ మధ్యకాలం వరకు అమలులో ఉన్న మిరాశి వ్యవస్థకు ఆలంబనం ఈ నియమావళిలో ఉన్న అంశాలే.

దిట్టం బుక్కుగా వ్యవహరించబడే మరో పట్టికలో వివిధ రకాలైన ప్రసాదాలలో ఉపయోగించే దినుసులు, వాటి నాణ్యత, పరిమాణాలను లిఖించారు. ఏఏ సందర్భాలలో ఏ ఏ ప్రసాదాలను ఎంత మొత్తంలో తయారు చేయాలో కూడా ఇందులో ఉదహరించబడింది.

మైమాయిషీగా పిలువబడే మరో పట్టికలో ఆలయానికి సంబంధించిన వివిధ మంటపాలు, ఇతర కట్టడాలు, విగ్రహ మూర్తులు మొదలగు వాటికి సంబంధించిన వివరాలను, వాటిని నిర్మించిన దాతలను గురించిన సమగ్రమైన సమాచారాన్ని అందజేశారు.

ఇప్పుడు ఆలయ నిర్వహణ బాధ్యత ఈస్టిండియా కంపెనీ అధికారుల నుండి మహంతుల చేతిలోకి ఎందుకు, ఎలా వచ్చిందో పరిశీలిద్దాం. **(సశేషం)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 50వ కళ్యాణం:

ఇది 26.8.2023 శనివారం ఉదయం 10.30 నుండి జరిగింది. దీనిని శ్రీ సామల సంజీవ రెడ్డి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు కలిసి నిర్వహించారు. ఇది పతంజలి గోడౌన్ చీర్యాల గ్రామం, యాదగిరిపల్లి నుండి కీసర మార్గంలో జరిగింది. వైఖానసాగమోక్తంగా, అన్నమాచార్య కీర్తనల మధ్య జరిగింది.

## 51వ కళ్యాణం:

ఇది తేది 3–9–2023 ఆదివారం నాడు శ్రీరామచంద్రస్వామి దేవాలయం, కొండాపూర్, హైదరాబాద్లో జరిగింది. శ్రీ కామకోటి సీతారామాంజనేయస్వామి ఆలయం కొండాపూర్ వారు నిర్వహించగా, వైఖానసాగమోక్తంగా జరిగింది.

## 52వ కళ్యాణం:

ఇది తేది 23–09–2023 శనివారం ఉ. 10.30 నుండి జరిగింది. హైదరాబాద్లోని జనప్రియ బంగ్లాస్ మచ్చ బొల్లారం అల్వాల్లో శ్రీమాన్ చింతల శ్రీనివాస్రెడ్డి మంజుల దంపతులు నిర్వహించగా జరిగింది. వైఖానసాగమోక్తంగా అత్యంత వైభవంగా జరిగింది.

## 53వ కళ్యాణం:

ఇది తేది 24–09–2023 ఆదివారం ఉ. 10.30 నుండి జరిగింది. సరూర్నగర్లోని నారాయణాద్రి బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి నిర్వహణలో వారి అపార్టుమెంట్లో జరిగింది. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.




# శరన్నవరాత్రి వైభవము

**- డా. దేవులపల్లి పద్మజ**

**దుర్గా దుర్గార్తి శమనీ దుర్గాపద్వి నివారిణీ**
**దుర్గమచ్ఛేదినీ దుర్గా సాధనీ దుర్గనాశినీ ॥**

''ప్రథమా శైలపుత్రీచ, ద్వితీయ బ్రహ్మచారిణి, తృతీయ చంద్రఘంటేతి, కూష్మాండేతి చతుర్థకీ, పంచమా స్కంద మాతేతి, షష్టా కాత్యాయనేతిచ, సప్తమా కాళరాత్రీచ, అష్టమాచాతి భైరవీ, నవమా సర్వసిద్ధిశ్చాత్ నవదుర్గా ప్రకీర్తితా''.

శ్రీమాతను ఆరాధించే విధానమును శ్రీమార్కండేయ మహర్షికి బ్రహ్మ చెప్పినట్లు మనకు పురాణాలద్వారా తెలుస్తోంది. ఆశ్వయుజు శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు శరన్నవరాత్రులుగా మనం జరుపుకునే దసరా ఉత్సవాలు శక్తి రూపిణి అయిన దుర్గామాతను వివిధ రూపాలలో ప్రత్యేక పూజలతో పూజిస్తాము.

శక్తి ఆరాధన చేయదలచినవారు ప్రథమంగా గణపతిని పసుపుతో ప్రతిష్ఠించి నిర్విఘ్నంగా నవరాత్రుల దుర్గాపూజలు పూర్తిగావించి అఖండ ఫలితాలను ఆ తల్లి అనుగ్రహంతో పొందాలని సంకల్పం చెప్పుకోవాలి. నవరాత్రి కలశంను ప్రతిష్ఠించి, నవధాన్యాలను కూడా ఒక పాత్రలో ప్రక్కనే పెట్టుకోవాలి. నవరాత్రులు శక్తికి ప్రతిరూపం కాబట్టి సక్రమంగా జరిపే పూజలు అద్భుతమైన ఫలితాలను ప్రసాదిస్తుంది. అదే విధంగా ఆచార విరుద్ధంగా సాగించే పూజలతో చెడు ఫలితాలు కూడా చవిచూడవలసి వస్తుంది. కలశం స్థాపన వీలుకాక పోతే మామూలుగా కూడా తల్లిని పూజింపవచ్చును. నైవేద్యం విషయంలో కూడా శక్తి కలిగిన విధంగా చేయవచ్చును. ఈ నవరాత్రి వ్రతము చేయువారు ఏకభుక్తము చేయాలి. ప్రతిదినము ఉదయము మరియు సాయంత్రము అమ్మవారి పూజ విధివిధానాలతో చేయాలి.

**1. స్వర్ణ కవచాలంకారము**

ప్రథమంగా పాడ్యమి నాడు స్వర్ణకవచ అలంకారంతో దుర్గాదేవిగా విధివిధానాలతో, షోడశోపచార పూజలతో పూజిస్తారు. ఆ రోజు చేమంతి పూవులను వినియోగిస్తారు. దుర్గా అష్టోత్తర నామములతో పూజ సల్పి, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. దుర్గా కవచ పారాయణ విశేష ఫలితాన్నిస్తుంది.

**2. బాలాత్రిపుర సుందరి**

శరన్నవరాత్రులలో విదియ నాటి అవతారము బాలాత్రిపురసుందరి. పరమేశ్వరుడే తనకు పతి కావాలని కోరుకుంది. త్రిపురుని అర్ధాంగి కావటం వలన, అన్ని లోకాలలో ఈ తల్లి సౌందర్యవతి గావున బాలాత్రిపురసుందరిగా ఈ తల్లిని పిలుస్తారు. బాలా త్రిశతి స్తోత్రం అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పొంగలి నైవేద్యం పెట్టి అర్చిస్తే అభీష్ట సిద్ధి కలుగుతుంది. అమ్మవారిని ఆకుపచ్చ రంగు వస్త్రముతో అలంకరించి, గులాబీలతో అర్చిస్తే శుభప్రదము. శ్రీశైలం దేవస్థానములో అమ్మవారిని బ్రహ్మచారిణి రూపంలో అలంకరిస్తారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపురసుందరి అవతారంలో అలంకరిస్తారు.

**3. గాయత్రీదేవి**

దుర్గానవరాత్రులలో మూడవ రోజైన తదియనాడు అమ్మవారిని గాయత్రి అవతారంలో అర్చిస్తాము. సకల మంత్రాలకు మూలశక్తి అయిన గాయత్రీదేవి ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో కూడిన అయిదు ముఖాలతో శంఖము. చక్రము, గద మరియు అంకుశం ధరించి దర్శనమిస్తుంది. గాయత్రిదేవిని త్రిశక్తి స్వరూపంగా భావిస్తారు. విజయవాడలో కొలువైయున్న కనకదుర్గ ఈరోజు గాయత్రిమాత అలంకారంలో దర్శనమిస్తుంది. శ్రీశైలంలోని భ్రమరాంబ ఈ రోజు చంద్రఘంట అవతారంలో దర్శనమిస్తుంది. అర్ధాకృతిలోని చంద్రరేఖను శిరస్సుపై ధరించే రూపం చంద్రఘంట. ఈ రోజు అమ్మవారిని ఎరుపు రంగు వస్త్రము, కనకాంబరాలతో అలంకరించాలి. ఈమెకు పాయసం, అల్లపు గారెలు నివేదన చేయాలి.

**4. అన్నపూర్ణ**

దసరా నవరాత్రులలో నాల్గవరోజైన చవితినాడు అమ్మవారిని అన్నపూర్ణమాతగా ఆరాధిస్తారు. ఈమె ఒక చేతిలో అక్షయ పాత్రతో మరియొక చేతిలో గరిటెతో దర్శనమిస్తుంది కావున ఈమెను అన్నపూర్ణగా పూజిస్తారు. సాక్షాత్తు పరమేశ్వరునికే బిక్షనొసంగిన అన్నపూర్ణ అక్షయములైన శుభాలను కలిగిస్తుంది. అన్నపూర్ణాష్టక పారాయణ శుభదాయకము. ఈమెకు పులిహోర, పెసరపప్పు పాయసం నివేదన చేయాలి. విజయవాడ కనకదుర్గమ్మ అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. శ్రీశైలంలోని భ్రమరాంబ కూష్మాండ రూపంలో దర్శనమిస్తారు. కూరగాయలతో చేసిన కదంబం నివేదన చేయాలి.

**5. లలితా త్రిపురసుందరి**

దసరా నవరాత్రులలో అయిదవ రోజైన పంచమి తిథినాడు అమ్మవారిని లలితాత్రిపురసుందరిగా ఆరాధిస్తారు. శ్రీచక్రముపై ఎడమ పాదమును మోపి, చెరకు విల్లు, పుష్ప బాణములు ధరించి బంగారు సింహాసనముపై ఆశీనురాలైవుంటుంది. లలితా కవచపారాయణ, లలితా సహస్రనామ పారాయణ అత్యంత ఫలదాయకము. లలితాదేవికి గులాబీరంగు వస్త్రము ధరింపచేసి, నీలంరంగు పువ్వులతో పూజచేసి పాయసం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈరోజు లలితా త్రిపురసుందరిగా దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు స్కందమాతగా దర్శనమిస్తుంది. గోధుమ రవ్వతో చేసిన కేసరి, మిరియాల పొంగలి నివేదన చేయాలి. నీలం రంగు వస్త్రములతో అలంకరిస్తారు.

**6. మహాలక్ష్మి**

దుర్గానవరాత్రులలో ఆరవరోజైన షష్ఠి తిథినాడు అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అర్చిస్తారు. సిరిసంపదలకు, సౌభాగ్యానికి, సుఖసంతోషాలకు, సంతానానికి ప్రతీక. జగత్తు స్థితి కారకుడైన శ్రీమహావిష్ణువునకు తోడుగా మహాలక్ష్మి ఉద్భవించినదని దేవీభాగవతంలో చెప్పబడినది. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు భక్తులకు మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిస్తారు. ఈ తల్లిని శ్రీసూక్త పారాయణంతో, మహాలక్ష్మి సహస్రనామములతో, మహాలక్ష్మ్యష్ట స్తోత్రముతో స్తుతించాలి. ఈ తల్లికి తెలుపురంగు చీరను సమర్పించి, కలువపూవులతో, తామరపూవులతో అర్చించాలి. నైవేద్యంగా పూర్ణం బూరెలు సమర్పించాలి. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈమెను పసుపు రంగు వస్త్రాలతో అలంకరించి,ఈ మాతకు బెల్లం అన్నం, ముద్ద పప్పు నైవేద్యంగా సమర్పించాలి.

**7. సరస్వతి**

దుర్గానవరాత్రులలో ఏడవ రోజైన సప్తమి తిథినాడు అమ్మవారిని సరస్వతి అవతారంలో ఆరాధిస్తారు. దేవతామూర్తులలో చదువుల తల్లిగా సరస్వతీ దేవి కొలువబడుతుంది. త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మ పట్టపురాణి. సృష్టి కార్యం నిర్వహించటానికి బ్రహ్మకు తోడుగా ఈమెను మహాశక్తి సృజించినట్లుగా దేవీభాగవతం తెలియచేస్తోంది. తెల్లని పద్మముపై ఆసీనురాలై వీణ, దండ, కమండలం, అక్షమాల ధరించి అభయముద్రతో దర్శనమిస్తూ భక్తులకు జ్ఞానజ్యోతిని ప్రసాదిస్తుంది. ఈ రోజు మూలా నక్షత్రము గావటం వలన సరస్వతీ అవతారంలో దర్శనమిస్తుంది. విద్యార్థులచేత అక్షరాభ్యాసాలు చేయిస్తారు. ఈ మాతకు తెల్లని లేదా పసుపు రంగు వస్త్రాలు సమర్పించి, బెల్లం అన్నం, ముద్దపప్పు నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు సరస్వతీ అవతారంలో దర్శనమిస్తారు. శ్రీశైలం భ్రమరాంబ



ఈరోజు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ తల్లికి ఆకుపచ్చ వర్ణం వస్త్రాలతో అలంకరించి దద్దోజనం, చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించాలి.

**8. మహాదుర్గ**

దుర్గానవరాత్రులలో ఎనిమిదవ రోజైన అష్టమినాడు అమ్మను మహాదుర్గగా ఆరాధిస్తారు. పంచ ప్రకృతి రూపాలలో మొదటిది దుర్గా రూపము. సింహవాహనము అధిరోహించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తుంది. దుర్గముడనే రాక్షసుని సంహరించి, దుర్గతులను నాశనమొనరించి నందువలన ఈమెను దుర్గాదేవి అని కూడా పిలుస్తారు. ఈ రోజు దుర్గాసప్తశతి, చండీ పారాయణ, దుర్గా స్తోత్రము విశేష ఫలదాయకము. ఎరుపు రంగు వస్త్రము, ఎరుపు రంగు పూవులు అమ్మవారికి సమర్పించాలి. అమ్మవారికి పొంగలి, పులిహోర, పులగం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడలో కనకదుర్గమ్మ ఈరోజు మహాదుర్గగా భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు మహాగౌరిగా భక్తులను అనుగ్రహిస్తుంది. ఈ తల్లికి గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

**9. మహిషాసుర మర్థిని**

తొమ్మిదవ రోజైన నవమిని మహార్నవమి అని కూడా వ్యవహరిస్తారు. దుర్గానవరాత్రులలో నవమి రోజున మహిషాసుర మర్ధిని రూపంలో యున్న అమ్మ అనుగ్రహం కోసం భక్తులు మహిషాసురమర్ధిని స్తోత్రమును భక్తి శ్రద్ధలతో పఠిస్తారు. మహిషుడు గర్వమునకు, మదమునకు అంధకారమునకు ప్రతీక. ఈ రోజు దుర్గాసప్తశతి పారాయణ, ఖడ్గమాలా స్తోత్ర పారాయణ అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పానకం, వడపప్పు, గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి. ఎరుపు రంగు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు మహిషాసుర మర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబను ఈ రోజు సిద్ధిధాత్రి అవతారంలో అలంకరిస్తారు. ఈ రోజు ఛండీ సప్తశతి, ఖడ్గమాల పారాయణ చేయాలి. ఈ తల్లికి కొబ్బరి అన్నం, నిమ్మకాయ పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

**10. రాజరాజేశ్వరీ దేవి**

దుర్గానవరాత్రులలో ఆఖరి అవతారము శ్రీరాజరాజేశ్వరి. పరమేశ్వరుని అంకముపై ప్రకాశముతో వెలుగొందుతూ, పరమేశ్వరుని వామాంకాములో ఆసీనురాలై భక్తులకు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తిని ప్రసాదించే అవతారము శ్రీరాజరాజేశ్వరి. ఈరోజు ఈ తల్లిని లలితా సహస్రనామ పారాయణ చేసి ఆరాధించాలి. చేమంతులతో పూజ చేయాలి. భక్ష్య, భోజ్యములతో మహానివేదన చేయాలి. బంగారు కవచధారణ చేస్తారు లేదా బంగారు వర్ణముగల వస్త్రముతో అలంకరిస్తారు. ఈ రోజున విజయదశమిగా పూజిస్తాము. ఈ రోజు అశ్వపూజ, ఆయుధపూజ, ఉచ్ఛైశ్రవ పూజ, వాహన పూజ నిర్వహిస్తారు. శ్రీరాముడు విజయదశమి రోజున రావణుని సంహరించి విజయం పొందాడు. దశమి రోజు సాయంత్రము నక్షత్ర దర్శన సమయంలో శమీవృక్షము వద్ద అపరాజితాదేవిని స్మరిస్తారు. "శమీ శమయతే పాపం, శమీ శతృవినాశిని `అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియ దర్శినీ" అనే ఈ మంత్రముతో తమ తమ గోత్రనామాలు చెప్పుకుని జమ్మి వృక్షాన్ని పూజ చేసి మూడు ప్రదక్షిణలు చేస్తారు.

దేవీ ఉపాసకులు అంతవరకు తాము చేసిన జప సంఖ్య ననుసరించి తగువిధముగా హోమాలు చేస్తారు. నవరాత్రి వ్రత సమాప్తి గావించిన వారికి సర్వ సిద్ధులు, సర్వాభీష్ట సిద్ధి కలుగుతుంది. **శుభం భూయాత్.**

ధారావాహికం



# శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

## పదునారవ అధ్యాయము

## వైష్ణవ లక్షణ తత్త్వప్రబోధములు

శ్రీ భగవద్రామానుజుల వారు, దేహ త్యాగము చేయక మునుపే, తన శిష్యులలో నొకరికి వైష్ణవ పీఠాధిపత్యము నీయవలయునని తలచి, శ్రీ పరాశర భట్టార్యుడను పిలచి, ఒప్పించి, తన తదుపరి వైష్ణవమును, వైష్ణవ తత్వమును వ్యాప్తి చేయవలెనని ఆదేశించెను.

కొంతకాలమునకు శ్రీరామానుజుల వారు దేహపరిత్యాగము చేసిరి, శ్రీగురువుల ఆజ్ఞ ప్రకారము, పరాశర భట్టాచార్యుల వారు శ్రీరంగమున నివసించుచూ, తనకు అప్పగించిన కర్తవ్యములను నిర్వహించసాగెను.

ఒకసారి శ్రీరామానుజుల వారు, దేహ పరిత్యాగమునకు మునుపు, పరాశర భట్టార్యులను, ఒక ఉద్దండ పండితుని లేదా వేదాంతిని, వాదమున జయించుటకు శ్రీరంగం నుండి పంపగా, దారిలో, అనంతాళ్వాన్ జన్మస్థానమగు శిఖబత్తూరు చేరుకునెను. అప్పుడు అచ్చటనేయున్న అనంతాళ్వాన్ శ్రీ పరాశర భట్టార్యుల వారి కడకేగి , నమస్కరించి ''అస్మదీయ శ్రీవైష్ణవ కులప్రభో " యని (అనగా అసమాన ప్రతిభా పాటవములతో, శ్రీవైష్ణవ కులమునుద్ధరించ గలిగిన ప్రభుడా) పలికి, కౌగలించుకుని, తన ఒడిలో పరుండబెట్టుకుని, ఎండ, వానల నుండి కాపాడుచూ, సేవలు చేసెను. అపార జ్ఞాన సంపన్నుడు తానైననూ, తన గురువులకు ప్రియమైన వాడు పరాశర భట్టార్యుడు కనుక, తనకున్నూ, అతడు ప్రియమైన వాడే యని తలచి, వినమ్రుడై సేవలు చేసెను. వయస్సులో

పరాశర భట్టార్యుడు, తన కన్న చిన్నవాడని, తాను శ్రీగురునికి, శ్రీవేంకటాద్రీశునికి, ప్రీతిపాత్రుడనని కానీ, ఆనందాళ్వాన్ తన మనస్సున తలువలేదు చూచితిరా మన ఆనందాళ్వాన్ ఎంతటి వినయ విధేయుడో! నిగర్వియో!

అట్లే శ్రీ పరాశర భట్టార్యుల వారికి కూడా, అనంతార్యుడన్న మిక్కిలి ప్రేమ, గౌరవము, అభిమానము, అన్నింటికంటే ముఖ్యముగ, ఆతను, తన శ్రీగురుని ప్రియ, ప్రథమ శిష్యుడని, తిరుమలను, పుష్పమండపముగ తీర్చిదిద్ది, పుష్పమండపమను నామము గల తిరుమలకు సార్థక రూపమిచ్చెనని, వైష్ణవ తత్వలక్షణములు బాగుగా తెలిసిన వాడని, వేద విజ్ఞానగనియని, శ్రీరామానుజుల ద్వారా తెలుసుకుని యున్నందున, శ్రీ పరాశర భట్టార్యులు కూడా, అనంతాళ్వాన్‌ను అంతయే ప్రేమతో, వినయముతో, అభిమానముతో, గౌరవముగ చూచెడి వాడు.

వేయేల, తన గురువగు, శ్రీరామానుజుల వారికి, ఎవరెవ్వరన్న అభిమానమో, ప్రేమో, గౌరవమో, తానున్నూ వారియందరి ఎడ ప్రదర్శించి, పాటించి, తన గురుభక్తి, ప్రపత్తుల చాటుకునెడి వాడు అనంతాళ్వాన్.

ఇందుకు నొక చిన్న ఉదాహరణమును ఇచ్చట ఉటంకించెదను.

ఒకసారి, అనంతాళ్వాన్ శిష్యులతో కూడి, శ్రీగోదాదేవి జన్మస్థానమైన శ్రీవిల్లిపుత్తూరునకు పోయి, అచ్చోట శ్రీ గోదాదేవి, స్నానములాచరించిన, కోనేటిలో మునిగి తేలుచూ, చేతులతో ఏదో వెదుక మొదలిడ, అది చూచి సాటివారు, శిష్యబృందము ఏమి వెదకుచుంటిరని ప్రశ్నింప, అందుకు మన ఆనందాళ్వాన్, అయ్యలారా! నేడు నేను స్నానమాచరించు, ఈ కోనేటిన మన తల్లి శ్రీగోదాదేవి, అనునిత్యమూ తన చెలులతో కూడి, ఒంటినిండుగ పసుపు నలుగు నిడుకుని స్నానమాచరించెడిదియని, అట్టి పసుపు రేణువులు ఈ కోనేటి అడుగున చేరి ఎక్కడనో ఒక్కచోట ఇంతనొక్క రేణువైన, నా చేతలకు దొరుకునేమోయని, వెదుకుచుంటినని పలుక, అచ్చట నున్న వారెల్లరూ నిశ్చేష్టులయి, ఆహా! ఈ అనంతాళ్వాన్‌కు ఎంతటి గురుభక్తి, గురువు నోటి నుండి వెలువడేటి శబ్ద వాక్యములన్న ఎంత గురి యనుకునిరి.

ఇది యదార్థముగ జరిగిన సంఘటన యనుటకు, తిరునారాయణపు ఆయ్ అను వారు వ్రాసిన గ్రంథము నందు, తిరుప్పావైయందు బుజువులు గలవు.

కనుక శ్రీగోదా, రంగనాథుల వారన్న, తన గురవగు శ్రీరామానుజుల వారి కెంత ప్రీతియో, మన అనంతాళ్వాన్‌లకు, శ్రీగురుడగు రామానుజ యతీంద్రుల వారన్న అంతకు మించి ప్రీతి.


ఇక్కడ మనకొక సందేహము కలుగవచ్చు. అది ఏమన, అనంతాళ్వాన్ యన్న శ్రీరామానుజుల వారికిన్నీ, శ్రీరామానుజులన్న అనంతాళ్వాన్ వారికిన్ని అంత అవినాభావ, అవిభ క్త సంబంధము ఉండ, మరి శ్రీగురువు, పరాశర భట్టార్యులకు ఇచ్చిన తన ఆచార్య పీఠమును, అనంతాళ్వాన్ లకు ఏల ఇవ్వలేదని.

దీ నికి సమాధానము, మనము సరిగా యోచించిన మ నకే జవాబు దొరుకును. అది ఏమనగా ముందుగ మ నము యోచించవలసినది, వారి వారి జన్మ రహస్య కర్తవ్య పాలనలు. శ్రీ రామానుజుల వారు, శ్రీ అనంతాళ్వాన్ ఇద్దరునూ, శేషాంశ సంభూతులైననూ, ని ర్వర్తించవలసిన కర్తవ్యములు వేర్వేరు. శ్రీరామానుజుల వారు ఉద్భవించినది, శ్రీ వైష్ణవ మత సిద్ధాంతముల, తత్వముల ప్రచారము గావించుచూ, జ్ఞానోపదేశముల చేయుచూ, వైష్ణవ ఆలయముల జీర్ణోద్ధారణముల గావించి, వానికి పునర్వైభవము చేకూర్చుచూ, ప్రపంచ వ్యాప్తముగ విశిష్టాద్వైత సిద్ధాంతమును పాదుకొల్పి, జనుల తరియింప చేయుటకు.

శ్రీ అనంతాళ్వాన్ ల వారి కర్తవ్యము, గురు, శిష్య, దైవ సంబంధములను విధిగ తానే పాటించి, లోకానికి వెల్లడించుట, గుర్వాజ్ఞ పాలనా ప్రాముఖ్యము, దాని వలన ఒనకూడు మోక్ష ఫలము, దైవకైంకర్యములు చేసి, దైవానుగ్రహము పొంది, శాశ్వత దైవస్థానమును పొందుట.

ఇంకొక కారణమేమన, శ్రీగురు ఆజ్ఞా పాలితుడై, అనంతాళ్వాన్ , తిరుమల చేరి, పుష్పోద్యానముల ఏర్పాటు చేసి, అ ను నిత్యము పుష్పకైంకర్యముల ఆనందనిలయునికి, తానే స్వయముగ చేయుచూ, మదిన శ్రీ వేంకటాద్రీశుని ఎడల విపరీతమగు ప్రేమను పెంచుకొనుట చేతనూ, అట్లే, అనంతాళ్వాన్ల ఆవశ్యకత తిరుమలకెంతయో గలదని, తెలిసియున్న శ్రీరామానుజులవారు, శ్రీరంగమున తన చెంతయున్న శ్రీపరాశర భట్టార్యులకు తన స్థానమొసంగి, లోక కళ్యాణార్థమై ఇట్లు చేసితిరే తప్ప, ఇందులో ఇంకొక మర్మము మేమియునూ లేదు.

అట్లే, అనంతాళ్వాన్ , తన అల్లుడగు, శ్రీనివాసుని వీడి, తాను మనుగడ సాగించలేనని, దృఢ చిత్తుడై ధ్రువరక్షకుని, శ్రీవేంకట నారాయణుని, తన అవసాన దశలోనే కాక, ఆపైన కూడా తాను తిరుమల వీడి యుండలేనను, సంగతి తెలిసి యున్నవాడైనందున, తానెప్పుడూ గురుస్థానమధిరోహించ ఆశించలేదు. సిద్ధమును కాలేదు. పైగా తన గురువగు, శ్రీరామానుజుల వారికి తెలియదా? ఎవ్వరికి, ఏ పదవీ, స్థానములీయవలయునో, తన గురువు నిర్ణయమే తనకు



శిరోధార్యమని తలచి, అట్లే ప్రవర్తించి, మనుగడ సాగించెను.

ఒకరోజు శ్రీ పరాశర భట్టార్యుని, శ్రీరామానుజుల వారు పిలచి, తనతో తోడ్కొని పోయి, శ్రీరంగనాయకీ దేవేరికి, భట్టార్యులను చూపి, అమ్మా! ఈతడు నీ దత్తపుత్రుడు, నా తదుపరి, నా స్థానమునధిరోహించగల సమర్థుడు, కావున ఈతనిని నీవు కాపాడుచుండవలయునని ప్రార్థించ, ఆ దేవదేవి, శ్రీరంగనాయక దేవేరి, 'సరి' యని పలికె. అంతటి ప్రజ్ఞాపాటవ ధీరుడీ శ్రీ పరాశర భట్టార్యులు.

తదుపరి శ్రీరామానుజుల వారి ఆదేశానుసారం, ఆనందాళ్వాన్‌తో కలసి, పశ్చిమ దేశముననున్న 'వేదాంతి' యను నామముగల ఘనాపాటిని వాదమున జయించి, అతనిని, శ్రీవైష్ణవునిగ మార్చి, తన శిష్యునిగ స్వీకరించి, వెనుతిరిగి, శ్రీ పరాశర భట్టార్యులు, శ్రీరంగమునకు, అనంతాళ్వాన్ శిఋబుత్తూరు చేరుకునిరి.

అనంతాళ్వాన్, పరాశుర భట్టార్యుల కలయికకు గుర్తుగా, అనంతా ళ్వాన్ జన్మస్థలమగు శిఋపుత్తూర్ (దీనినే నేడు కిరంగనూ ర్ అనుచున్నారు) మైసూరు సమీపమున గల శ్రీరంగపట్టణంకు సుమారు 3 కి.మీ. దూరములో, మేల్‌కోట వెళ్లు మార్గములో కలదు) నందు, ఒక ఆనందాళ్వాన్ ఆలయమును అట్లే శ్రీపరాశర భట్టార్య పుష్కరిణియను నామముతో ఒక పుష్కరిణిని నిర్మించి, అనుదినము, అచ్చట అనంతాచార్యులను ఒక బ్రాహ్మణోత్తముడు, వేద విదుడు, పూజ, నైవేద్యాది కైంకర్యములను చేయుచున్నాడు. అంతియేగాక, తిరుమలలోని, అనంతాళ్వాన్ తోటలో, అనంతాళ్వాన్ వారి వంశస్థులు (26వ తరము) ప్రతి సంవత్సరము, వైభవోపేతముగ అనంతాళ్వాన్ జయంతిని జరిపిన పిమ్మట అనంతాళ్వాన్ జన్మస్థలమున కూడా, అనంతాళ్వాన్ జన్మదిన వేడుకలు వైభవముగ జరుపుచున్నారు.

అనంతరము, శ్రీపరా శర భట్టార్యుల చేతిలో చిత్తుగ ఓడిపోయిన 'వేదాంతి' (నంజియార్) విరక్తచిత్తుడై, సంపాదించిన సొమ్మును 3 భాగము ల చేసి, తన ఇద్దరి భార్యలకు సమా నముగ పంచి, తనకడ నొక భాగమునుంచుకుని, సన్యాసము స్వీకరించి, శ్రీరంగమునకు పోవుచూ, దారిలో శిఋబుత్తూరు వచ్చి, అనంతాళ్వాన్‌కు సాష్టాంగ ప్రణామము చేయ, అనంతాళ్వాన్ పక, పక నవ్వుచూ ఏమయ్యా నంజియార్ (వేదాంతి), ఎవ్వరు చెప్పిరయ్యా! నీకు శ్రీ వైష్ణవము తీసుకున్న సన్యసించి, ఆశ్రమముల, దే శాటనములు చేయమని, లేకున్న, నీకు మోక్షము లభియించదని, చూడు! నీకేగాక, వైష్ణవులెల్లరికి మో క్షము లభియించు మార్గము నొక్కటే. అది ఏమన చెమట పట్టిన స్నానము చేయుచూ, ఆకలి వేసిన భుజియించుచూ, ఒంటికి బట్టిన మురికినెట్ల శుద్ధి చేసుకుందుమో, అట్లే మనస్సుకు పట్టిన మాలిన్యముల ఎప్పటికప్పుడు తొలగించుకొనుచూ, భవజలధిన ఈదుచూ, నమ్మిన వారి, వారి గురువుల పాద పద్మములను వదలక, శ్రీమన్నారాయణుని 'ఓం నమో నారాయణాయ' యను అష్టాక్షర మంత్రమును, అనుక్షణము అంతరంగమున తలయుచూ, జపియించుచూ, గురుపాద సేవ, అష్టాక్షర తిరుమంత్రముల ఆదమరువక చేయూచూ, వాని వలన కలుగు ఆత్మజ్ఞానమును, చేజిక్కించుకుని, ఇహపరమోక్షముల సాధించి, తరయించవలెను. అర్థమయినది కదా? వెళ్లు, వెళ్లి శ్రీరంగముననున్న నీ శ్రీగురుడగు పరాశర భట్టార్యుల పాదములే శరణమనుచూ, పట్టి శ్రీమన్నారాయణుని 'ఓం నమో నారాయణాయ' అష్టాక్షర నామమంత్రము చేపట్టి తరియించమని ఆ నంజియార్‌ను (వేదాంతిని) ఆశీర్వదించి శ్రీరంగమున పరాశర భట్టార్యుల పదసన్నిధికి పంపెను.

చూచితిమి క దా! అనంతాళ్వాన్లు చెప్పిన అనంత జ్ఞాన సంపద నిధి వాక్యపు రాశులను మనమూ అవ్విధముగా

పాటించి, తరియింపవలెను. జీవిత పరమపద సోపానము ఆటలోని పావులమై, పాపకర్మముల చేయుచూ, పాములనబడెడి అరిషడ్వర్గపు విషపునోళ్లబడి, క్రిందకి జారక, అనంతార్యులు చెప్పిన విధముగ నొక సద్గురువు నెంచుకుని, సద్గురు పాద పద్మముల పట్టి, సేవించుచు సదా శ్రీ వేంకటేశ్వరుని 'ఓం నమో వేంకటేశాయ' యన్న అష్టాక్షర మంత్రము చేబట్టి, ఆదమరువక అలుపు, సొలుపులు లేకుండా, అంతరంగమున, నిరంతర నామస్మరణ సాధన చేయుచూ, అనంతాళ్వాన్ తోట చేరి, అలవైకుంఠపురపు శ్రీనివాసుని, శ్రీవిష్ణుని పదముల చెంత చేర్చ సిద్ధముగ నున్న అనంతాళ్వాన్ యనెడి సద్గురు పాదముల బట్టి సేవించుచూ, భవజల ధిని దాటించు, పురిశైవారి తోట (అనంతాళ్వాన్ తోట)లో వేసియుంచిన నిచ్చెననెక్కి, నిశ్చలమనస్కు లమయి, నిష్కాముకులమయ్యి, శ్రీ వైకుంఠ ధామమును చేరుదము.

ఇక ఈ అధ్యాయములో అనంతాళ్వాన్, పరాశర భట్టార్యుల శిష్యునికి వైష్ణవత త్వము, వైష్ణవ లక్షణముల వివరించిన తీరు అత్యద్భుతము, అవ్విషయము ఎట్టిదో చూతము.

ఒకసారి ఒకానొక శ్రీవైష్ణవుడు, పరాశర భట్టార్యులకు ప్రణమిల్లి, గురుదేవా నేడు నాకు మీరు శ్రీవైష్ణవ లక్షణముల బోధించవలయును. అట్లే శ్రీవైష్ణవుడుయన్న వాడు ఎట్లు జీవించవలయును, నిజమగు శ్రీవైష్ణవుని లక్షణములెట్లుండును మున్నగు విశేష విషయములను బోధించమన్న అందుకు, పరాశర భట్టార్యుల వారు నవ్వి, ఓయీ! శ్రీవైష్ణవ శిష్య శిఖామణి, నీవు ఒక పని చేయుము. అది ఏమన నీవు వెంటనే తిరుమల చేరి అచ్చోట తిరుమలేశునికి పుష్పకైంకర్యముల నిర్విఘ్నముగ చేయుచున్నటి శ్రీమాన్ అనంతాళ్వాన్‌ను ఆశ్రయింపుము. వారు నీకు సవివరముగ బోధించుదురని పలికి ఆశీర్వదించ ఆ శ్రీవైష్ణవుడు తిరుమల బయలుదేరెను.

ఆ శ్రీవైష్ణవుడు, వేంకటాచలమునకు చేరి, అనంతాళ్వాన్ ల వారిని దర్శించి, సాష్టాంగ దండ ప్రణామములాచరించి, తాను శ్రీరంగం నుండి శ్రీ పరాశర భట్టార్యుల వారు పంపగా వచ్చితినని, తనకు శ్రీ వైష్ణవ తత్వలక్షణ బోధల చేయమని అర్థించ, అందుకు అనంతాళ్వాన్ , సరియే నీకు బోధింతును, సవివరముగ అర్థవంతముగ వివరింతును. కానీ నీవు కొంతకాలము ఇక్కడే యుండవలెనని పలుక, దానికి ఆ శ్రీవైష్ణవుడు సమ్మతించెను. ఇట్లు 6 నెలలు కాలము కడచెను.

ఒకానొక రోజు అనంతాళ్వాన్ శ్రీ వైష్ణవుని పరీక్షించదలచెను. అం దులకై అనంతా ళ్వాన్ ఒక విందుభోజనమునకు ఏర్పాట్లు చేయించెను.

ఆ రోజులలో అనంతాళ్వాన్ల తోటన నిత్యాన్నదానము, సంతర్పణలు వేదగోష్టి, వాదములు అనునిత్యము జరుగుచుండెడివి. వారి వారి జ్ఞాన యోగ్యత ఉత్తీర్ణతలను బట్టి, తరగతి శ్రేణిని బట్టి, వరుస క్రమమున స్థాన నిర్దేశితము చేసి ఆ ప్రకారముననే పంక్తిన కూర్చుండగ చేసి వారికి వడ్డనలు మర్యాదలు జరిగెడివి. దీనిని అంతయూ ఆ శ్రీవైష్ణవుడు, అనునిత్యము గమనించి, అనుసరించి, గురువు ఆజ్ఞానుసారము, తనవంతు వచ్చు వరకు వేచి చూచి, తన వంతు వచ్చిన పిమ్మట తనకు కేటాయించిన స్థానమున కూర్చుని విందారగించెడివాడు.

విందు భోజనమునకు ఏర్పాట్లు పూర్తవ్వగనే, ఎన్నడూ లేని విధముగ ఆనాడు శ్రీవైష్ణవునికి ఆకలి బాధ మొదలాయెను. అందువలన అతడు వెళ్లి మొదటి పంక్తిలోన కూర్చుండ నీవీ మొదటి పంక్తి అయిన పిమ్మట భుజియించమని అనంతాళ్వాన్ పలుక, అతడు సరియేయనుచూ తిరిగి రెండవ పంక్తిలో కూర్చుండగనే మరల అనంతాళ్వాన్ తదుపరి పంక్తిన కూర్చుండి భుజియించమని పలుక, ఆ శ్రీవైష్ణవుడు అట్లే చేసెను. మూడు, నాలుగు, ఐదు పంక్తులలోను అతనిని అనంతాళ్వాన్ అట్లే ఆదేశించ, ఆకలి బాధించుచున్ననూ, గుర్వాజ్ఞ పాటించుటయే తనకు ముఖ్యమని తలయుచూ కించిత్తైన చింతించక అనంతాళ్వాన్‌ల ఆజ్ఞను కిమ్మనక పాటించసాగెను.

ఇది చూచి అనంతాళ్వాన్ సంతసించి సంతృప్తి చెంది క డ పటి పంక్తిన శిష్యుడను తన ప్రక్కనే కూర్చుండ బె ట్టుకుని కొసరి కొసరి తానే వడ్డనల చేయుచూ తానునూ భు జి యించెను. భోజనానంతరము కార్యక్రమాదులనన్నింటిని ముగియించుకుని, శ్రీవైష్ణవుడను పిలచి, నీవు శ్రీరంగం నుండి వచ్చి 6 నెలలాయెను. నీకిక చెప్పుటకు ఏమియునూ లేదు! నీవు పోయి నీ గురువగు శ్రీపరాశర భట్టార్యుల సేవించుకొనుచూ, తరియింపమని అనంతాళ్వాన్ పలుక, అందులకు ఆ శ్రీవైష్ణవుడు అయ్యా! వైష్ణవ లక్షణముల, మీరు నాకు ఇంకనూ బోధించలేదని, నీళ్ళు నములుచు నిలుచుండ, శ్రీవైష్ణవా! అయితే వినుము ముఖ్యమైన శ్రీ వైష్ణవ లక్షణములు మూడే మూడు. అవి ఏమన కొంగ, కోడి, ఉప్పు, వీని తత్వార్థ సారమెరిగి మెసలిన, నీవే నిజమగు వైష్ణవ శిఖామణియగుదువు. ఇక పొమ్ము, పోయి నేనేమి చెప్పితినో, అట్లే భట్టార్యుల వారికి చెప్పుము. ఆయన నీకు తత్వార్థముల బోధించును, వానిని క్షుణముగ విని, అందులోని తత్వార్థసారముల గ్రహించి, నిజమగు శ్రీవైష్ణునివోలె జీవించి, అంతిమమున, శ్రీవిష్ణుధామము చేరుమనుచూ, ఆతనిని శ్రీరంగమునకు పంపివైచెను.

శ్రీరంగం చేరిన శ్రీవైష్ణవుడు పరాశర భట్టార్యుల వద్దకేగి, అనంతాళ్వాన్ తోటయందు అనంతాళ్వాన్ వారి సాంగత్యము, ఆదరణ, జ్ఞాన బోధనలు తనకెట్లు జరిగెనో, తెలిపి, గురుదేవా!

మీ వద్దకు పోయి, తాను చెప్పిన మూడు శ్రీవైష్ణవ లక్షణములు అనగా కొంగ, కోడి, ఉప్పుయను వాని అర్థముల బోధించమని, దానిలోని తత్వార్థ రహస్యామృత పానమును తనచే ద్రావించమని, కృతార్థుడ చేయమని వేడ, ఆనంద భరితుడయ్యి శ్రీపరాశర భట్టార్యులు ఈ విధముగ చెప్పిరి.

**1. కొంగ**

(అ) ఏ విధముగ కొంగ జలాశయముల లేదా నీరు సమృద్ధిగనున్న ప్రదేశముల సంచరించునో, అట్లే శ్రీవైష్ణవుడను వాడు, తీర్థముల కడ, జలము సమృద్ధిగా నున్న ప్రదేశముల మాత్రమే సంచరించ నేర్వవలయును.

(ఆ) ఏ విధముగ కొంగ తెల్లని స్వచ్ఛపు రంగు శరీరముతో సంచరించుచుండునో, అట్లే శ్రీవైష్ణవుడు, లోన, బయట, స్వచ్ఛమైన మనస్కుడై, సచ్ఛీలపు గుణములతో యుండవలయును.

(ఇ) కొంగకు ఆకలి వేయుచున్ననూ, చిక్కిన చిరు చేపలనెన్నింటినో తిని, తన ఆకలి తీర్చుకొన చూడక, ఒక్కసారిగ పెద్ద చేప చిక్కిన వెంటనే, నోటపట్టి, గుటుక్కున మింగి, తన ఆకలి తీర్చుకునునో, అట్లే శ్రీవైష్ణవుడు తన చుట్టూ చేరేటి జనుల పట్టించుకునక, తన ఆత్మకు పట్టియున్న జన్మజన్మల మాయామోహపు తెరల తొలగింప చేసుకొనుచూ, ఆత్మానందము కలుగ చేయు, మహాత్ముని లేదా గురువును వెదుకుచూ, దొరికిన వెంటనే ఆతనిని, ఆశ్రయించి, సేవించి, ఆతడు చేసేటి తత్వార్థ బోధనా సారముల గ్రహించుచూ, పాటించుచూ, సేవించి, అంత్యకాలమున దేహము విడుచు వరకూ అమ్మహనీయుని సఖ్యతను విడువరాదు.

(ఈ) ఏవిధముగనైతే కొంగ మెరుపు, పిడుగుల భయపడి, ఇంకొక ప్రశాంత జలాశయము చేరి సుఖముగ నుండునో, అట్లే శ్రీవైష్ణవుడను వాడు, అర్హమైన ప్రశాంతమైన ఒక దివ్య దేశమును చేరి, నివాసముగ చేసుకుని, భక్తి ప్రపత్తులతో శ్రీమన్నారాయణుని మదిన మరువక వెరవక తలయుచూ కొన ఊపిరియున్నంత వరకు జీవించవలయును.

**2. కోడి**

కోడి ఏవిధముగా, పెంటకుప్పల, మట్టికుప్పల కెలకుచూ వాటిలో గల సారవంతమగు పదార్థముల తాను గ్రహించి, మరల దానిలో పోషకములధికముగ నున్నదానిని వేరుపరచి, తన పిల్లలకు తినుపించునో, అట్లే, గురువు కూడా వేదశాస్త్రముల మధించి అందలి వేదాంతసారమును గ్రహించి, మరల మరల సంసార భవజలధిన క్షణక్షణము చిక్కుకొన చూచేటి తన శిష్యులకు ద్రావించుచూ, తినిపించుచూ, జనన, మరణ చక్రభ్రమణముల తప్పించేటిదియగు శ్రీచక్రధారుని, శ్రీమన్నారాయణుని అష్టాక్షర మంత్రం "ఓం నమో నారాయణాయ"మరిగింప చేసి, మరువనీయక పఠియింపచేసెడి, శ్రీగురుని సేవాతత్పరతనే, నీకు శ్రీఅనంతాళ్వాన్ వారు చెప్పి పంపిరి. దానిని పాటించి పరిణతి సాధించి, పరమ పదము నొంది శ్రీవిష్ణు పద కమలముల చేరువాడే నిజమగు శ్రీవైష్ణవుడు.

**3. ఉప్పు**

ఉప్పు ప్రాముఖ్యతను గూర్చి ప్రత్యేకముగ చెప్ప పనిలేదు. ఏలయన వంటకముల రుచి కొరకు మనము ఉపయోగించెడి ఉప్పు పరిమాణమును బట్టి వ్యంజనముల రుచి మారిపోవుచున్నట్లే, శ్రీవైష్ణవుడు వెగటు సంసారము పట్ల సమతుల్యత కలిగి, లాభము వచ్చిన సంతోషించక, నష్టము వచ్చిన దుఃఖించక, సమశీతోష్ణస్థితుడై, శత్రు, మిత్రులని భేదము చూపక, సంచరించుచూ తన శ్రీగురుని పాదసేవలతో పావనమవ్వవలెను.

అట్లే ఎవ్వరేని మహాభాగవతుని ఇంటకు పోయి, భగవన్మందిరమును దర్శించి, ఆ భాగవతోత్తముడు సూచించిన స్థలమునందు, సమయము నందు, మానావమానముల లెక్కించక, నిగర్వియై, ఆతడు పెట్టిన లేదా పంచిన తీర్థ ప్రసాదములు స్వీకరించి మిక్కిలి వినయశీలుడై మెసలవలయును.

ఇవియే నిజమగు శ్రీవైష్ణవ లక్షణములని, తత్వార్థమని శ్రీ పరాశర భట్టార్యులు అక్కడేయున్న శ్రీవైష్ణవునితోపాటు, తన తక్కిన శిష్యులకు గూడా అనంతాళ్వాన్ చెప్పి పంపిన వైష్ణవ తత్వార్థ సారామృతమును ద్రావించి సంతసింపచేసి ఆ శ్రీవైష్ణవుని ఆశీర్వదించి అట్లే పాటించి తరియించుమని పలికెను.

నాడు ఆనం దాళ్వాన్ శ్రీపరాశర భట్టార్యుల ద్వారా శ్రీవైష్ణవునకు ద్రావించిన శ్రీవైష్ణవ లక్షణ తత్వార్థ సారాంశముల అందలి సారముల గ్రహియించి నేడు మనము ద్రావుట నేర్చి మనలో అంతర్లీనముగ దాగియున్న నిజమగు శ్రీవైష్ణవ లక్షణముల పునరుద్ధరించుకుని, అనంతాళ్వాన్ లను గురువర్యునిగ స్వీకరించి, శ్రీమన్నారాయణుని, శ్రీవేంకటేశుని అష్టాక్షర మంత్రము "ఓం నమో వేంకటేశాయ" యని పరమ ప్రీతితో పలికి, మన గురువు పదసేవల చేయుచూ, ఆదమరువక, స్వప్న, సుషుప్తావస్థల యందు కూడ, శ్రీ గోవిందుని నామస్మరణల భజనల శ్రీవేంకటేశ్వరుని సంకీర్తనముల ఆపక చేయుచూ అంత్యకాలమున శ్రీవేంకటేశ్వరుని దివ్యపద కమలముల చెంత చేరెదము.

**ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము**
**వైష్ణవ లక్షణ తత్వ ప్రబోధము యను పదునారవ**
**అధ్యాయము సంపూర్ణః**

ధారావాహికం

# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి (9550241921)

**"మా భీ ర్మందమనో విచింత్య బహుధా యామీశ్చిరం యాతనాః**
**నామీ నః ప్రభవంతి పాపరిపవః స్వామీ నను శ్రీధరః।**
**ఆలస్యం వ్యపనీయ భక్తిసులభం ధ్యాయస్వ నారాయణం**
**లోకస్య వ్యసనాపనోదనకరో దాసస్య కిం న క్షమః॥**

ఓ మంద మనసా! యమ యాతనలను పలురకాలుగా భావించి భయపడకు, ఆ శత్రువులు మనల్ని ఏమి చెయ్యలేరు. శ్రీధరుడు కదా మనకు స్వామీ! భక్త సులభుడు అగు శ్రీమన్నారాయణుడిని ఆలస్యము చేయకుండా ధ్యానించుము. లోకములో ఉండే సమస్త వ్యసనములను పోగొట్టువాడు దాసుడిని సరిదిద్దలేడా?

''కులశేఖరాళ్వార్లు నిరంతరం పరమాత్మను స్మరించమని వారి దివ్య పాదముల వద్ద వదులుతున్నాను అని అక్కడ రక్షణ, సౌఖ్యము అన్ని కలుగుతాయని చెప్పగా మనస్సుకు కొంత ధైర్యం కలిగింది కానీ సంపూర్ణ నమ్మకం కలగలేదు.''

అలా చేరిన మనస్సుకు కలిగిన భయములేంటంటే 'బహుధా యామీశ్చిరం యాతనాః' ఓ కులశేఖరా నేను దుష్టుడను, నన్ను నమ్మితే నువ్వు కుంభీపాకం అనే దాని పడతావు, చెడిపోయిన నాకు సుఖము లేదు, అంతేకాక నన్ను నమ్మిన నిన్ను నరకంలో పడేస్తే నీతో పాటు నేను రావలసిందే అంటూ భయము కలుగుతోందట.

కులశేఖరాళ్వార్లు 'మాభీర్మందమనో విచింత్య' కొంచెము కూడా జ్ఞానం లేని మనసా! నువ్వు అవన్నీ తలుచుకుంటూ కాలాన్ని వ్యర్థం చేయకు, అసలు నాకు నరకం అనేది వస్తే కదా నువ్వు నాతో నరకానికి వచ్చేది. నేను వెళ్లే స్థలము అత్యంత ఆనంద దాయకమైనది కాబట్టి నువ్వు కూడా సుఖపడతావు. నేను చెప్పేది నీ హితముకై అని భావించవచ్చు కదా! నిన్ను వెళ్ళమంటున్నది నీవు జన్మించిన స్థానముకే నిన్ను నియమించిన పరమాత్మ అయిన ప్రభువు వద్దకే కదా! దేని మీద నీ అనుమానము?

'నామీ నః ప్రభవంతి పాపరిపవః' పాపములు అనే శత్రువులు నేను హరి స్మరణలో ఉంటే మళ్ళీ నన్ను మార్చి నరకములో పడేయడానికి (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే శత్రువులు) ప్రయత్నిస్తారు, నన్ను అలా తిరిగి లౌకిక వాంఛలవైపు ఈడుస్తే ఎలా? ఓ అదా నీ భయం 'స్వామీ నను శ్రీధరః' –మనసా! మన వెంట ఉన్నవాడు సామాన్యమైన వాడనుకుంటున్నావేమో! శ్రీధరుడు మన అందరికి తల్లి అయినా అలాగే మన పాపములను దాచి మనల్ని మార్చి పురుషాకారం వహించే లక్ష్మి దేవిని తన యొక్క వక్షస్థలములో కలిగినటువంటి పరమాత్మ, కాబట్టి అక్కడ అంతా సుఖమే ఉండును భయములకు తావులేదు.

పరమాత్మకు మనము ఏమి ఇవ్వాలని అంటావేమో 'ఎప్పుడైనా పెద్దల వద్దకు వెళ్తుంటే వట్టి చేతులతో వెళ్ళకూడదు అనే నియమమున్నది అలా అని ఏదిపడితే అదికాకుండా వారికి ప్రియమైనది ఇస్తే వారి అనుగ్రహం మనయందు ఉంటుంది. మరి పరమాత్మకు ప్రీతి కలిగేది ఏముంటుంది అంటే మన యొక్క నిస్వార్థమైన భక్తి. దాన్ని ఇస్తే చాలుట పరమ ప్రీతితో దగ్గరకు తీసుకుంటాడు'.

''ఆలస్యం వ్యపనీయ భక్తుసులభం ధ్యాయస్వ నారాయణం''ఇంకా ఆలస్యం చేయకుండా ఇతరమైన విషయములను విడిచి పరమాత్మ యొక్క గుణములను స్మరించు చక్కటి జ్ఞానం కలుగుతుంది. మనము ఇతరములను త్యజిస్తే మనము వెళ్లనవసరము కూడా లేకుండా ఆయననే మన హృదయాంతరముల యందు ప్రవేశించి వసించును. భక్తులకు ఎలాంటి శ్రమలు కలిగించడానికి ఇష్టపడడు అతడే శ్రీమన్నారాయణుడు. అంతటా వ్యాపించి, వహించి, ప్రకాశింప చేయువాడు కాబట్టి నారాయణుడు.

''గామావిశ్య చ భూతాని ధారయా మ్యహమోజసా
పుష్ణామి చౌషధీ స్సర్వా స్సోమో భూత్వారసాత్మకః అన్నట్లు పురుషోత్తముడు ఆయనే.

అటువంటి పరమాత్మ వద్ద 'లోకస్య వ్యసనాపనోదనకరో దాసస్య కిం న క్షమ' మేము నీ దాసులం అని వారి దివ్యపాదములపై పడితే చాలు ఏమి చూడకుండా కాపాడడానికి సిద్ధముగా ఉండేవాడు. అంటూ కులశేఖరాళ్వార్లు మనస్సును సిద్ధము చేసుకోవలసిన రీతిని చెబుతూనే నెపంగా ఉంచి పరమాత్మ యొక్క వాత్సల్య గుణాలను ప్రకాశింపచేస్తున్నారు.

నిజంగా పరమాత్మ ఎంత వాత్సల్య గుణాలు కలిగినవాడు అంటే! తన వాత్సల్యంతో సమస్త జీవులను తరింపచేసి, తనలో ఐక్యం చేసుకునేంత. ఆ పరమాత్మ వాత్సల్యానికి దేవతలు, రాక్షసులు, ఋషులు, మానవులు, పశువులు, పక్షులు, క్రిమి,

కీటకాలు అందరూ అర్హులే. అలా తరించిపోయిన ఒక జీవే! ఏకాదశి ఉపవా సం ఆచరించే ఏనుగు – గురువాయూర్ కేశవన్.

దక్షిణ భారతదేశపు ప్రాచీన హిందూ దేవాలయాలలో ఆలయ సేవలలో గజరాజ వాహన సేవ గొప్పదిగా చెప్పవచ్చు. ఎన్నోదక్షిణాది దేవాలయాలలో ఇప్పటికి ఏనుగులను ఆలయాల్లో కైంకర్యాలకి వినియోగించుట అనాదిగా ఒక ఆచారంగా వస్తోంది. ముఖ్యముగా దక్షిణాదిన కేరళలోని ప్రాచీన ఆలయాల్లో గజరాజులపై భగవంతుని మూర్తులను ఊరేగిస్తారు. ఇలా ఆలయ కైంకర్యాల్లో పేరు మోసిన ఏనుగుల్లో గురువాయూర్ క్షేత్రంలో వెలసిన శ్రీకృష్ణునికి డెబ్బై సంవత్సరాలకు పైగా ఉత్సవాలలో వాహన కైంకర్యాలు నిర్వర్తించిన 'కేశవన్' అనే ఏనుగు ఏనుగులకే రాజుగా 'గజరాజు'గా పేరొందింది.

అన్ని ఏనుగుల కెల్ల భిన్నమైన ఈ ఏనుగు ప్రత్యేకత ఏమిటంటే, కేశవన్ ఎవ్వరు చెప్పకపోయినా ఏకాదశి పర్వదినాన్ని గుర్తుపెట్టుకుని, ప్రతి ఏకాదశికి పూర్తి ఉపవాసం ఉంటుంది ! తనపై గురువాయూర్ కృష్ణుని ఉత్సవమూర్తిని మొయ్యడానికి తనకు తానే స్వయంగా వంగి కూర్చుని తన భక్తి శ్రద్ధలను చాటే ఈ ఏనుగు గొప్పతనం తెలుసుకుందాం.

పూర్వం గురువాయూర్ని పరిపాలించే నిలంబూర్ రాజు త న రాజ్యంపై తరచూ శత్రురాజులు దండెత్తి రావటంతో భ గ వంతుడైన గురువాయూర్ కృష్ణుని ప్రార్థించగా శత్రు దం డయాత్రలు క్రమంగా తగ్గిపోయాయట! దానికి కృతజ్ఞతగా 19 2 2లో నిలంబూర్ రాజ వంశీయులు గురువాయూర్ ఆస్థానానికి పది ఏనుగులను దానమిచ్చారట! వాటిలో పదేళ్ల వయస్సు గల కేశవన్ అనే ఏనుగుపిల్ల కూడా ఒకటి.

మిగిలిన ఏనుగు ల కంటే భిన్నంగా కేశవన్ అనే ఏనుగు ఉత్తమమైన గజ సాముద్రిక ల క్షణాలున్న మేలు జాతి గున్న ఏనుగు పిల్ల! చూడటానికి ఎంతో ముచ్చటగా ఉన్నా కేశవన్ విపరీతమైన అల్లరి చేష్టలతో ఎంతకీ మావటివాని మాటలు వినేది కాదు! ఇది ఎంతో కాలం ఇలాగే గడిస్తే ఏనుగుని నియంత్రించటం కష్టమని తెలసి అప్పటికి ఆలయంలో ప్రధాన గజమైన పద్మనాభన్ అనే ఏనుగు వద్ద కేశవన్ని పెట్టారట! అంతేకాక కృష్ణుడికి రోజూ నైవేద్యం పెట్టిన వెన్నని కేశవన్కి తినిపించేవారట!

భగవంతుని భుక్త శేష ప్రాశన ప్రభావమో లేక పెద్ద ఏనుగు వద్ద భయభక్తులతో ఉండాలనో కానీ కేశవన్కి అల్లరిచేష్టలు క్రమంగా తగ్గిపోవటమే కాక, భగవంతునిపై భక్తి కూడా పెరగనారంభించిందట! ఆలయ ఉత్సవాలకు భగవంతుని విగ్రహాలని మోసే ప్రధాన ఏనుగైన పద్మనాభన్ తోనే ఉంటూ భయభక్తులు, స్వయం నియంత్రణ, మావటివాడు చెప్పినవి పాటించటం వంటివి నేర్చుకుందట కేశవన్! ఇలా క్రమంగా తానూ ఆలయ ఉత్సవాలలో భాగమై మిగిలిన ఏనుగుల కంటే భిన్నముగా అత్యంత భక్తి, శ్రద్ధలతో నియంత్రణతో సద్బుద్ధితో మెలిగేదట కేశవన్!

కొన్నాళ్లకి పెద్ద ఏనుగైన పద్మనాభన్ పరమపదించగా, కేశవన్ ఆస్థాన గజంగా నియమింపబడింది! అప్పటి నుంచి కేశవన్లో మరింత పరిణతి, మార్పు వచ్చింది! రోజూ ఉదయమే స్నానం ఆచరించి మావటివాడు లేకుండా తానే స్వయంగా గురువాయూర్ ఆస్థానానికి వెళ్లి ఆలయానికి ప్రదక్షిణలు చేసి ధ్వజం వద్ద మోకరిల్లి ఘీంకరిస్తూ నమస్కరించేది! ఆలయంలోకి ప్రవేశించాక మౌనంగా నడిచేది, మలమూత్ర విసర్జన కూడా ఆలయ ప్రాంగణంలో చేసేది కాదట కేశవన్! ముఖ్యంగా ఆహారం విషయంలో అత్యంత శ్రద్ధ తనకు తానే వహించేదిట! ఆలయ ఉత్సవాల సమయంలో తక్కువగా తినేదిట!

తన జీవితాంతం ఏకాదశి నాడు పచ్చి మంచి నీళ్లు కూడా తాగకుండా పూర్తి ఉపవాసం ఉండేదిట! ఎన్ని పంచాంగాలు చదివినా నెలలో ఏకాదశులు ఎప్పుడు వస్తాయో సరిగ్గా గుర్తుండని మానవుల కంటే ఒక ఏనుగు ఏకాదశి ఎప్పుడు వస్తుందో సరిగ్గా గుర్తు పెట్టుకుని ఉపవాసం ఉండటం నిజంగా దైవ లీల, భగవంతునికి ఆ ఏనుగుపై ఉన్న దివ్యానుగ్రహానికి తార్కాణంగా చెప్పవచ్చు!

గురువాయూర్ ఆస్థానంలో ప్రతి ఏడాదీ కుంభ మాసంలో (ఫిబ్రవరి, మార్చి) ఏనుగుల పరుగు పందేలు జరుగుతాయి. ఆ పందెంలో వేగంగా, నియంత్రణతో పరుగెత్తి గమ్యానికి ముందు చేరుకున్న ఏనుగుని గురువాయూర్ ఆస్థాన అధికారులు, అర్చకులు సత్కరించి ఆ ఏడాది గురువాయూర్ కృష్ణుని ఉత్సవ మూర్తులను మోసే అధికారాన్ని ఇస్తారు. అయితే శ్రీకృష్ణునికి కేశవన్ మీద ఉన్న ప్రేమ ప్రభావమో ఏమో ఆ పందెంలో ఎన్ని ఏనుగులు పాల్గొన్నా ప్రతీ సంవత్సరం కేశవన్కే మొదటి బహుమతి వచ్చేది! అలా ప్రతీ సంవత్సరం ఉత్సవ మూర్తులను ఊరేగింపు చేసే భాగ్యం కేశవన్కే దక్కేది! అయితే ఒకటి రెండు సార్లు మాత్రం కేశవన్ ఆ పరుగు పందెంలో ఓడిపోవటంతో మరొక ఏనుగుకి ఉత్సవ మూర్తులను మోసే అవకాశం లభించింది. అప్పుడు భగవంతుణ్ణి తనపై ఊరేగింపు చేయరనే దిగులు కేశవన్కి బలంగానే నాటుకుంది.

ఆ బాధ తట్టుకోలేక గుడిలో జరుగుతున్న ఉత్సవంలో దేవుడి విగ్రహాలని మరొక ఏనుగు పైకి ఎక్కించే సమయంలో భయంకరంగా ఘీంకరిస్తూ గొలుసులు తెంచుకుని ఆస్థానంలోకి పరుగెత్తుకుని వచ్చేసి ఎవ్వరినీ ఏమీ చేయకుండా

మౌనంగా దేవుడి ముందు వంగి తనపై ఎక్కించమని వీపు చూపించిందట కేశవన్! ఇది పలుమార్లు జరగటంతో గురువాయూర్ ఆస్థానపండితులు ధర్మసంకటంలో పడి, మూగ జీవమైనా ఏనుగు కేశవన్ ప్రవర్తనకి ఆశ్చర్యపడి ''దైవ ప్రశ్న''అనే భగవంతుని ప్రశ్న అడిగి సమాధానం తెలుసుకునే ప్రక్రియ ఏర్పాటు చేశారట!

కేరళ ప్రాచీన జ్యోతిష్యంలో ప్రశ్నకాండకి పెట్టింది పేరు. ముఖ్యంగా తిరువనంతపురం, గురువాయూర్ వంటి ప్రాచీన క్షేత్రాలలో ధర్మసంకటములు, మానవ మాత్రులు పూరించలేని సమస్యలు ఎదురైనపుడు జ్యోతిషం ప్రకారం ప్రశ్నకాండని నిర్వహించి భగవంతుని ఆజ్ఞని నిర్ణయిస్తారు. దీనిన 'దైవప్రశ్నమ్' అంటారు. దీనికి తగిన మంచి రోజుని, శుభ ముహూర్తముని ముందుగానే నిర్ణయించి ఇద్దరు ఆస్థాన జ్యోతిష పండితులని ఆహ్వానిస్తారు. ప్రశ్నకాండలో భాగంగా నలుచదరంగా 12 గడులు గీసి ఒక అమ్మాయిని గాని, అబ్బాయినిగాని ఒక బంగారు నాణేన్ని ఆ గడుల్లో పెట్టమని చెబుతారు. అలా వారు నాణెం వేసిన గడిని బట్టి సంఖ్యాశాస్త్రం ఉపయోగించి తగిన లెక్కలు వేసి మన వేసిన ప్రశ్నకి భగవంతుడు ఇచ్చే సమాధానాన్ని నిర్ణయిస్తారు. ఇక గురువాయూర్ క్షేత్రంలో మిగిలిన ఏనుగులని ఉత్సవ మూర్తులని ఎత్తనివ్వకుండా చేసిన కేశవన్ విషయంలో ఇదే దైవ ప్రశ్నని ఆస్థాన పండితులు నిర్వహించగా ఆశ్చర్యంగా ''జీవితాంతం కేశవుడే నన్ను మొయ్యాలి''అన్న భగవంతుని వాక్కు వెలువడింది. అప్పటి నుంచి తన జీవితాంతం కేశవుడే గురువాయూర్ కృష్ణుడికి ఆస్థాన గజరాజుగా ఉత్సవ వాహకుడిగా తన జీవితాన్ని చరితార్థం చేసుకున్నాడు.

ఒకనాడు కేశవన్ని మావటివాడు పక్క ఊరికి తీసుకెళ్లాడు. అక్కడే చాలాసేపు కాలయాపన చేశాడు మావటివాడు. ఇటు ఆస్థానంలో స్వామి కైంకర్యానికి సమయం అయిపోతోందని గ్రహించిన కేశవన్ పలుమార్లు హెచ్చరించినా మావటివాడు పట్టించుకోలేదు. ఇక ఆగలేక కేశవన్ గొలుసులు తెంచుకుని రోడ్ల వెంబడి పరిగెత్తుతూ గురువాయూర్ వైపు వెళ్ళసాగింది. మావటి వాడు లేకుండా వీధుల్లో పరుగెత్తుతున్న ఏనుగుని చూసి జనాలు బెంబేలెత్తిపోయి చెల్లాచెదురుగా పారిపోయారు.

ఇంతలో ఒక కుష్టురోగి ఆ జన సందోహంలో ఎటూ నడవలేక మిగిలిన జనాలు తనని తోసేసి కింద పడేస్తే లేవలేక రోడ్డు మీదనే పడిపోయాడు. అటువైపు పరుగెత్తుకొస్తున్న కేశవన్ని చూసి జనాలు భయంతో ఆ కుష్టురోగిని ఎంత హెచ్చరించినా లేవలేని స్థితిలో ఉన్న అతను ఇక తాను చేసేది ఏమీ లేక ఏనుగు కాళ్ళ కిందపడి నలిగిపోతానని నిశ్చయించుకుని అలాగే కూర్చున్నాడు. ఇంతలో అతని వద్దకి వచ్చిన కేశవన్ ఆశ్చర్యంగా



అందరూ చూస్తుండగా ఆ కుష్టురోగిని తొక్కలేదు సరికదా అతని వద్ద ఆగి, అతణ్ణి జాగ్రత్తగా తన తొండంతో పైకెత్తి రోడ్డు పక్కన కూర్చోబెట్టి తన పాటికి తాను పరుగెత్తుతూ వెళ్ళిపోయింది. ఎంతు జంతువైనా భగవద్కైంకర్యంలో తలమునకలైన కేశవన్కి ఇంగిత జ్ఞానం మెండుగా ఉందని అనడగానికి ఇదో ఉదాహరణ!

మనుషుల చేత సాకబడే ఏనుగుల్లో స్వాభావికంగా మావటివాడి మాట వినే తత్వమే తప్ప స్వతంత్రంగా ప్రవర్తించే గుణం ఉండదు. కానీ గజరాజైన కేశవన్ ప్రవర్తన మాత్రం దానికి భిన్నంగా మనుష్యులలో తారతమ్యాలు కనిపెట్టి వారి వారి గుణాలని బట్టి ప్రవర్తించేదిట! ముఖ్యంగా ఉత్సవ సమయాల్లో కృష్ణుని విగ్రహంతో ఎక్కే అర్చకుని తన శిరస్సు, తొండం వంచి సగౌరవంగా ముందు నుంచి ఎక్కించుకునేది! మిగిలిన వారెవరైనా వెనకాల నుంచి కూర్చుని ఎక్కించుకునేది!

దేవుడి విగ్రహం చేతిలో లేకపోతే ఎంతటివారైనా సరే ముందు నుండి ఎక్కడానికి ఒప్పుకునేది కాదు! భగవంతునికే తాను దాసుడనని, మనిషికి కాదని తన ప్రవర్తనతో గట్టిగా



ఉద్ఘాటించేది కేశవన్! అలాగే వేరే ఊరు వెళ్ళినప్పుడు మావటి వాడికి గౌ రవం ఇచ్చి అతడు చెప్పినట్టు నడుచుకునే కేశవన్ గురువాయూర్లో మాత్రం తాను స్వతంత్రంగా ఉండేది! అయితే ఈ స్వతంత్రతలో ఎంతో క్రమశిక్షణ, నిబద్ధత ఉండేది.

జనాల యొక్క అదృష్టం ఎంతో వారి మరణ సమయంలో ప్రస్ఫుటమవుతుంది అంటారు. అది గజరాజైన కేశవన్ విషయంలో కూడా నిజమయ్యింది. గురువాయూర్ కృష్ణుని కైంకర్యంతో తన జన్మను సార్థకం చేసుకున్న కేశవన్ 70వ వయస్సులోకి ప్రవేశించగానే క్రమంగా శరీరంలో బలం సన్నగిల్లనారంభించింది. 1973లో అప్పటికి యాభై సంవత్సరాలుగా ఉత్సవ దిగ్గజంగా సేవలు అందించిన కేశవన్ని గురువాయూర్ ఆలయం వారు గొప్పగా సన్మానించి ఆలయ మర్యాదలతో, మిగిలిన ఏనుగులతో కవాతు నిర్వహించి కేశవన్ని 'గజరాజు' అనే బిరుదునిచ్చి గొప్పగా సత్కరించారు.

ప్రతీ సంవత్సరం డిసెంబర్ నెలలో వృశ్చిక మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశి ''గురువాయూర్ ఏకాదశి''గా, ''భూలోక వైకుంఠ ఏకాదశి''గా ప్రసిద్ధి. ఈ ఏకాదశికి నెల రోజుల ముందు నుంచి గురువాయూర్ కృష్ణుని సన్నిధిలో వేల కొలది దీపాలు వెలిగించి ఉత్సవాలు చేస్తారు. వృశ్చిక మాసపు శుక్ల అష్టమి నుంచి ఏకాదశి వరకు ఉత్సవాలు, ఊరేగింపులు కృష్ణ పరమాత్మకు విశేషంగా నిర్వహిస్తారు. అలాగే ఆ ఏకాదశి నాటి రాత్రి జాగరణతో ఆలయం భక్తులు అంతా చేరి వేల కొలది దీపాలు వెలిగించి స్వామికి నీరాజనాలు సమర్పిస్తారు. ఈ ఉత్సవాలలోనే కేశవన్ ఆస్థాన దిగ్గజంగా ప్రతీ ఏడూ స్వామిని భక్తి శ్రద్ధలతో తనపై మోస్తూ ఊరేగింపుకి తీసుకెళ్లేది!

కానీ వయసు పైబడ్డాక నిదానంగా కేశవన్కి ఉత్సాహం, బలం సన్నగిల్లాయి. 1976వ సంవత్సరంలో వచ్చిన గురువాయూర్ ఏకాదశి ఉత్సవాలలో కేశవన్ బాగా నీరసించిపోయింది. రెండు రోజుల ముందు అష్టమినాటి ఉత్సవంలో కాళ్ళు తడబడి తూలిన కేశవన్ వీపుపై నుంచి విగ్రహాలని జాగ్రత్తగా దించి మరో ఏనుగు పైకెక్కించారు నిర్వాహకులు. తరువాతి రోజు నవమి, దశమి నాటి ఉత్సవానికి కేశవన్కి ఓపిక రాలేదు.

ఏకాదశి నాడూ. తన జంతు జన్మకి చిట్టచివరి రోజు రానే వచ్చింది. ఏకాదశి రోజు ఎప్పటిలాగే ఉపవాసమున్న కేశవన్ అంత నీరసంలోనూ ఉదయం వెళ్ళి కృష్ణుని దర్శనం చేసు కుని తన తుది ఘడియలు సమీపిస్తున్నాయని గుర్తించి వడి వడిగాఅడుగులేసుకుంటూ గజశాల వద్దకి తిరిగి వచ్చి నేలపై కూలబడింది. బహుశా ఆలయంలో మరణిస్తే ఆలయం అ పవిత్రమవుతుందని అనుకుందో ఏమో! శరీరంలో సత్తువ పూర్తిగా కరిగిపోయిన కేశవన్ తన దంతాల సాయంతో శిరస్సుని అతి కష్టం మీద పైకెత్తి కృష్ణుని సన్నిధి ఉన్న దిక్కు వైపు తల తిప్పి తొండం పైకెత్తి 'కృష్ణా!''అంటూ పెద్ద ఘీంకారం చేసింది. అదే కేశవన్ తుది శ్వాస!

భగవన్నామ స్మరణలో తుది ఘీంకారంతో, తన ప్రాణవాయువుతో సహా తన జీవాత్మను కూడా బయటకి లాగి శ్రీకృష్ణుని పాదాల చెంత సమర్పించింది. పరమపద సామ్రాజ్యాన్ని అలంకరించింది.

అన్ని ఏనుగులలోకెల్లా విలక్షణమైన, విభిన్నమైన గజరాజు కేశవన్ సేవలని గురువాయూర్ దేవస్థానం గుర్తించి కేశవన్ స్మారక విగ్రహం చేయించి గజశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ప్రతీ సంవత్సరం గురువాయూర్ ఏకాదశి నాడు విధివత్తుగా కృష్ణునికి ధరింపచేసిన శేషవస్త్రం, పూలమాల, ప్రసాదం, నైవేద్యంతో ఆలయ మర్యాదలతో అధికారులు వచ్చి కేశవన్ విగ్రహానికి నివాళులర్పిస్తారు.

తరువాత ఆస్థాన ఏనుగులు కవాతు చేసి 'గజరాజు' కేశవన్కి గౌరవ వందనం సమర్పిస్తాయి. ఈ సంప్రదాయం ఇప్పటికీ మనం గురువాయూర్ వెళ్తే చూడవచ్చు.

అందుకే కులశేఖరులు మందమతియైన మనస్సును మందలిస్తూ, జాగు చేయకుండా శ్రీమన్నారాయణుని నామస్మరణను చేయమని నచ్చ చెబుతున్నారు. యముడి భయం గురించి చెప్పినా వినని మనస్సుని బ్రతిమాలుతున్నారు. మాట వినని కొడుకు కోసం బాధపడే తండ్రిని తలపించటమే కాక, మనస్సుకి నిజంగా నచ్చచెప్పినట్లు వుంది. ఆయనని ధ్యానిస్తే ఆ స్వామి మన దిగులుని తొలగించి, తన దగ్గరకు తీసుకుంటాడు. ''గజరాజు'' కేశవన్కి ఏ విధంగా తన వాత్సల్యాన్ని, అందించాడో మనం తెలుసుకున్నాం కదా! మరింకెందుకు ఆలస్యం ఆ శ్రీమన్నారాయణుని సదా ధ్యానిస్తూ వుంటే, ఆయనే మనలని కాపాడుతాడు.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

# జమ్మిచెట్టు ప్రాధాన్యత

- కౌతా నిర్మల

జమ్మిచెట్టును దేవతావృక్షంగా భావిస్తారు. పురాణాల్లో ఈ చెట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ చెట్టును శమీ వృక్షంగా కూడా పిలుస్తారు. శ్రీరాముడు సీతాదేవిని అన్వేషించబోయే ముందుగా జమ్మిచెట్టును పూజించినట్లుగానూ, అందువల్ల జమ్మిచెట్టును పవిత్ర వృక్షంగా భావిస్తారు. శివునికి ఉండే నామాల్లో 'శమీరోహ' అన్నది ఒక పేరు. శమీరోహ అంటే శమీవృక్షాన్ని అధిరోహించేవాడు అని అర్థం. గుజరాత్కు చెందిన భరవామలనే తెగవారు వివాహ సమయంలో స్తంభాలకు జమ్మిచెట్టు కొమ్మలను కడుతారు. వేదాలు జమ్మిచెట్టుకు అగ్నిని నిరోధించే శక్తి ఉందని తెలిపాయి. జమ్మి, రావి చెట్టు కొమ్మలను ఒకదానితో మరొకటి రుద్ది పురూరవుడు ప్రాచీనాగ్నిని పుట్టించాడని ఋగ్వేదంలో తెలుపబడింది. పంజాబ్లో పెళ్ళి సమయంలో పెళ్ళికూతురిని ఇంటికి తీసుకువచ్చే సందర్భంలో ముందుగా జమ్మిచెట్టు కొమ్మనొకదాన్ని నరుకుతారు. అందుకు కారణమేమిటంటే దెయ్యాలు ఆ చెట్టు మీద ఉంటాయనీ, కొమ్మను నరికితే అవి తమ నూతన వధువు జోలికి రావని, వారి దాంపత్యం అన్యోన్యంగా సాగుతుందని నమ్ముతారు.

మరాఠీలు జమ్మిచెట్టు మీద బాణాలు వేస్తారు. రాలిన ఆకులను తలపాగాలో పెట్టుకునే ఆచారం ఉంది. పూర్వం సంతానం కాని లేదా పుత్ర సంతానం లేని పురుషుడు రెండో పెళ్ళి చేసుకోవచ్చని మత్స్య పురాణం ద్వారా తెలుస్తోంది. అయితే రెండో పెళ్ళి చేసుకున్న తర్వాత కూడా పుత్ర సంతానం కలుగకపోతే, పురుషుడు మరో వివాహం చేసుకుంటే మరణిస్తాడనే నమ్మకం, అనుమానం ఆ ప్రాచీనులలో ఉండేది. ఆ కారణంగా వారసుడు లేకపోతే ఆ వ్యక్తికి జమ్మిచెట్టుతో పెళ్ళి జరిపించేవారు. ఒక శనివారం నాడు ఆదివారం నాడు సూర్య భగవానుడు, ఛాయాదేవి దైవానికి ప్రతిరూపంగా జమ్మి చెట్టును పూజించేవారు. ఆ వృక్షానికి నమస్కరించి, ఆ వృక్షాన్ని తన చేత్తో పట్టుకుని, బ్రహ్మచేత సృష్టించబడిన ఓ శమీవృక్ష దేవతా, నీవు నా భార్య కాబోతున్నావు. కనుక నా హితం కోరి నా ఆయుర్దాయాన్ని కాపాడు. మూడో వివాహం వల్ల జరిగే అనర్థాన్నుంచి నన్ను రక్షించు అని చెప్తాడు. అప్పుడు శమీ చెట్టుకు, ఆ పురుషునికి పెళ్లి జరిపిస్తాడు పురోహితుడు. వివాహం జరిపించబోయేముందు ఆదిత్యుని మునిమనుమరాలు, సరళాదేవి మనుమరాలు అయిన ఈ కన్య కశ్యప వంశానికి చెందినది. నా పుత్రిక అయిన ఆర్క కన్యను నీకు దానం చేస్తూ ప్రాణిగ్రహం జరిపిస్తున్నాను అని చెప్పి శమీవృక్షంతో ఆ పురుషుని పెళ్ళి తంతు జరిపిస్తారు.

ఆ తర్వాత తీపి పదార్థాలు, తేనె, పెరుగు నైవేద్యం పెడుతారు. శాస్త్రయుతంగా వివాహం జరిగిన తర్వాత దంపతులిద్దరి చుట్టూ (శమీవృక్షం, పురుషుడు) దారం కడుతారు. ఆ పురుషుని మణికట్టుకు ఒక చిన్న జమ్మి కొమ్మను కడుతారు. ఆ పురోహితునికి దక్షిణ తాంబూలం నూతన వస్త్రాలతోపాటుగా రెండు గోవులను దానం చేస్తారు. జమ్మిచెట్టుతో పెళ్ళి ఆ పురుషునికి మూడో పెళ్ళిగా పరిగణించబడుతుంది. కనుక ఆ తర్వాత ఆ పురుషుడు పుత్ర సంతానం కోసం మరో స్త్రీని పెళ్ళాడవచ్చు. మత్స్యపురాణంలో పురుషుని వివాహం జమ్మిచెట్టుతో జరిపించే ప్రసక్తి ఉంది.

మహాభారతంలో కూడా శమీవృక్ష ప్రసక్తి ఉంది. పాండవులు అజ్ఞాతవాస సమయంలో 12 సంవత్సరాల అరణ్యవాసం పూర్తయిన తర్వాత తమ రూపాలు మార్చుకుని ఒక సంవత్సరం పాటు విరాటుని కొలువులో అజ్ఞాతవాసం చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు దేవతలు తమకు ప్రసాదించిన ఆయుధాలను శమీవృక్షం పైన దాచిపెట్టారు. అజ్ఞాతవాసాన్ని పూర్తి చేసుకుని వచ్చి శమీవృక్షానికి నమస్కరించి పూజించి ప్రదక్షిణలు చేసి తమ ఆయుధాలను వృక్షం నుంచి తీసుకుని తమ ఆధీనం చేసుకున్నారు.

శమీ అంటే ఉపశమింపచేసేది అనే అర్థంగా భావిస్తారు. విజయదశమి రోజున శమీ వృక్షం వద్ద అపరాజితాదేవిని వృక్ష రూపంలో పూజిస్తే ఆ అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని చేపట్టిన పనిలో విజయం లభిస్తుందని శనిగ్రహదోషాలు తొలగిపోతాయని భక్తుల పరిపూర్ణ నమ్మకం. అందుకే ఆ వృక్షం చుట్టూతా ప్రదక్షిణలు చేస్తూ "శమీ శమీ యతే పాపం, శమీ శత్రు వినాశనం, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శిని" అనే శ్లోకాన్ని పఠిస్తారు. కొన్ని జమ్మి ఆకులను బంగారంగా చెపూ పెద్దవారికి ఇచ్చి వారి ఆశీర్వాదాలు అందుకుంటారు. శ్రీరాముడు, రావణాసురునితో యుద్ధం చేయటానికి బయల్దేరబోయే ముందు ఆదిపరాశక్తిని జమ్మి ఆకులతో పూజించి, రావణ సైన్యాన్ని ఎదుర్కొన్నాడని పురాణ కథనం.

జమ్మి ఆకు చెట్టు బెరడు, పూలు, వేళ్ళు ఆయుర్వేద వైద్యంలో అనారోగ్యాలకు చికిత్సగా వాడబడుతోంది. ఆధ్యాత్మిక, ఆయుర్వేదపరంగా శమీవృక్షం ఎంతో ప్రసిద్ధి చెందింది.

★★★

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు ప్రతి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. గురు బలం లేదు. సాయిబాబాను, దక్షిణామూర్తిని పూజించాలి. వ్యాపార వ్యవహారాల్లో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. తెలియకుండా, ఊహించని విధంగా ఖర్చులు రాగలవు. ఖర్చులను అదుపులో పెట్టుకొని, చాకచక్యంగా నడుచుకోవాలి. నిర్లక్ష్యం వలన ఆకస్మిక ప్రమాదాలు.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంటుంది. మాటలతో కాలయాపన చేయకూడదు. నిర్లక్ష్యంగా ఉండరాదు. ప్రతి నిమిషంలో మీకు అనుకూల వాతావరణం ఉంది. విఘ్నేశ్వరుడిని మనస్ఫూర్తిగా ఆరాధిస్తే మీకు ఏమీ అవసరమో అవి ఇస్తాడు.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు గ్రహ కలయిక వలన కొంత ఉపశాంతి ఉంటుంది. పట్టుదలతో కార్యసాధన చేసి, విజయం సాధించండి. కుటుంబంలో అందరూ కలిసి మెలిసి మాట్లాడుకోవడం వలన సుఖ సంతోషాలతో పాటు అనుకోని విధంగా లాభం ఉంటుంది. నవగ్రహ ప్రదక్షిణలు 45 సార్లు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు తెలియని అనారోగ్య సమస్యలు వస్తాయి. అకస్మికంగా ధన వ్యయం వల్ల మనసులో భయం ఉంటుంది . విఘ్నేశ్వరుడి పూజ సంతృప్తినిస్తుంది. ఆర్థికంగా లోటు రాకుండా లక్ష్మీ కుబేరుడి పూజలు చేస్తే, తప్పకుండా ఫలితాలు వస్తాయి. మీ నమ్మకమే మీ బలం.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు బంధు మిత్రులను కలిసినప్పుడు, వారితో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. నిబంధనల ప్రకారం నడుచుకుంటే విజయం ఉంటుంది. అకస్మిక ధన లాభం ఉంది. ఉద్యోగ లాభం, శుభకార్యాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. విఘ్నేశ్వర ఆరాధనతో ఈ నెల గడిచిపోతుంది. నిరంతరం దైవ నామస్మరణ చేయడం మంచిది. రోజూవారి జీవితంలో అనేక సమస్యలు వస్తాయి. వీటిని పట్టించుకోరాదు. లక్ష్మీ విఘ్నేశ్వర హోమం చేయించండి. ఆందోళనకు గురికాకండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు గ్రహల కలయిక లేక మిత్రులు, శత్రువులుగా మారుతారు. గతంలో జరిగినవి గుర్తుచేసుకొని ఏదో ఒక విషయంలో కక్ష సాధించే ప్రయత్నం చేస్తారు. అధికారులతో తోటివారితో చాలా జాగ్రత్తగా మాట్లాడండి. లక్ష్మీ విఘ్నేశ్వర పారాయణం, సుదర్శన హోమం చేయించండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వస్తు వాహన, ఆభరణాల ప్రాప్తి, తెలియని విధంగా ధనాదాయం కలిగి ఉన్నారు. ఆధ్యాత్మిక విషయంలో శ్రద్ధ చూపగలరు. మానసికంగా చాలా ప్రశాంతంగా ఉంటారు. మహాన్యాస రుద్రాభిషేకం చేయించుకోగలరు.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వినాయకునికి పూజలు, లక్ష్మి గణపతి హోమం చేయడం వల్ల డబ్బుల ఇబ్బందులు తొలగిపోతాయి. ఆర్థిక లావాదేవీలు సర్దుబాటు అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి. అనారోగ్యం సమస్యలు ఉన్నాయి. ధ్యానం, యోగా, ఆయుర్వేదంతో నివారణ జరుగును. తెల్లవారుజామున స్నానం చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ప్రధానంగా వినాయకుడికి పూజలు చేసిన తర్వాత లక్ష్మీవిఘ్నేశ్వర హోమం చేయండి. శత్రుశేషం ఉంది. సుదర్శన హోమం చేస్తే ఆర్థికంగా శక్తిమంతులు అవుతారు. అనుమానంతో ఏ పనిచేసిన ఫలితం ఉండదు.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు శుభవార్తలు వింటారు. అకస్మిక ధన లాభం ఉన్నాయి. వినయవిధేయులుగా ఉండండి. మీ టాలెంట్‌కు ఇది పరీక్ష కాలం. విఘ్నేశ్వర పూజలు చేయడం వలన ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారు. మీ అవసరాల కోసం డబ్బును అంతగా ఖర్చు పెట్టరు. ఖర్చులు కొంచెం తగ్గుతాయి. నిత్యదీపారాధన చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో ఎదో ఒక ఆటంకం కలుగుతుంది. విఘ్నేశ్వరుడి ముందు ప్రతి రోజు 11 సార్లు గుంజిల్లు తీయండి. మీకున్న ఆటంకాలన్నీ తొలగిపోతాయి. సామరస్య ధోరణితో ఆనందాన్ని పొందగలరు. తొందరపాటు వలన మానసిక ఒత్తిడికి గురవుతారు. ఇష్టమైన దైవాన్ని ఆరాధించండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. శ్రీకృష్ణుని గురువు ఎవరు?
2. అన్నగారి మాటను పాటించి శిక్ష పొందిన ఉత్తముడెవరు?
3. పద్మావతీ అమ్మవారి పుట్టింటివారు ఎవరు?
4. "దీర్ఘదర్శి"అంటే అర్థం ఏమిటి?
5. అమ్మవారి చేతనే సాక్ష్యం చెప్పించిన భక్తాగ్రేసరి ఎవరు?
6. లిఖితునికి చేతులు ఇచ్చిన నది పేరేమిటి?
7. గణేశుడు జపించిన మంత్రమేది?
8. రావణుడు సీతను ఏ సమయంలో అపహరించాడు?
9. కలియుగంలో గణేశుని పేరేమిటి?
10. బలి చక్రవర్తి భార్య పేరు ఏమిటి?
11. హథీరాం బాబా గురువెవరు?
12. పద్మావతీదేవిని బంధించినదెవరు?
13. ధ్రువుని తండ్రి ఎవరు?
14. అనంత పద్మనాభ వ్రతం ఎప్పుడు చేయాలి?
15. బలిచక్రవర్తి స్థిరపడిన లోకమేది?

1. __________________
2. __________________
3. __________________
4. __________________
5. __________________
6. __________________
7. __________________
8. __________________
9. __________________
10. __________________
11. __________________
12. __________________
13. __________________
14. __________________
15. __________________

పేరు: __________________

చిరునామా: __________________

పిన్‌కోడ్: __________________

ఫోన్: __________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. ఈశ్వరయ్య, 2. కీ.శే. గవర్రాజు, 3. శ్రావణమాసం, 4. సుదర్శన, 5. ఇంద్రుడు, 6. మహాలక్ష్మి, 7. లవణసముద్రంలో, 8. తిరుచానూరులో 9. మధకైటభులు, 10. శ్రావణ పూర్ణిమానాడు, 11. కొప్పెర, 12. అభంగాలు, 13. మహామాయ, 14. ఇంద్రాణినదిలో 15. క్షమాగుణం

## సరైన సమాధానాలు రాసినవారు

1. సి.హెచ్. కృష్ణకిషోర్, 2. చిల్లరి సీతారామారావు, 3. వనమాల రామలింగాచారి, 4. బులుసు బాబూరావు, 5. సుజాత, 6. రాఘవులు

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**బులుసు బాబురావు**

## తేది 07-09-2023 గోకులాష్టమి రోజున తిరుమల శ్రీవేంకటేశ్వరునికి
## 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు













Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక





**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq